# భవిష్యత్ ప్రజాపాలన

మా వార్త రేపటి భవిష్యత్‌కు నిదర్శనం

తెలుగు దినపత్రిక

ASN NEWS

bhavishyatprajapalana.in / epaper.bhavishyatprajapalana.in

ఎడిటర్ : చిట్ల విజయ్‌కుమార్ రెడ్డి తెలంగాణ - రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 263 శనివారం , అక్టోబర్ 24, 2026 , పేజీలు - 12 వెల : 1 /-

# సమన్వయంతో నేరాలను అరికడదాం

## హైదరాబాద్ ఎస్ఆర్‌పీసీసీ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం
- సాంకేతిక పరిజ్ఞానంతో పటిష్ఠమైన పోలీసు వ్యవస్థ నిర్మాణం
- దక్షిణ భారతదేశాన్ని సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దాలి

**హైదరాబాద్, అక్టోబర్ 23:** దక్షిణాది రాష్ట్రాల పోలీసు బలగాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రాల సరిహద్దులతో సంబంధం లేకుండా పోలీసులు పరస్పరం సమన్వయంతో పనిచేసేలా పటిష్ఠ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. హైదరాబాద్‌లోని 'ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్' (ఐసీసీసీ)లో శుక్రవారం జరిగిన దక్షిణ ప్రాంతీయ పోలీసు సమన్వయ కమిటీ (ఎస్ఆర్‌పీసీసీ)

మిగతా 2లో

# కేసీఆర్ సీఎం కావడం ఖాయం

## దేశ రాజకీయాల్లో కేసీఆర్ చక్రం తిప్పే రోజులు వస్తున్నాయి: కేటీఆర్

- రేవంత్ రెడ్డి పాలన తాత్కాలికమేనని, త్వరలో కేసీఆర్ సీఎం అవుతారని ధీమా
- కాంగ్రెస్, బీజేపీయేతర కూటమి దేశంలో కీలకపాత్ర పోషిస్తుందని జోస్యం
- కరెంట్ కోతలతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ప్రభుత్వంపై విమర్శ
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు యువత తగిన గుణపాఠం చెబుతుందన్న కేటీఆర్

**హైదరాబాద్, అక్టోబర్ 23:** దేశ రాజకీయాల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక పాత్ర పోషించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, ఆయన జాతీయ స్థాయిలో చక్రం తిప్పే సమయం ఆసన్నమైందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వ హడావిడి కొద్దిరోజులు మాత్రమేనని, ఆ తర్వాత మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన అంబర్‌పేట నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నేతల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

మిగతా 2లో

# ప్రియాంక వర్సెస్ రాహుల్..

## బీజేపీ సంచలన ఆరోపణలు

- రైహాన్ ఎగ్జిబిషన్ వివాదంపై రాహుల్ మౌనాన్ని ప్రశ్నించిన భండారీ
- రైహాన్ వివాదంపై ఇప్పటి వరకు బహిరంగంగా స్పందించని రాహుల్

**న్యూ ఢిల్లీ, అక్టోబర్ 23:** కాంగ్రెస్‌లో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మధ్య అంతర్గత పోరు సాగుతోందని బీజేపీ ఆరోపించింది. ప్రియాంక కుమారుడు రైహాన్ వాద్రా ఫొటో ఎగ్జిబిషన్‌లో కొన్ని చిత్రాలను తొలగించిన వివాదంపై రాహుల్ గాంధీ

మిగతా 2లో

# అరుణాచల్‌ప్రదేశ్ సరిహద్దులో చైనా కవ్వింపు

- ఘర్షణల్లో శౌర్య కమాండోలు ప్రతిభ చూపారని ప్రశంస
- చైనాతో 3,488 కిలోమీటర్ల ఎల్ఏసీకి ఐటీబీపీ కాపలా
- అన్ని సరిహద్దు యూనిట్లలో డ్రోన్ ప్లటూన్ల ఏర్పాటు
- గల్వాన్ తరహా పరిస్థితుల కోసం ప్రత్యేక శిక్షణ
- ఐటీబీపీ డీజీ శత్రుజీత్ కపూర్

2లో.

# మహారాష్ట్రతో చర్చలకు సిద్ధం కండి

## తుమ్మిడిహట్టి బ్యారేజీపై అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

- బ్యారేజీ ఎత్తు, ముంపు ప్రభావంపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచన
- అక్టోబర్ 23 తర్వాత మహారాష్ట్ర సీఎంతో చర్చలు జరపనున్నట్టు వెల్లడి

**హైదరాబాద్, అక్టోబర్ 23:** రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో నిర్వహించనున్న చర్చలకు సర్వసన్నద్ధంగా ఉండాలని

మిగతా 2లో

# 54 మందిపై కేసులు నమోదు

## ఏపీలో నామినేషన్ల హింస..

- 54 మందిపై కేసులు నమోదు చేశామన్న డీజీపీ
- 13 జిల్లాల్లో 31 ఘర్షణలు, దాడుల కేసుల నమోదు
- వాహనాల దహనం, జేసీబితో ఇల్లు కూల్చివేత
- ఓ అభ్యర్థిని తరలిస్తున్న పోలీసు వాహనంపై దాడి

2లో.

# మూడు దశల్లో లక్ష ఫ్లాట్ల నిర్మాణం

- ఇందిరమ్మ టవర్ల నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక ఆదేశాలు
- ఈ నెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి సూచన
- లాటరీ ప్రక్రియను యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేసి పారదర్శకత పాటించాలని స్పష్టం

**హైదరాబాద్, అక్టోబర్ 23:** హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో ప్రతిపాదించిన ఇందిరమ్మ టవర్ల నిర్మాణం కోసం యుద్ధప్రాతిపదికన భూములను గుర్తించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.

మిగతా 2లో

2లో.

# 100 పతకాల మార్క్ దాటిన భారత్

- ఏషియన్ పారా గేమ్స్: ప్రపంచ రికార్డుల మోత..
- ఏషియన్ పారా గేమ్స్‌లో ఐదో రోజు భారత్‌కు స్వర్ణాల పంట
- షూటర్ మోనా అగర్వాల్ ప్రపంచ రికార్డుతో రెండో స్వర్ణం కైవసం
- అథ్లెటిక్స్‌లో ప్రపంచ రికార్డులతో సందీప్ కుమార్, హనీలకు పసిడి పతకాలు
- 100 పతకాల మైలురాయిని దాటిన భారత బృందం
- బ్యాడ్మింటన్, ఆర్చరీలోనూ భారత్‌కు స్వర్ణ పతకాలు

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

## : చంద్రబాబుపై జగన్ ఫైర్

- నామినేషన్ కేంద్రాల్లో వైసీపీ అభ్యర్థులపై దాడులు చేశారన్న జగన్
- వైసీపీ నేతలను గృహ నిర్బంధం చేస్తున్నారని మండిపాటు
- సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత కూడా ప్రభుత్వ వైఖరిలో మార్పు రాలేదని విమర్శ

2లో.

# నేడు ఢిల్లీకి చంద్రబాబు

- అర్ధరాత్రికి మళ్లీ అమరావతికి చేరుకోనున్న సీఎం
- కేంద్ర పెద్దలను కలిసే అవకాశం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు ఢిల్లీలో పర్యటించనున్నారు. ఇది కేవలం ఒక్కరోజు పర్యటన మాత్రమే కావడం గమనార్హం.

2లో.

# సమన్వయంతో నేరాలను అరికడదాం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళం రాష్ట్రాల డీజీపీలు, ఐజీలు, అండమాన్ నికోబార్ దీవులు, పుదుచ్చేరి, లక్షద్వీప్ ప్రతినిధులు, కేంద్ర దర్యాప్తు సంస్థల ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. దక్షిణ భారతదేశాన్ని సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దే బాధ్యత పోలీసు అధికారులపై ఉందని సీఎం పేర్కొన్నారు. పొరుగు రాష్ట్రాలతో సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఐసీసీసీ వ్యవస్థలను పంచుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. నేరాల స్వరూపం మారుతున్న నేపథ్యంలో పోలీసింగ్ విధానాల్లోనూ నిరంతర సంస్కరణలు అవసరమని రేవంత్‌రెడ్డి అన్నారు. పోలీసులకు కేటాయించే నిధులను ఖర్చుగా కాకుండా మెరుగైన సమాజ నిర్మాణానికి, ప్రజల భద్రతకు చేసే పెట్టుబడిగా చూడాలని చెప్పారు. ప్రజలు సమర్థంగా పనిచేసే, నైతిక విలువలను పాటించే, పక్షపాతం లేకుండా వ్యవహరించే పోలీసు వ్యవస్థను ఆశిస్తున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ పోలీసు వ్యవస్థను మూడు కమిషనరేట్లుగా పునర్వ్యవస్థీకరించామని సీఎం తెలిపారు. దీనివల్ల ప్రతి పోలీసు కమిషనర్ తన పరిధిపై ప్రత్యేకంగా దృష్టి సారించే అవకాశం ఉంటుందన్నారు. వివిధ రకాల నేరాల నియంత్రణ కోసం హైడ్రా, ఈగల్, టీ-సేఫ్ వంటి ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ట్రాఫిక్ సమస్యలు ప్రస్తుతం కీలక సవాళ్లుగా మారాయని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. వీటిని ఎదుర్కొనేందుకు సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, సిబ్బందికి శిక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని ప్రధాని అధ్యక్షతన జరిగిన ప్రగతి సమీక్ష సమావేశంలో గుర్తించినట్లు సీఎం తెలిపారు. తెలంగాణను నక్సలిజం రహిత రాష్ట్రంగా మార్చడంలో పోలీసుల కృషిని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశంసించారని చెప్పారు. మాదకద్రవ్యాల నియంత్రణలో ఈగల్ విభాగానికి కేంద్ర ప్రభుత్వం 80 శాతానికి పైగా స్కోరు ఇచ్చిందన్నారు. సైబర్ నేరాల్లో బాధితులు కోల్పోయిన డబ్బును తిరిగి ఇప్పించడంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోందని పేర్కొన్నారు. ఆహార కల్తీని అరికట్టడం, ఔషధాల నియంత్రణ కోసం అమెరికా ఎఫ్‌డీఏ తరహాలో వివిధ శాఖల మధ్య సమన్వయం కల్పించేలా టీ-సేఫ్ విభాగాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. చెరువులు, సరస్సులు, ఇతర జలవనరులను పరిరక్షించి పునరుద్ధరించడంలో హైడ్రా కృషికి ప్రజల నుంచి ప్రశంసలు లభిస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ, ప్రజా ఆస్తుల పరిరక్షణకు కూడా ఈ సంస్థ పనిచేస్తోందన్నారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసు విభాగంలో ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమించిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని సీఎం పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలను సైతం పణంగా పెట్టే పోలీసు సిబ్బంది సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తు తనకు అత్యంత ప్రాధాన్యమని తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్, కర్ణాటక డీజీపీ ఎం.ఏ.సలీం, తమిళనాడు డీజీపీ మహేశ్ అగర్వాల్, పుదుచ్చేరి డీజీపీ షాలినీ సింగ్, లక్షద్వీప్ ఏడీజీపీ బి.శంకర్ జైస్వాల్, కేరళం ఐజీ అజితా బేగం, ఏపీ ఐజీపీ రవికృష్ణ, ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ తదితరులు పాల్గొన్నారు

# 100 పతకాల మార్క్ దాటిన భారత్

**ఏషియన్ పారా గేమ్స్: ప్రపంచ రికార్డుల మోత..**

**న్యూ ఢిల్లీ, అక్టోబర్ 23:** ఐచి-నగోయా వేదికగా జరుగుతున్న 2026 ఏషియన్ పారా గేమ్స్‌లో భారత క్రీడాకారులు విశ్వరూపం ప్రదర్శిస్తున్నారు. ఐదో రోజు మన అథ్లెట్లు ప్రపంచ రికార్డుల మోత మోగించి స్వర్ణాల వర్షం కురిపించారు. ఈ అద్భుత ప్రదర్శనతో భారత్ పతకాల సంఖ్య 100 మైలురాయిని దాటింది. షూటింగ్‌లో మోనా అగర్వాల్ అద్భుతం చేసింది. మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఎస్‌హెచ్1 విభాగంలో 357.5 స్కోరుతో ప్రపంచ రికార్డు సృష్టించి పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ గేమ్స్‌లో ఆమెకు ఇది రెండో స్వర్ణం కావడం విశేషం. చైనా క్రీడాకారిణి కుయిపింగ్ జాంగ్‌పై 3.8 పాయింట్ల భారీ ఆధిక్యంతో మోనా విజయం సాధించింది. అథ్లెటిక్స్‌లోనూ భారత హవా కొనసాగింది. టీ44 400 మీటర్ల స్ప్రింట్‌లో సందీప్ కుమార్ కేవలం 52.28 సెకన్లలో లక్ష్యాన్ని పూర్తి చేసి ప్రపంచ రికార్డుతో స్వర్ణం గెలుచుకున్నాడు. ఈ పతకంతో భారత్ పతకాల సంఖ్య 100 దాటింది. ఇదే ఈవెంట్‌లో అజయ్ కుమార్ 53.61 సెకన్లతో కాంస్య పతకం సాధించాడు. జావెలిన్ త్రో ఎఫ్37 విభాగంలో హనీ తన చివరి ప్రయత్నంలో 60.49 మీటర్లు విసిరి ప్రపంచ రికార్డు నెలకొల్పి స్వర్ణ పతకాన్ని ముద్దాడాడు.

ఇతర క్రీడల్లోనూ భారత్ సత్తా చాటింది. పురుషుల సింగిల్స్ ఎస్ఎల్3 బ్యాడ్మింటన్ ఆల్-ఇండియన్ ఫైనల్‌లో ప్రమోద్ భగత్‌ను ఓడించి నితేష్ కుమార్ స్వర్ణం గెలుచుకోగా, ప్రమోద్ రజతంతో సరిపెట్టుకున్నాడు. పారా ఆర్చరీ పురుషుల రికర్వ్ టీమ్ ఈవెంట్‌లో హర్విందర్ సింగ్, విజయ్ సుండి ద్వయం 5-1 తేడాతో చైనాపై గెలిచి పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది.

# మూడు దశల్లో లక్ష ఫ్లాట్ల నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లతో కలిసి 'క్యూర్' ఇందిరమ్మ టవర్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకాల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, క్యూర్ పరిధిలో మూడు దశల్లో మొత్తం లక్ష ఇందిరమ్మ ఫ్లాట్లను నిర్మించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం కొనసాగుతున్న మొదటి దశతో పాటు, రెండు, మూడవ దశలకు అవసరమైన భూములను త్వరితగతిన సేకరించాలని అధికారులకు సూచించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఈ నెలాఖరు నాటికి అత్యంత పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపిక కోసం నిర్వహించే లాటరీ ప్రక్రియను యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. నగరంలోని పేదలకు వారి నివాస ప్రాంతాలకు, ఉపాధి మార్గాలకు సమీపంలోనే గృహ వసతి కల్పించాలనేదే ఇందిరమ్మ టవర్ల ప్రధాన ఉద్దేశమని మంత్రి వివరించారు. పేదలను నగర శివార్లకు తరలించకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ పథకం కింద లబ్ధి పొందే వారికి ఫ్లాట్‌పై పూర్తి యాజమాన్య హక్కులతో పాటు, అవిభాజ్య భూమి వాటాను ఎటువంటి రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా అందజేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి శంకుస్థాపనలు జరిగాయని, కొన్ని ప్రాంతాల్లో టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందని మంత్రి గుర్తుచేశారు. లబ్ధిదారుల అర్హతలను నిశితంగా పరిశీలించిన తర్వాత బహిరంగ డ్రాల ద్వారా ఎంపిక ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే లక్షలాది ఇళ్లను మంజూరు చేసిన ఇందిరమ్మ పథకంలో భాగంగా, పట్టణ ప్రాంత గృహ నిర్మాణానికి కూడా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. భూముల గుర్తింపుతో పాటు ఇతర అనుబంధ ప్రక్రియలను వేగవంతం చేసి, ప్రాజెక్టుల నిర్మాణ వేగాన్ని కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.

# ప్రియాంక వర్సెస్ రాహుల్.. : బీజేపీ సంచలన ఆరోపణలు

(మొదటి పేజీ తరువాయి)

స్పందించకపోవడాన్ని ఆ పార్టీ ప్రస్తావించింది. ఈ వివాదాన్ని సృష్టించి తన కుమారుడిని రాజకీయంగా తెరపైకి తీసుకొచ్చేందుకు ప్రియాంక ప్రయత్నిస్తున్నారని బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ విమర్శించారు. రాహుల్‌పై ప్రియాంకకు రాజకీయ విశ్వాసం తగ్గిందా? అని ప్రశ్నించారు. వ్యక్తిగత పర్యటన కోసం గత ఆదివారం వియత్నాం వెళ్లిన రాహుల్ గాంధీ.. రైహాన్ ఎగ్జిబిషన్ వివాదంపై ఇప్పటివరకు బహిరంగంగా స్పందించలేదు. ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌లో ప్రియాంక వర్సెస్ రాహుల్ పరిస్థితి నెలకొందని భండారీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. అయితే, కొన్ని రోజుల క్రితమే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో రాహుల్, ప్రియాంక కలిసి పాల్గొన్న విషయం తెలిసిందే. ఢిల్లీలో ఇటీవల జరిగిన విద్యార్థుల నిరసనలకు సంబంధించిన ఫొటోలను తన ఎగ్జిబిషన్ నుంచి తొలగించారని కళాకారుడు, ఫొటోగ్రాఫర్ రైహాన్ వాద్రా బుధవారం వెల్లడించారు. 'నో ఐడియా ఈజ్ ఫైనల్' పేరుతో బికనీర్ హౌస్‌లో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్ ప్రారంభానికి కొన్ని గంటల ముందు 105 ఫొటోల్లో 74 చిత్రాలను తొలగించాలని లేదా వాటి స్థానంలో వేరేవి పెట్టాలని నిర్వాహకులు కోరినట్లు రైహాన్ తెలిపారు. ప్రదర్శన ప్రారంభమయ్యే సమయానికి 35 ఫ్రేములు మాత్రమే మిగిలాయని చెప్పారు. ఈ చిత్రాల సేకరణ కోసం మూడేళ్లు కష్టపడ్డానని పేర్కొన్నారు. అక్టోబరు 15నే ఎగ్జిబిషన్ లేఅవుట్‌ను బికనీర్ హౌస్ యాజమాన్యానికి పంపించానని, దానికి సంబంధించిన అంగీకార సమాచారం కూడా అందిందని రైహాన్ వెల్లడించారు. చిత్రాల ఏర్పాట్లు ప్రారంభించిన తర్వాతే అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని ఆయన తండ్రి రాబర్ట్ వాద్రా తెలిపారు. మరోవైపు, తమ ప్రాంగణ విధానాలకు అనుగుణంగా లేవని గుర్తించిన ఫొటోలను తొలగించాలని కోరినట్లు బికనీర్ హౌస్ ప్రకటించింది. ఈ వివాదంపై స్పందించిన ప్రియాంక గాంధీ.. యువత గొంతును అణచివేసే ప్రయత్నంగా అభివర్ణించారు. రైహాన్ పంపిన ఇమెయిల్, ఎగ్జిబిషన్ ప్రతిపాదనకు సంబంధించిన స్క్రీన్‌షాట్లను బీజేపీ పంచుకుంది. జూన్ 10న పంపిన ప్రతిపాదనలో ప్రకృతి, వన్యప్రాణులు, అబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్, పోర్ట్రెయిట్లు, శిల్పాల వంటి అంశాలే ఉన్నాయని భండారీ పేర్కొన్నారు. అందులో రాజకీయ అంశాల ప్రస్తావన లేదని అన్నారు. జూన్ 30న బికనీర్ హౌస్ ఈ ప్రతిపాదనను అంగీకరించిందని బీజేపీ తెలిపింది. అక్టోబరు 21న బికనీర్ హౌస్ యాజమాన్యం రైహాన్‌కు నోటీసు పంపి 74 ఫొటోలను తొలగించాలని కోరినట్లు భండారీ పేర్కొన్నారు. తొలుత రాజకీయ అంశాలు లేని ప్రదర్శనకు అంగీకారం పొందిన తర్వాత, కుటుంబం ఒత్తిడితో రాజకీయ ఫొటోలను చేర్చి ఉంటారని ఆరోపించారు. ఈ ఇమెయిళ్లు, ప్రతిపాదనలు ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ చేస్తున్న వాదనల్లోని అసత్యాలను బయటపెడుతున్నాయని బీజేపీ విమర్శించింది.

# కేసీఆర్ సీఎం కావడం ఖాయం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. తీవ్రమైన విద్యుత్ కోతల వల్ల రైతులు అల్లాడుతున్నారని, వారి కష్టాలను పట్టించుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంపై నిపుణులు పది నెలల ముందే హెచ్చరించినప్పటికీ, ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమైందని మండిపడ్డారు. కాంగ్రెస్ హామీలను నమ్మి మోసపోయిన అన్ని వర్గాల ప్రజలు ఇప్పుడు మళ్లీ బీఆర్ఎస్ వైపే చూస్తున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి హడావిడి మరికొద్దిరోజులు మాత్రమే ఉంటుందని కేటీఆర్ పేర్కొన్నారు.

జాతీయ రాజకీయాల గురించి ప్రస్తావిస్తూ, భవిష్యత్తులో కాంగ్రెస్, బీజేపీయేతర పార్టీలే దేశంలో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తాయని కేటీఆర్ జోస్యం చెప్పారు. రాహుల్ గాంధీ ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆశించిన ఫలితం ఉండదని, అటు ప్రధాని మోదీ పాలనలోనూ దేశానికి చేకూరిన ప్రయోజనం ఏమీ లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలంగాణ నుంచి గెలిచిన ఎంపీలెవరూ పార్లమెంటులో గళం విప్పడం లేదని ఆయన దుయ్యబట్టారు.

రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు యువత తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాల వల్లే నేడు యువత రోడ్లపైకి వచ్చి పోరాటాలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలు రాష్ట్ర అభివృద్ధిని విస్మరించి, కేవలం ప్రతిపక్షాలను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఆయన ఆరోపించారు.

# అరుణాచల్‌ప్రదేశ్ సరిహద్దులో చైనా కవ్వింపు

**న్యూ ఢిల్లీ, అక్టోబర్ 23:** అరుణాచల్‌ప్రదేశ్ సరిహద్దులో చైనా సైనికులతో పలుచోట్ల ముఖాముఖి ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయని ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) డైరెక్టర్ జనరల్ శత్రుజీత్ కపూర్ వెల్లడించారు. ఈశాన్య సరిహద్దులో ప్రస్తుత పరిస్థితిపై అధికారికంగా ఈ స్థాయిలో వెల్లడించడం ఇదే తొలిసారి అని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. "గత కొన్ని రోజులుగా అరుణాచల్‌లో పలుచోట్ల చైనా సైనికులతో ముఖాముఖి పరిస్థితులు ఏర్పడ్డాయి. అవి ఇంకా కొనసాగుతున్నాయి" అని ఐటీబీపీ సిబ్బంది వార్షిక సత్కార కార్యక్రమంలో కపూర్ తెలిపారు. ఈ పరిణామాల్లో ఐటీబీపీకి చెందిన శౌర్య కమాండోలు అసాధారణ ప్రతిభ కనబరిచారని ప్రశంసించారు. ఎత్తైన పర్వత ప్రాంతాల్లో యుద్ధం చేయడంలో ప్రత్యేక శిక్షణ పొందినవారే శౌర్య కమాండోలు. సరిహద్దుల్లో వీరు కీలక పాత్ర పోషిస్తున్నారని ఐటీబీపీ చీఫ్ చెప్పారు. 1962లో ఏర్పాటైన ఈ బలగం చైనాతో ఉన్న 3,488 కిలోమీటర్ల వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి కాపలా బాధ్యతలు చూస్తుంటుంది.

2004లో సరిహద్దు రక్షణ బాధ్యతలు అప్పగించినప్పటికీ, పర్వత ప్రాంతాల్లో గెరిల్లా యుద్ధానికి సంబంధించిన తమ అసలు నైపుణ్యాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందని కపూర్ పేర్కొన్నారు. చైనాతో ఉన్న సరిహద్దు అత్యంత క్లిష్టమైనదని ఐటీబీపీ డీజీ అభిప్రాయపడ్డారు. సరిహద్దు ప్రాంతాల్లోని అన్ని యూనిట్లలో డ్రోన్ ప్లటూన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గల్వాన్ లోయ తరహా పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక పోరాట శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించినట్లు చెప్పారు. భూగర్భ మౌలిక సదుపాయాలను కూడా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. అయితే తాజా ముఖాముఖి ఘటనలు ఏ ప్రాంతాల్లో జరిగాయి? ఎంతమంది సైనికులు పాల్గొన్నారు? ఎలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి? అనే వివరాలను ఐటీబీపీ చీఫ్ వెల్లడించలేదు.

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు: చంద్రబాబుపై జగన్ ఫైర్

**అమరావతి, అక్టోబర్ 23:**

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని వైసీపీ అధినేత జగన్ ఆరోపించారు. రాష్ట్రంలో రావణకాసుర పాలన నడుస్తోందని ఆయన మండిపడ్డారు. నామినేషన్ కేంద్రాల వద్ద వైసీపీ అభ్యర్థులపై దాడులు చేసి, వారి నామినేషన్ పత్రాలను చించివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ నేతలను పోలీసులు గృహ నిర్బంధం చేయడం, పోలీస్ స్టేషన్లకు పిలిపించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ అక్రమాలపై తాము ఆధారాలు సేకరించి రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ), గవర్నర్‌తో పాటు సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించామని తెలిపారు.

తమ పిటిషన్‌పై స్పందించిన సుప్రీంకోర్టు, అభ్యర్థుల తుది జాబితా ప్రకటనను అక్టోబర్ 25 వరకు వాయిదా వేయాలని, నామినేషన్ల దాఖలుకు స్వేచ్ఛ కల్పించాలని, అభ్యర్థులకు రక్షణ, సీసీటీవీ రికార్డింగ్ ఏర్పాటు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని జగన్ గుర్తుచేశారు. అయినప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలోని 19 మున్సిపాలిటీలలో తమ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, కానీ ఎస్ఈసీ కేవలం పరిమిత సంఖ్యలో కొన్ని చోట్ల మాత్రమే రీ-నామినేషన్లకు అవకాశం ఇచ్చిందని జగన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏకపక్ష విజయాల కోసం చంద్రబాబు నిబంధనలు మార్చుతున్నారని, ఇది మహాభారతంలోని మాయాజూదాన్ని తలపిస్తోందని ఆయన విమర్శించారు.

# నేడు ఢిల్లీకి చంద్రబాబు

**అమరావతి, అక్టోబర్ 23:**

నేడు మధ్యాహ్నం అమరావతి నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరి, అక్కడ అధికారిక కార్యక్రమాలు ముగించుకుని అదే రోజు అర్ధరాత్రికి తిరిగి అమరావతి చేరుకుంటారు.

ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంలోని పలువురు ముఖ్య నేతలతో భేటీ అయ్యే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. రాష్ట్రానికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్ అంశాలు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై చర్చించే వీలుంది. అలాగే ఢిల్లీలోని జన్‌పథ్‌లో జరగనున్న ఒక ప్రత్యేక అధికారిక కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని తెలుస్తోంది. అయితే, ఢిల్లీ పర్యటనకు సంబంధించిన పూర్తి షెడ్యూల్, ఎవరెవరితో సమావేశమవుతారనే వివరాలు అధికారికంగా వెలువడాల్సి ఉంది.

# మహారాష్ట్రతో చర్చలకు సిద్ధం కండి

(మొదటి పేజీ తరువాయి)

అధికారులను ఆదేశించారు. రైతుల ప్రయోజనాలే పరమావధిగా ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ప్రధానంగా తుమ్మిడిహట్టి, దిండి, అచ్చంపేట ఎత్తిపోతల పథకాలపై చర్చించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే ఎల్లంపల్లి వరకు నీటిని తరలించే అవకాశం ఉంటుందని, అయితే దీనివల్ల సుమారు 2,300 ఎకరాల మేర ముంపునకు గురవుతుందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అదే 150 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే ముంపు వెయ్యి ఎకరాల లోపే మాత్రమే ఉంటుందని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం, మహారాష్ట్రలో ముంపు ప్రభావాన్ని అంచనా వేస్తూనే, తెలంగాణకు గరిష్ఠంగా నీటి లభ్యత ఉండేలా బ్యారేజీ డిజైన్‌ను రూపొందించాలని సూచించారు. అక్టోబర్ 23 తర్వాత చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు మహారాష్ట్ర ముఖ్యమంత్రి సంకేతాలిచ్చారని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. ఇటీవల కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో రెండు రాష్ట్రాల మధ్య జరిగిన సమావేశ వివరాలతో పాటు, సీడబ్ల్యూసీ కోరే ఎలాంటి సమాచారానికైనా సిద్ధంగా ఉండాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. దిండి ప్రాజెక్టుకు సంబంధించి ఏదుల రిజర్వాయర్ నుంచి 0.5 టీఎంసీలు, అచ్చంపేట ఎత్తిపోతల పథకానికి 0.1 టీఎంసీల నీటిని తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. శ్రీశైలం నుంచి అదనంగా 0.6 టీఎంసీల నీటిని తీసుకునేందుకు, శ్రీశైలం, నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్‌కు నీటిని మళ్లించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, డి. శ్రీధర్ బాబు, సాగునీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఏపీలో నామినేషన్ల వేళ హింసాత్మక ఘటనలు

**- 13 జిల్లాల్లో 31 ఘటనలు..**

**54 మంది నిందితుల గుర్తింపు**

**అమరావతి, అక్టోబర్ 23:** ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా పలు ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లో 31 ఎన్నికల సంబంధిత ఘటనలు నమోదైనట్లు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వెల్లడించారు. వీటిలో 22 ఘర్షణలు, దాడులు కాగా, మరో తొమ్మిది ఘటనల్లో నామినేషన్ పత్రాలను లాక్కోవడం, చించివేయడం వంటి చర్యలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనల్లో రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలకు నిప్పుపెట్టారు. కొన్ని చోట్ల రాళ్లు, కర్రలతో దాడులు జరగగా, ఒక ఇంటిని యంత్రంతో కూల్చివేసిన ఘటన కూడా నమోదైంది. అభ్యర్థులకు రక్షణగా వెళు‌్తున్న పోలీసు వాహనంపై రాళ్లదాడి జరగడంతో ఓ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఒక అభ్యర్థితో సహా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. జిల్లాల వారీగా అత్యధికంగా అనంతపురంలో ఎనిమిది ఘటనలు నమోదయ్యాయి. అన్నమయ్య, కడప, ప్రకాశం, తిరుపతి జిల్లాల్లో మూడేసి, చిత్తూరు, శ్రీ సత్యసాయి, పల్నాడు జిల్లాల్లో రెండేసి ఘటనలు చోటుచేసుకున్నాయి. నెల్లూరు, కర్నూలు, మార్కాపురం, నంద్యాల, ఏలూరు జిల్లాల్లో ఒక్కో ఘటన నమోదైంది. ఈ ఘటనలకు సంబంధించి ఇప్పటివరకు 16 కేసులు నమోదు చేయగా, మరో 11 ఘటనల్లో కేసుల నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. మొత్తం 54 మందిని నిందితులుగా గుర్తించినట్లు డీజీపీ తెలిపారు. హింసకు పాల్పడినవారు ఏ రాజకీయ పార్టీకి చెందినవారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సున్నితమైన ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలను మోహరించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల సమయంలో బెదిరింపులు, దాడులు ఎదురైతే 100 లేదా 112 నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.

# ఇంకెన్నాళ్లీ పారిశ్రామిక ప్రమాదాలు?

- **సిగాచి ఘటన మరువకముందే సరాక పరిశ్రమలో గ్యాస్ లీకేజీ.. ఇద్దరు కార్మికులు మృతి**
- **మృతుల కుటుంబాలకు రూ.70 లక్షల పరిహారం.. అంత్యక్రియలకు రూ.లక్ష చొప్పున సాయం**
- **కార్మికుల భద్రతపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రశ్నించిన ఎమ్మెల్యే జీఎంఆర్**

**పటాన్‌చెరు/గడ్డపోతారం:** సిగాచి పరిశ్రమ ప్రమాదం విషాదం మరువకముందే గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని సరాక పరిశ్రమలో గ్యాస్ లీకేజీతో ఇద్దరు కార్మికులు మృతి చెందడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. వరుస పారిశ్రామిక ప్రమాదాలు జరుగుతున్నా కార్మికుల భద్రతకు పటిష్ఠ చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి (జీఎంఆర్) ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రశ్నించారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే ఘటనాస్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే.. పరిశ్రమ యాజమాన్యం, సంబంధిత అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి, ప్రమాదానికి కారణాలను వెలికితీయాలని, భద్రతా లోపాలు ఉన్నట్లయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**మృతుల కుటుంబాలకు ఆర్థిక భరోసా**

పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి మృతి చెందిన ఇద్దరు కార్మికుల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.70 లక్షల పరిహారంతో పాటు, అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించేందుకు

నిర్ణయించినట్లు జీఎంఆర్ తెలిపారు. పటాన్‌చెరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని యాజమాన్యాన్ని ఆదేశించారు.

**భద్రతా ప్రమాణాల అమలులో నిర్లక్ష్యమెందుకు?**

పారిశ్రామిక అభివృద్ధి అంటే ఉత్పత్తి, లాభాల పెరుగుదల మాత్రమే కాదని, కార్మికుల ప్రాణాలకు భరోసా కల్పించడం కూడా అంతే ముఖ్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సిగాచి ఘటన నుంచి గుణపాఠాలు నేర్చుకుని పారిశ్రామిక భద్రతను బలోపేతం చేయడంలో ప్రభుత్వం మరింత బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు, గ్యాస్ లీకేజీలను గుర్తించే వ్యవస్థలు, అత్యవసర రక్షణ ఏర్పాట్లపై నిరంతర తనిఖీలు చేపట్టాలని సూచించారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కాకుండా, ముందస్తు చర్యలతో వాటిని నివారించాలని స్పష్టం చేశారు. కార్మికుల ప్రాణాలను కాపాడటమే ప్రభుత్వానికి, పరిశ్రమల యాజమాన్యాలకు ప్రథమ ప్రాధాన్యంగా ఉండాలని, మరో కుటుంబం ఇలాంటి విషాదాన్ని ఎదుర్కోకుండా కఠిన భద్రతా చర్యలు అమలు చేయాలని జీఎంఆర్ కోరారు.

# జిల్లా ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలి

- **కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి**

**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**

**నాగర్‌కర్నూల్ : భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ :** నీటి పొదుపుపై జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ పిలుపు, ప్రతి చుక్కను ఒడిసిపట్టి కరువును ఎదుర్కొందాం! నాగర్‌కర్నూలు జిల్లాలో నీటి వనరుల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలందరూ నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, ప్రస్తుతం నెలకొన్న కరువు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సూచించారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించు కుంటూ తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనివ్వాలని, నీటి వృథాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని శుక్రవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో జిల్లా కలెక్టర్ కోరారు. నీటిలోని ప్రతి చుక్క విలువైనదని, వర్షపాతం తగ్గిన పరిస్థితుల్లో తాగునీటి లభ్యతతో పాటు వ్యవసాయ రంగంపై కూడా ప్రభావం పడే అవకాశం ఉన్నందున నీటి సంరక్షణ చర్యలను ముందస్తుగా చేపట్టడం అత్యంత అవసరమని కలెక్టర్ తెలిపారు. వర్షపు నీటిని ఒడిసిపట్టడం, భూగర్భ జలాల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవడం, చెరువులు, కుంటలు తదితర సంప్రదాయ నీటి వనరులను పరిరక్షించడం ద్వారా భవిష్యత్తులో నీటి కొరతను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని తెలిపారు. ప్రజలు గృహావసరాలకు వినియోగించే నీటిని వృథా చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, లీకేజీలు ఉన్న కుళాయిలు, పైప్‌లైన్లను వెంటనే మరమ్మతు చేయించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఇతర సంస్థల్లో నీటి పొదుపు చర్యలను అమలు చేయడంతో పాటు, వర్షపు నీటి సేకరణ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

ఇప్పటికే ఉన్న ఇంకుడు గుంతలు, ఇతర నీటి సంరక్షణ నిర్మాణాలను సక్రమంగా నిర్వహిస్తూ భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగంలో నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు రైతులు బిందు సేద్యం, తుంపర సేద్యం వంటి నీటి పొదుపు సాగు పద్ధతులను సాధ్యమైనంత మేరకు అవలంబించాలని కలెక్టర్ సూచించారు. స్థానిక వర్షపాతం, నేల స్వభావం, నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపిక, సాగు ప్రణాళికలను రూపొందించుకోవాలని, సాగునీటిని అవసరమైన మేరకే వినియోగిస్తూ నీటి వృథాను నివారించాలని కోరారు. గ్రామ పంచాయతీలు, సంబంధిత ప్రభుత్వ శాఖలు, రైతులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో నీటి సంరక్షణ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. గ్రామాల్లోని చెరువులు, కుంటలు, కాలువలు, ఇతర నీటి వనరులను పరిరక్షించడంతో పాటు వర్షపు నీరు నిల్వ ఉండేలా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. నీటి సంరక్షణ ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామస్థాయిలో సామూహిక భాగస్వామ్యాన్ని పెంపొందించాలని తెలిపారు. నీటి సంరక్షణ కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. నీటిని పొదుపుగా వినియోగించడం, వర్షపు నీటిని సంరక్షించడం, భూగర్భ జలాలను పెంపొందించడం వంటి చర్యలను ప్రజలు తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత అవసరాలను తీర్చడంతో పాటు భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించే దిశగా జిల్లా ప్రజలు సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ప్రకటనలో జిల్లా ప్రజలకు కోరారు.

# ఎంపీ వద్దిరాజు మల్లవరం బామ్మ కల నెరవేర్చారు

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ అక్టోబర్ 23 :** ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మల్లవరంకు చెందిన 96 సంవత్సరాల బామ్మ దుగ్గిదేవర సామ్రాజ్యం చిరకాల కలను బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర నెరవేర్చారు. మల్లవరం గ్రామ సర్పంచ్ గా 2సార్లు, ఎంపీటీసీగా 2 పర్యాయాలు, సింగిల్ విండో డైరెక్టర్ గా పని చేసిన సామ్రాజ్యం అన్ని వర్గాల ప్రజల గౌరవాభిమానాలకు పాత్రుల య్యారు. అహింసా మార్గంలో మహోద్యమాన్ని నడిపి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిపెట్టి అన్ని విధాలా గొప్పగా అభివృద్ధి చేసిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అంటే సామ్రాజ్యంకు ఎనలేని అభిమానం. మహానేత కేసీఆర్‌ను కలిసి ఫోటో దిగాలనేది ఆమె చిరకాల కోరిక. ఈ విషయాన్ని ఆమె పెద్ద కుమారుడు, బీఆర్ఎస్ నాయకుడు వెంకటలాల్ ఎంపీ రవిచంద్ర దృష్టికి తీసుకురాగా,ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా సామ్రాజ్యంను ఆమె కుమారులు వెంకటలాల్, అజయ్ కుమార్, మనవళ్లు యుధిష్టర్, శ్రీరఘునందన్ లను వెంటబెట్టుకుని రవిచంద్ర శుక్రవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు వద్దకు తీసుకెళ్లారు. సామ్రాజ్యంను కేటీఆర్ ఆప్యాయంగా పలకరించి శాలువాతో సత్కరించి గౌరవించారు, త్వరలో కేసీఆర్ వద్దకు తీసుకెళ్లి ఆమె చిరకాల కోరికను నెరవేర్చుతానని మాటిచ్చారు.

**శ్రీరఘునందన్ ను అభినందించిన కేటీఆర్**

సామ్రాజ్యం మనవడు, అజయ్ కుమార్ కుమారుడు శ్రీరఘునందన్ బెంగళూరులో బీబీఏ చదువుతున్నారు. ఆయనకు చిన్నతనం నుంచే సమాజ సేవ,పరిశుభ్రత,పచ్చదనం పట్ల మక్కువ ఎక్కువ. మహానేత కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా 2016 ఫిబ్రవరి 17వతేదీన తమ స్వగ్రామం మల్లవరంలోని ప్రాథమిక పాఠశాలను ఆయన దత్తత తీసుకున్నారు. అప్పుడాయన 5వ తరగతి చదువుతున్నారు, వయస్సు 9ఏళ్లు. తాను దత్తత తీసుకున్న ప్రాథమిక పాఠశాలలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే కాక పరిసరాలలో పచ్చదనాన్ని, పరిశుభ్రతను పెంచారు. చిన్నతనంలోనే శ్రీరఘునందన్ చేస్తున్న సమాజసేవను అభినందిస్తూ 2017లో జాతీయ, 2017, 18లలో రాష్ట్ర స్థాయి స్వచ్ఛ పాఠశాల పురస్కారాలు లభించాయి. ఈ సందర్భంగా శ్రీరఘునందన్,ఆయన కుటుంబ సభ్యులను కేటీఆర్, రవిచంద్రలు అభినందించారు.

# ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- **సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించిన అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ**
- **ఉద్యోగుల ఒకరోజు భోజన ఖర్చుల కోసం రూ.10 వేల ఆర్థిక సాయం**

**నాగర్ కర్నూల్ : భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ :** ఎన్‌హెచ్ఎం జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారంతో 11వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని సమ్మె శిబిరాన్ని అచ్చంపేట ఎమ్మెల్యే గౌరవ శ్రీ చిక్కుడు వంశీకృష్ణ సందర్శించి ఉద్యోగులకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్‌హెచ్ఎం పరిధిలో కాంటింజెంట్ వర్కర్ల నుంచి స్టాఫ్ నర్సులు, ఇతర ఆరోగ్య సిబ్బంది, వైద్యుల వరకు వివిధ కేడర్లలో పనిచేస్తున్న ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు తన దృష్టిలో ఉన్నాయని తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నానని పేర్కొన్నారు. సమ్మె శిబిరంలో సుమారు 300 మంది వరకు పాల్గొంటున్న ఆరోగ్య సిబ్బంది, వైద్యులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. నిరవధిక సమ్మె కారణంగా ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి, వారికి తనవంతు సహాయంగా ఒకరోజు భోజన ఖర్చుల నిమిత్తం రూ.10,000 ఆర్థిక సాయం అందజేశారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు సమ్మెలో ఉండటంతో ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని ఎమ్మెల్యే తెలిపారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందని, ఈ విషయాన్ని ఆరోగ్య శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా ఆరోగ్య శాఖ మంత్రితో ఫోన్‌లో మాట్లాడినట్లు వెల్లడించారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే దిశగా తగిన చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. అవసరమైతే సోమవారం మరోసారి సంబంధిత మంత్రిని కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్ఎం జేఏసీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బాలకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి దామగట్ల కుమార్ తదితర జేఏసీ నాయకులు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రధాన డిమాండ్లను ఎమ్మెల్యేకు వివరించారు. ఉద్యోగుల పట్ల సానుకూలంగా స్పందించి, సమ్మె శిబిరాన్ని సందర్శించడంతో పాటు భోజన ఖర్చుల కోసం రూ.10,000 ఆర్థిక సాయం అందించిన అచ్చంపేట ఎమ్మెల్యే శ్రీ చిక్కుడు వంశీకృష్ణ కి జేఏసీ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు తమ పోరాటాన్ని ప్రజాస్వామ్య పద్ధతిలో కొనసాగిస్తామని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు.

# రైతులకు రుణ సదుపాయాల కల్పనపై పీఏసీఎస్ పాలకవర్గం నిర్ణయం

- **పంట, దీర్ఘకాలిక, బంగారు రుణాల మంజూరుకు తీర్మానం**

**భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి । రంగయ్య గారి శ్రీనివాస్ । అక్టోబర్ 23 । చేవెళ్ల నియోజకవర్గం :** శంకర్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) పాలకవర్గ సమావేశం శుక్రవారం స్థానిక కార్యాలయంలో చైర్మన్ బొల్లారం వెంకట్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రైతులకు పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు, బంగారంపై రుణాలు అందించేందుకు తీర్మానించారు. రైతులు తీసుకున్న పంట రుణాలను సకాలంలో తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కూడా నిర్ణయించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ పార్శి బాలకృష్ణ, పాలకవర్గ సభ్యులు మాణిక్య రెడ్డి, జనార్దన్ రెడ్డి, ఇందిరమ్మ, శ్రీనివాస్ రెడ్డి, లచ్చిరెడ్డి, మల్లికార్జున్, ప్రశాంత్ రెడ్డి, సామయ్య, శంకర్, చంద్రకళ, శ్రీధర్‌తో పాటు కార్యదర్శి రామ్ రెడ్డి పాల్గొన్నారు.

# పోక్సో కేసుపై శంకర్‌పల్లి పోలీసుల వివరణ

- **బాలికకు బలవంతంగా వైద్య పరీక్షలు చేశారన్న ఆరోపణలు అవాస్తవం.. వాస్తవాలు నిర్ధారించుకున్నాకే ప్రచారం చేయాలి**

**భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి । రంగయ్య గారి శ్రీనివాస్ । అక్టోబర్ 23 । చేవెళ్ల నియోజకవర్గం :** పోక్సో కేసుకు సంబంధించి సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న వీడియోపై శంకర్‌పల్లి పోలీసులు వివరణ ఇచ్చారు. 2026 అక్టోబర్ 12న తన మైనర్ కుమార్తె కిడ్నాప్‌కు గురైందనే అనుమానంతో బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దర్యాప్తులో భాగంగా బాలిక వాంగ్మూలాన్ని భరోసా కేంద్రంలో నమోదు చేసి, సాక్షులను విచారించడంతో పాటు పదో తరగతి మెమో, ఇతర సంబంధిత పత్రాలను పరిశీలించినట్లు పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న రికార్డుల ప్రకారం బాలిక మైనర్‌గా నిర్ధారణ కావడంతో కేసులో నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

చట్టపరమైన ప్రక్రియలో భాగంగా బాలికను వైద్య పరీక్షల నిమిత్తం పంపించగా, తాను మేజర్‌నని పేర్కొంటూ ఆమె అభ్యంతరం తెలిపిందని, ఆ అభ్యంతరాలను కేసు రికార్డుల్లో నమోదు చేసినట్లు వివరించారు. బాలికపై ఎలాంటి బలవంతం లేదా ఒత్తిడి చేయలేదని, బలవంతంగా వైద్య పరీక్షలు నిర్వహించారనే ఆరోపణలను ఖండిస్తున్నట్లు పోలీసులు స్పష్టం చేశారు. కేసు దర్యాప్తులో చట్టపరమైన నిబంధనలను పాటిస్తున్నామని తెలిపారు. మీడియా ప్రతినిధులు, సోషల్ మీడియా వినియోగదారులు సంబంధిత అధికారుల నుంచి వాస్తవాలను ధృవీకరించుకున్న తర్వాతే వార్తలు, వీడియోలను ప్రచారం చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా బాలిక గోప్యత, గౌరవానికి భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కేసులో నిష్పక్షపాతంగా, పారదర్శకంగా చట్టానికి అనుగుణంగా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పేర్కొన్నాయి.

# గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ స్థానంలో దాసు సురేష్‌కు అవకాశం కల్పించాలని బీసీ సంఘాలు డిమాండ్ చేశారు

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ అక్టోబర్ 23 :** త్వరలో ఖాళీగానున్న గవర్నర్ కోట ఎమ్మెల్సీ స్థానాల్లో బీసీ సామాజిక ఉద్యమకారుడిగా పద్మశాలి చేనేత వర్గాల ప్రతినిధిగా దాసు సురేష్ కు అవకాశం కల్పించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీసీ సంఘాల నేత జేఏసీ చైర్మన్ దొంత ఆనందం మాట్లాడుతూ అఖిల భారత జాతీయ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, ప్రతిపక్ష నాయకులు కాంగ్రెస్

పార్టీ లోకసభ సభ్యులు రాహుల్ గాంధీకి పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్కు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తూ కొండ లక్ష్మణ్ బాపూజీ వారసుడైన దాసు సురేష్ కు ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించాలని ఆయన కోరారు బీసీ సంఘాల నేత ఎర్ర సత్యనారాయణ మాట్లాడుతూ దాసు సురేష్ కు ఎమ్మెల్సీగా మద్దతు ప్రకటిస్తున్నామని తెలిపారు అన్ని విధాల అర్హుడైన దాసురేష్‌కు ఎమ్మెల్సీ అభ్యర్థిగా గవర్నర్ నుంచి ప్రకటించాలని ముఖ్యమంత్రిని కోరారు గుజ్జ కృష్ణ మాట్లాడుతూ బీసీ సంఘాల అభ్యర్థి అయిన దాసుదేసుకు ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వాలని 13 సంవత్సరాలుగా మేనేజ్మెంట్ అనుభవాన్ని సంపాదించిన దా సురేష్‌కు బి సి, ఎం బి ఏ పూర్తిచేసి ఎల్.ఎల్.బి అభ్యసించాడని అన్ని అనుభవం ఉన్న దాసు సురేష్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించాలని ఆయన తన సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు తెలియజేశారు ఈ సమావేశంలో బోనం ఊర్మిళ మాట్లాడుతూ మా కుల సంఘాల మద్దతు ఉంటుందని చెప్పారు పలువురు పద్మశాలి వర్గానికి చెందిన కార్మిక నేతలు బిసి వర్గాల పక్షాన దాసురేష్ కు ఎమ్మెల్సీగా ప్రకటించాలని కోరారు జాతీయ బీసీ సంఘంలో దశాబ్దపు ఉద్యమ అనుభవం ఉన్నదని ఆర్ కృష్ణ నాయకత్వంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం లో సుమారు దశాబ్ద పాటు పనిచేసి విద్యార్థి నాయకుడిగా స్థాయి నుంచి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బాధితుల వరకు ఎదిగాడని దాస్ సురేష్ కు ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించాలని ఆశ్చర్యకొండ లక్ష్మణ్ బాపూజీ ఉద్యమకారులు డిమాండ్ చేశారు.

## దేవరకొండ పట్టణంలో అంగరంగ వైభవంగా దుర్గామాత ఊరేగింపు

- **హనుమాన్ నగర్ దుర్గామాతకు ప్రత్యేక పూజలు**
- **ప్రజల సుభిక్షం కోసం ప్రార్థించిన కౌన్సిలర్లు సాయి చంద్ర గౌడ్, రవికుమార్**

**శోభాయాత్రలో పాల్గొన్న కౌన్సిలర్లు**

**దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి:** దేవరకొండ పట్టణంలోని హనుమాన్ నగర్ ఎయిర్‌టెల్ టవర్ వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాత శోభాయాత్ర కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో 7వ వార్డు కౌన్సిలర్ హన్మంతు సాయి చంద్ర గౌడ్ గారు, 9వ వార్డు కౌన్సిలర్ ముత్యాల రవికుమార్ యాదవ్ గారు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా హనుమాన్ నగర్ వాసులు ఏర్పాటు చేసిన దుర్గామాత శోభాయాత్రలో భాగంగా కౌన్సిలర్లు అమ్మవారికి పూలు, పండ్లతో పూజలు చేసి, హారతులు పట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. దేవరకొండ పట్టణం మరింత అభివృద్ధి చెందాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో నూక మల్లేష్, పూర్ణచందర్ రావు, రాగిపాని శ్రీనివాస్ చారి, గుర్రం నర్సింహ, కనగాల యాదయ్య, పరమేష్, పులిపాటి సన్నీ, వారికుప్పల కృష్ణయ్య, నీల ప్రణీత్ కుమార్, శివ, రామరాజు తదితరులతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ శంకర్ అరెస్ట్ అప్రజాస్వామికం

- **టియుడబ్ల్యూజే అధ్యక్షులు అల్లం నారాయణ,**
- **టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్**

**హైదరాబాద్ : భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ :** గతంలో వివిధ పత్రికల్లో, చానళ్లలో పనిచేసిన ఇండిపెండెంట్ జర్నలిస్ట్ శంకర్‌ను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికం అని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ అధ్యక్షులు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ లు అభిప్రాయపడ్డారు. జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టడం, భయభ్రాంతులకు గురి చేయడం మీడియా స్వేచ్ఛను హరించడమే అన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు ప్రసారం చేస్తే అవి నిరాధారమైనవి అయితే ఖండించాలి తప్ప కక్ష్య పూరితంగా వ్యవహరించి కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తెలంగాణ జర్నలిస్టులపై ఇలాంటి అక్రమ కేసులు పెట్టడాన్ని తప్పు బట్టిన వారు శంకర్ ను వెంటనే విడుదల వారు డిమాండ్ చేశారు. ఇలాగే జర్నలిస్టులపై కేసులు పెడితే పి సి ఐ కి ఫిర్యాదు చేయడంతో పాటు యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు.

## క్యాబినెట్ సబ్-కమిటీ సమావేశం

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ అక్టోబర్ 23:** రాష్ట్రంలో నెలకొన్న కరువు మరియు ఎల్-నినో పరిస్థితులను అధిగమించేందుకు, తగిన ప్రాంతాల్లో కరువు ప్రభావం, నీటి లభ్యత, రైతులకు అందించాల్సిన ఉపశమనం, భవిష్యత్తు కార్యాచరణపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నారు. ఈ

చర్యలను సమీక్షించి ప్రభుత్వానికి సిఫార్సులు చేసేందుకు సచివాలయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, సబ్-కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క అధ్యక్షతన ప్రారంభమైన క్యాబినెట్ సబ్-కమిటీ సమావేశం రాష్ట్రంలోని వివిధ సమావేశానికి సబ్-కమిటీ సభ్యులు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి, సిఎస్ సంజయ్ జాజుతో పాటు సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు.

## పోలీసింగ్ విధులపై విద్యార్థులకు అవగాహన

- **పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా కార్యక్రమం**

**భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి । రంగయ్య గారి శ్రీనివాస్ । అక్టోబర్ 23 । చేవెళ్ల నియోజకవర్గం :** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా మోయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేజీ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు పోలీసింగ్ విధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ పనితీరు, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజల భద్రతలో పోలీసుల పాత్ర తదితర అంశాలను పోలీసు అధికారులు వివరించారు. పోలీస్ శాఖ నిర్వహించే విధులు, బాధ్యతలు, ప్రజలకు అందించే సేవల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీస్ వ్యవస్థ పనితీరును తెలుసుకునేందుకు విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని పలు అంశాలపై అవగాహన పొందారు.

# తెలంగాణ ప్రగతికి టీజీఎస్‌పీఎఫ్ రక్షణ కవచం

- **భద్రతే అభివృద్ధికి పునాది**
- **67ప్రభుత్వ కీలక సంస్థలకు టీజీఎస్‌పీఎఫ్ భద్రత..**
- **టీజీఎస్‌పీఎఫ్ సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం**
- **అమీన్ పూర్ లో ఘనంగా తెలంగాణ ప్రత్యేక రక్షణ దళం 36వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ అక్టోబర్ 23:** భద్రతే అభివృద్ధికి పునాది అని, రాష్ట్రంలోని కీలక సంస్థలకు రక్షణ కల్పిస్తున్న తెలంగాణ ప్రత్యేక రక్షణ దళం (టీజీఎస్‌పీఎఫ్) సేవలు తెలంగాణ ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. దళం సిబ్బంది సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధి, శిక్షణ అవకాశాలు, పని పరిస్థితుల మెరుగుదలకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని తెలిపారు. శుక్రవారం తెలంగాణ ప్రత్యేక రక్షణ దళం 35వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 1991 అక్టోబర్ 23న ఏర్పాటైన ఈ దళం 36 ఏళ్లలో విశిష్ట సంస్థగా ఎదిగిందన్నారు. ప్రస్తుతం తెలంగాణ సచివాలయం, శాసనసభ, హైకోర్టు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు, ప్రధాన దేవాలయాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, కేంద్ర ప్రభుత్వానికి చెందిన కీలక సంస్థలు సహా మొత్తం 67 ముఖ్యమైన సంస్థలకు భద్రత కల్పిస్తోందని పేర్కొన్నారు. దాదాపు రెండు వేల మంది సిబ్బంది ఈ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తున్నారని చెప్పారు. టీజీఎస్‌పీఎఫ్ సేవలు కేవలం భవనాలు, సంస్థల రక్షణకే పరిమితం కావని, ప్రభుత్వ వ్యవస్థలు నిరంతరాయంగా పనిచేసేలా చూడటంతోపాటు ప్రజల విశ్వాసాన్ని కాపాడే బాధ్యతను కూడా ఈ దళం నిర్వహిస్తోందని వివరించారు. దళం నినాదమైన 'ప్రగతికి రక్షణ' ఎంతో అర్థవంతమైనదని అన్నారు. పరిశ్రమలు, పెట్టుబడులు, రహదారులు, విద్యుత్ ప్రాజెక్టులు, ఆసుపత్రులు, విద్యాసంస్థల అభివృద్ధికి పటిష్టమైన భద్రత అవసరమని స్పష్టం చేశారు.భద్రత అనేది అభివృద్ధి తర్వాత వచ్చే అంశం కాదని, అభివృద్ధికి ముందస్తు పునాది అని పేర్కొన్నారు. పెట్టుబడిదారులు పరిశ్రమలు స్థాపించాలన్నా, వైద్యులు రోగులకు సేవలు అందించాలన్నా, రైతులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా కావాలన్నా విశ్వసనీయమైన మౌలిక సదుపాయాలతోపాటు వాటికి పటిష్టమైన రక్షణ ఉండాలని చెప్పారు.

**విద్యుత్ కేంద్రాలకు కీలక రక్షణ**

విద్యుత్ శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న మంత్రిగా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల వద్ద ప్రత్యేక రక్షణ దళం సేవల ప్రాధాన్యం తనకు మరింత స్పష్టంగా తెలుసని ఉప ముఖ్యమంత్రి అన్నారు. యాదాద్రి, కొత్తగూడెం, భద్రాద్రి వంటి విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఎంతో కీలకమని తెలిపారు. అక్కడ ఇంజినీర్లు, కార్మికులు విద్యుత్ ఉత్పత్తి బాధ్యతలు నిర్వహిస్తుంటే, ఆ కేంద్రాలకు భద్రత కల్పిస్తూ ఉత్పత్తి నిరంతరాయంగా సాగేలా టీజీఎస్‌పీఎఫ్ సిబ్బంది తోడ్పడుతున్నారని ప్రశంసించారు. విద్యుత్ వెలుగులు అందరికీ కనిపించినా, వాటిని కాపాడే భద్రతా సిబ్బంది కృషి చాలాసార్లు కనిపించదని, అయితే వారి సేవల విలువ ఎంతో గొప్పదని అన్నారు. గత 35 ఏళ్లలో భద్రతా రంగంలో గణనీయమైన

మార్పులు వచ్చాయని పేర్కొన్నారు. ఆధునిక నిఘా వ్యవస్థలు, డ్రోన్లు, కృత్రిమ మేధ, సైబర్ వ్యవస్థలతో అనుసంధానమైన భౌతిక మౌలిక సదుపాయాలు కొత్త సవాళ్లను తీసుకొస్తున్నాయని చెప్పారు. భవిష్యత్తులో శారీరక దృఢత్వంతోపాటు సాంకేతిక పరిజ్ఞానం, అప్రమత్తత, వేగంగా స్పందించే సామర్థ్యం కూడా భద్రతా సిబ్బందికి అత్యంత అవసరమని వివరించారు అమీన్‌పూర్‌లో ప్రత్యేక శిక్షణ అకాడమీ ఉండటం సంతోషకరమని పేర్కొంటూ, శిక్షణ అనేది ఉద్యోగంలో చేరినప్పుడు పూర్తయ్యే ప్రక్రియ కాదని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నిరంతరం నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.

**క్రమశిక్షణ, నిజాయితీనే సంస్థకు బలం**

భద్రతా వ్యవస్థ బలాన్ని ఆయుధాలతోనే కొలవలేమని, వాటిని ధరించే సిబ్బంది క్రమశిక్షణ, నిజాయితీ, వివేకం, బాధ్యతాయుత ప్రవర్తనతోనే అంచనా వేయాలని ఉప ముఖ్యమంత్రి అన్నారు. విధులకు అప్పగించిన అధికారాలను బాధ్యతగా వినియోగించడం, ప్రజలతో మర్యాదగా వ్యవహరించడం, అత్యవసర పరిస్థితుల్లో సమయస్ఫూర్తితో స్పందించడం సంస్థ ప్రతిష్ఠను నిర్ణయిస్తాయని చెప్పారు. ప్రజల్లో భయాన్ని కలిగించడం కాకుండా భరోసా కల్పించడమే మంచి భద్రతా వ్యవస్థ లక్షణమని పేర్కొన్నారు. పండుగలు, సెలవు దినాలు, రాత్రివేళలు, అత్యవసర సమయాల్లోనూ భద్రతా సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. సిబ్బంది బాధ్యతలను అర్థం చేసుకుంటూ వారికి మానసిక బలాన్ని అందిస్తున్న కుటుంబ సభ్యుల త్యాగాలు కూడా ప్రశంసనీయమని అన్నారు. దళం అధికారులు, సిబ్బందితోపాటు వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరఫున ప్రత్యేక అభినందనలు తెలిపారు. తెలంగాణను మరింత అభివృద్ధి చెందిన, సమృద్ధమైన, సురక్షితమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో టీజీఎస్‌పీఎఫ్ పాత్ర కీలకమని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇప్పటివరకు ప్రదర్శించిన క్రమశిక్షణ, అంకితభావం, వృత్తి నైపుణ్యాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. "మీరు కాపాడేది కేవలం భవనాలను కాదు.. ప్రజల విశ్వాసాన్ని. మీరు రక్షించేది కేవలం సంస్థలను కాదు.. తెలంగాణ ప్రగతిని" అని భట్టి విక్రమార్క పేర్కొంటూ, దళం 35వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అధికారులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

# వీరేందర్ రాథోడ్, చందు నాయక్ జన్మదిన వేడుకలు ఘనంగా

- **కేక్ కట్ చేసి ఆత్మీయంగా శుభాకాంక్షలు తెలిపిన బంజారా సేవాదళ్ నాయకులు**
- **ఆప్యాయతలు, ఆనందోత్సాహాల మధ్య పుట్టినరోజు సంబరాలు.. సేవా భావంతో సమాజంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్ష**

**మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన, రంగారెడ్డి జిల్లా :** జన్మదిన వేడుకలు ఆనందాన్ని పంచడంతో పాటు ఆత్మీయ అనుబంధాలను మరింత బలోపేతం చేస్తాయని నిరూపిస్తూ వీరేందర్ రాథోడ్, చందు నాయక్ జన్మదిన వేడుకలను షాద్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానులు, బంజారా సేవాదళ్ నాయకుల మధ్య ఉత్సాహభరిత వాతావరణంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా వీరేందర్ రాథోడ్, చందు నాయక్‌లకు నాయకులు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కేక్ కట్ చేసి, ఒకరికొకరు మిఠాయిలు పంచుకుంటూ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ వేడుకలకు బంజారా సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు రఘురాం రాథోడ్, తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేష్ నాయక్ ఇస్లావత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణు నాయక్, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్ నాయక్, రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పాప్యా నాయక్, మహబూబ్‌నగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రవి నాయక్, విజయ్ రాథోడ్, పాండు నాయక్, మల్లేష్ నాయక్, శ్రీను నాయక్ తదితరులు హాజరై జన్మదిన వేడుకలను మరింత ప్రత్యేకంగా మార్చారు. జన్మదిన వేడుకల సందర్భంగా నాయకుల మధ్య కనిపించిన ఆత్మీయత, పరస్పర అభిమానం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

**ఆత్మీయ శుభాకాంక్షలు.. విజయవంతమైన భవిష్యత్తుకు ఆకాంక్షలు**

జన్మదినం ప్రతి ఒక్కరి జీవితంలో ప్రత్యేకమైన రోజు. గత అనుభవాలను గుర్తుచేసుకుంటూ, భవిష్యత్తులో మరిన్ని లక్ష్యాలను సాధించేందుకు కొత్త ఉత్సాహాన్ని నింపే సందర్భం. అలాంటి ప్రత్యేక రోజున తమతో అనుబంధం కలిగిన నాయకులు, మిత్రులు కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం వీరేందర్ రాథోడ్, చందు నాయక్‌లకు ఆనందాన్ని కలిగించింది. వేడుకల్లో పాల్గొన్న నాయకులు వారి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, కుటుంబ

అభివృద్ధి, వృత్తిపరమైన పురోగతి, సమాజంలో మరింత గౌరవప్రదమైన స్థానం పొందాలని ఆకాంక్షించారు. జీవితంలో ఎన్ని విజయాలు సాధించినా మనుషుల మధ్య ఉండే ప్రేమాభిమానాలు, ఆప్యాయతలు, నమ్మకం ఎంతో విలువైనవని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. స్నేహితులు, సహచరులు, శ్రేయోభిలాషులు ఒకచోట చేరి సంతోషాన్ని పంచుకోవడం వల్ల సంబంధాలు మరింత బలపడతాయని తెలిపారు. జన్మదిన వేడుకలు కేవలం కేక్ కట్ చేయడం, శుభాకాంక్షలు చెప్పడంతో ముగిసిపోయే కార్యక్రమాలు కావని, మనసుల మధ్య అనుబంధాన్ని చాటిచెప్పే మధురమైన సందర్భాలని అభిప్రాయపడ్డారు.

**బంజారా సేవాదళ్ నాయకుల ఐక్యతకు ప్రతీకగా వేడుకలు**

బంజారా సేవాదళ్ నాయకులు పరస్పర ఆత్మీయతతో కలుసుకుని జన్మదిన వేడుకల్లో పాల్గొనడం సంఘటిత భావనకు నిదర్శనంగా నిలిచింది. సమాజంలోని ప్రజలతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తూ, అవసరమైన సందర్భాల్లో ఒకరికొకరు అండగా నిలవడం ద్వారా ఐక్యతను మరింత బలోపేతం చేసుకోవచ్చని నాయకుల కలయిక చాటిచెప్పింది. ఇలాంటి ఆత్మీయ సమావేశాలు నాయకుల మధ్య స్నేహబంధాలను పెంపొందించడమే కాకుండా, సామాజిక కార్యక్రమాల్లో కలిసి ముందుకు సాగేందుకు స్ఫూర్తినిస్తాయని పలువురు పేర్కొన్నారు. బంజారా సమాజ అభ్యున్నతి, యువతలో చైతన్యం, సేవా కార్యక్రమాల విస్తరణ, ప్రజల మధ్య సోదరభావం పెంపొందించడం వంటి అంశాల్లో ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. వ్యక్తిగత ఆనందాలతో పాటు సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లోనూ భాగస్వాములు కావడం జీవితానికి మరింత అర్థాన్ని ఇస్తుందని తెలిపారు. జన్మదినం సందర్భంగా లభించే శుభాకాంక్షలు కొత్త బాధ్యతలను గుర్తుచేసే ప్రేరణగా నిలవాలని, మంచి ఆలోచనలు, సేవా దృక్పథంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

**ప్రేమాభిమానాలే జీవితానికి నిజమైన సంపద**

ఈ సందర్భంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ నాయకులు మాట్లాడుతూ, వీరేందర్ రాథోడ్, చందు నాయక్‌లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, వారు చేపట్టే ప్రతి కార్యంలో విజయం సాధించాలని కోరుకున్నారు. జీవితంలో ఎదురయ్యే ప్రతి సవాలును ధైర్యంగా ఎదుర్కొంటూ, కుటుంబ సభ్యుల ప్రేమను పొందుతూ, స్నేహితుల ఆదరణతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ, సమాజంలో మంచి పేరు సంపాదించాలని శుభాకాంక్షలు తెలిపారు. "జన్మదినం అంటే జీవితంలో మరో ఏడాది గడిచిందని గుర్తుచేసే రోజు మాత్రమే కాదు.. కొత్త ఆశయాలతో ముందుకు సాగేందుకు లభించే గొప్ప అవకాశం. మనం సంపాదించే ఆస్తులకంటే మనపై చూపించే ప్రేమాభిమానాలే నిజమైన సంపద. మన ఆనందాన్ని నలుగురితో పంచుకుంటూ, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలుస్తూ, సమాజానికి సేవ చేసినప్పుడే జీవితానికి నిజమైన సార్థకత లభిస్తుంది" అనే సందేశం ఈ వేడుకల స్ఫూర్తిని ప్రతిబింబించింది.మొత్తంగా వీరేందర్ రాథోడ్, చందు నాయక్ జన్మదిన వేడుకలు ఆత్మీయతకు, స్నేహబంధాలకు, పరస్పర గౌరవానికి ప్రతీకగా నిలిచాయి. నాయకులు, మిత్రులు కలిసి శుభాకాంక్షలు తెలియజేయడంతో వేడుకలు ఆనందభరితంగా ముగిశాయి. వీరేందర్ రాథోడ్, చందు నాయక్‌ల జీవితాల్లో రాబోయే రోజులు మరిన్ని విజయాలు, మంచి అవకాశాలు, కుటుంబ సంతోషాలు, సమాజ సేవతో నిండిపోవాలని బంజారా సేవాదళ్ నాయకులు మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

# నల్గొండ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్

## జీ రామ్ జీ అవగాహన కార్యక్రమం ఎల్ నినోతో వ్యవసాయంపై ప్రభావం

- **రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచన - కలెక్టర్**

**దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి :** నేడు దేవరకొండ పట్టణంలో నల్గొండ జిల్లా కలెక్టర్ గారి ఆధ్వర్యంలో వికసిత్ భారత్ - జీ రామ్ జీ మరియు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ - నల్గొండ ఆధ్వర్యంలో ఎల్ నినో ప్రభావం - నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈ అవగాహన కార్యక్రమానికి జిల్లా ఉన్నతాధికారులు, వివిధ మండలాల సర్పంచులు, అధికారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మైనంపల్లి సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్ గారు పాల్గొని ఎల్ నినో ప్రభావం, దాని నివారణ చర్యలపై చర్చలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. ఎల్ నినో కారణంగా వర్షాభావ పరిస్థితులు తలెత్తే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికలతో వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా

అధికారులు, సర్పంచులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# మైసిగండిలో అంగరంగ వైభవంగా మౌనిక నాగేశ్వరరావు కుమారుడి బారసాల వేడుకలు

- **సంప్రదాయాల సాక్షిగా కన్నులపండువగా తొట్టెల సంబరం.. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల కోలాహలం మధ్య వైభవంగా శుభకార్యం**
- **భారతి, కిషన్ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు.. చిన్నారిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన భగవాన్ ఫౌండేషన్ చైర్మన్ బుజ్జి దూదు చౌహాన్**
- **చిన్నారి రాకతో కుటుంబంలో వెల్లివిరిసిన ఆనందం.. పెద్దల ఆశీస్సులు, ఆత్మీయుల ప్రేమాభిమానాల నడుమ మధుర జ్ఞాపకంగా నిలిచిన బారసాల**

**మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన: రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల్ మండలం పరిధిలోని:** మైసిగండిలో మౌనిక నాగేశ్వరరావు కుమారుడి బారసాల వేడుకలు అత్యంత వైభవంగా, అంగరంగ వైభవంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. చిన్నారి రాకతో ఇంటిల్లిపాదిలో నెలకొన్న ఆనందాన్ని బంధుమిత్రులతో పంచుకుంటూ, తాతయ్య, అమ్మమ్మల ఆశీస్సులు, తల్లిదండ్రుల ఆప్యాయతలు, కుటుంబ సభ్యుల సంతోషాల మధ్య తొట్టెల వేడుకను ఘనంగా జరిపారు. పసిపాప చిరునవ్వులు, ఆత్మీయుల పలకరింపులు, పెద్దల దీవెనలతో వేడుక ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది. కుటుంబ సభ్యులు ఎంతో మురిపెంగా నిర్వహించిన ఈ శుభకార్యం అందరి హృదయాల్లో చెరగని మధుర జ్ఞాపకంగా నిలిచింది. భారతి, కిషన్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బారసాల వేడుకకు కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు హాజరై చిన్నారికి తమ ప్రేమాభిమానాలను అందించారు. సంప్రదాయాలకు ప్రాధాన్యతనిస్తూ, కుటుంబ పెద్దల సమక్షంలో ఆచార వ్యవహారాల ప్రకారం తొట్టెల వేడుకను నిర్వహించారు. చిన్నారి జీవితంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిన ఈ శుభసందర్భంలో ప్రతి ఒక్కరూ ఆనందంతో పాల్గొని, బిడ్డ భవిష్యత్తు బాగుండాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఒకవైపు పెద్దల ఆశీస్సులు, మరోవైపు బంధుమిత్రుల శుభాకాంక్షలు, ఇంకోవైపు కుటుంబ సభ్యుల ఆత్మీయత కలగలిసి ఈ వేడుకను ప్రత్యేకంగా నిలిపాయి. పిల్లల రాక ప్రతి కుటుంబానికి అపురూపమైన వరం. ఇంట్లో చిన్నారి అడుగుపెట్టగానే తల్లిదండ్రుల జీవితాల్లో కొత్త ఆశలు చిగురిస్తాయి. తాతయ్య, అమ్మమ్మలకు కొత్త ఆనందం కలుగుతుంది. కుటుంబ సభ్యులందరి మధ్య అనుబంధాలు మరింత బలపడతాయి. అలాంటి ఆనందాన్ని అందరితో పంచుకునే గొప్ప సందర్భమే బారసాల వేడుక. మైసిగండిలో జరిగిన ఈ శుభకార్యం కూడా కుటుంబ బంధాల గొప్పతనాన్ని, తెలుగు సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పింది.

**చిన్నారికి ఆశీస్సులు.. కుటుంబానికి హృదయపూర్వక శుభాకాంక్షలు**

ఈ శుభకార్యానికి హాజరైన భగవాన్ ఫౌండేషన్ చైర్మన్ బుజ్జి దూదు చౌహాన్ చిన్నారిని ఆశీర్వదించి, మౌనిక నాగేశ్వరరావు కుటుంబ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రుల ప్రేమానురాగాల మధ్య చక్కగా పెరిగి, విద్యాబుద్ధులతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, భవిష్యత్తులో కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని కోరుకున్నారు. చిన్నారి జీవితంలో ప్రతి అడుగు విజయవంతం కావాలని, మంచి ఆలోచనలు, ఉన్నతమైన లక్ష్యాలు, మానవీయ విలువలతో ఎదగాలని బుజ్జి దూదు చౌహాన్ ఆకాంక్షించారు. కుటుంబంలో ఎల్లప్పుడూ సుఖశాంతులు, సంతోషాలు వెల్లివిరియాలని, ఈ శుభసందర్భం అందరికీ మరపురాని జ్ఞాపకంగా మిగలాలని శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా మమేకమై, వేడుకలో భాగస్వాములై చిన్నారిని ఆశీర్వదించడం కార్యక్రమానికి మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది.

**తాతయ్య, అమ్మమ్మల మురిపాలు.. తల్లిదండ్రుల ఆనందోత్సాహాలు**

చిన్నారి పుట్టుకతో తల్లిదండ్రులకు కలిగే ఆనందం మాటల్లో చెప్పలేనిది. అదే సమయంలో తాతయ్య, అమ్మమ్మలకు మనవడిని చేతుల్లోకి తీసుకుని మురిసిపోయే క్షణాలు జీవితంలో అత్యంత మధురమైన అనుభూతులుగా నిలుస్తాయి. చిన్నారి చిరునవ్వు ఇంటిల్లిపాదిలో కొత్త ఉత్సాహాన్ని నింపుతుంది. ఆ చిన్నారి చేసే ప్రతి చిన్న పని కుటుంబ సభ్యులకు అపురూపంగా అనిపిస్తుంది. అలాంటి భావోద్వేగాలు, ఆప్యాయతలు, ఆనందాల మధ్య మౌనిక నాగేశ్వరరావు కుమారుడి బారసాల వేడుకను కుటుంబ సభ్యులు వైభవంగా నిర్వహించారు. భారతి, కిషన్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కుటుంబ పెద్దల ఆశీస్సులకు ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చారు. బంధుమిత్రులు చిన్నారిని చూసి మురిసిపోతూ శుభాకాంక్షలు తెలియజేశారు. చిన్నారి ఆరోగ్యంగా ఎదిగి, జీవితంలో మంచి స్థాయికి చేరుకోవాలని, తల్లిదండ్రులకు ఆనందాన్ని అందించాలని ఆకాంక్షించారు. పెద్దల ఆశీర్వాదాలు, కుటుంబ సభ్యుల ప్రేమాభిమానాలు చిన్నారి జీవితానికి మంచి ప్రారంభంగా నిలవాలని అందరూ కోరుకున్నారు.

**బారసాల వేడుక.. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక**

తెలుగు కుటుంబాల్లో బారసాల వేడుకకు ప్రత్యేకమైన స్థానం ఉంది. చిన్నారి జననం తరువాత కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో నిర్వహించే ఈ శుభకార్యం కేవలం ఒక వేడుక మాత్రమే కాదు.. కుటుంబ అనుబంధాలను, ఆచార సంప్రదాయాలను, తరతరాలుగా వస్తున్న సాంస్కృతిక విలువలను

ప్రతిబింబించే అపురూపమైన ఘట్టం. పెద్దల ఆశీస్సులతో చిన్నారి జీవితానికి శుభారంభం పలకడం, బిడ్డ భవిష్యత్తు సంతోషంగా ఉండాలని కోరుకోవడం ఈ వేడుకలోని ప్రధాన భావం. నేటి ఆధునిక జీవన విధానంలోనూ ఇలాంటి సంప్రదాయాలను కుటుంబ సభ్యులు గౌరవిస్తూ కొనసాగించడం విశేషం. పాతతరం నుంచి కొత్తతరానికి సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేయడంలో కుటుంబ వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయి. పెద్దలు అందించే అనుభవాలు, ఆశీస్సులు పిల్లల ఎదుగుదలకు ప్రేరణగా నిలుస్తాయి. కుటుంబ సభ్యులంతా ఒకచోట చేరి సంతోషాలను పంచుకోవడం వల్ల బంధాలు మరింత బలపడతాయి. మైసిగండిలో నిర్వహించిన ఈ బారసాల వేడుకలోనూ సంప్రదాయాల పట్ల గౌరవం, కుటుంబ సభ్యుల మధ్య ఆప్యాయత స్పష్టంగా కనిపించాయి.

**బంధుమిత్రుల శుభాకాంక్షలతో సందడిగా వేడుక**

బారసాల వేడుకకు వచ్చిన బంధుమిత్రులు చిన్నారిని ఆశీర్వదిస్తూ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. చిన్నారి జీవితంలో ఆనందం, ఆరోగ్యం, విజ్ఞానం, విజయాలు నిండాలని కోరుకున్నారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే విధంగా ఎదిగి, సమాజానికి ఉపయోగపడే మంచి వ్యక్తిగా పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఆత్మీయుల పలకరింపులు, పెద్దల దీవెనలు, కుటుంబ సభ్యుల ఆనందోత్సాహాల మధ్య కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. కుటుంబంలో జరిగే ఇలాంటి శుభకార్యాలు మనుషుల మధ్య దూరాలను తగ్గించి, ఆత్మీయతను పెంచుతాయి. ఒకరి సంతోషంలో మరొకరు భాగస్వాములవడం, కష్టసుఖాల్లో తోడుగా నిలవడం భారతీయ కుటుంబ వ్యవస్థలోని గొప్ప లక్షణం. బారసాల వంటి సందర్భాలు ఈ అనుబంధాలను మరింత బలోపేతం చేస్తాయి. మౌనిక నాగేశ్వరరావు కుమారుడి వేడుకలోనూ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఒకచోట చేరి చిన్నారి రాకతో కలిగిన ఆనందాన్ని పంచుకున్నారు.

**చిన్నారి భవిష్యత్తుకు శుభాశీస్సులు**

పసితనంలో మొదలయ్యే ప్రతి అడుగు భవిష్యత్తులో ఉన్నతమైన ప్రయాణానికి పునాది కావాలని పెద్దలు ఆకాంక్షిస్తారు. చిన్నారి ఆరోగ్యంగా పెరగడం, మంచి విద్యను అభ్యసించడం, నైతిక విలువలను అలవర్చుకోవడం, తల్లిదండ్రులకు గౌరవం తీసుకురావడం ప్రతి కుటుంబం కోరుకునే మధురమైన స్వప్నం. మౌనిక నాగేశ్వరరావు కుమారుడి బారసాల వేడుక సందర్భంగా కూడా కుటుంబ సభ్యులు, ఆత్మీయులు ఇలాంటి ఆశీస్సులను అందించారు. చిన్నారి జీవితంలో ఎలాంటి ఆటంకాలు లేకుండా సుఖసంతోషాలతో ముందుకు సాగాలని, ప్రతిభతో ఎదిగి కుటుంబానికి గర్వకారణంగా నిలవాలని కోరుకున్నారు. తల్లిదండ్రుల ప్రేమ, తాతయ్య, అమ్మమ్మల దీవెనలు, బంధుమిత్రుల ఆదరణతో చిన్నారి జీవితం ఆనందమయంగా ఉండాలని ఆకాంక్షించారు.

**మధుర జ్ఞాపకంగా నిలిచిన శుభకార్యం**

మైసిగండిలో జరిగిన మౌనిక నాగేశ్వరరావు కుమారుడి బారసాల వేడుకలు సంప్రదాయాల వైభవాన్ని, కుటుంబ అనుబంధాల మాధుర్యాన్ని చాటిచెప్పాయి. భారతి, కిషన్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో చిన్నారిపై పెద్దలు, బంధుమిత్రులు ప్రేమాభిమానాలు కురిపించారు. భగవాన్ ఫౌండేషన్ చైర్మన్ బుజ్జి దూదు చౌహాన్ హాజరై చిన్నారిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేయడంతో కార్యక్రమం మరింత ప్రత్యేకతను సంతరించుకుంది. చిన్నారి రాకతో కుటుంబంలో ప్రారంభమైన కొత్త ఆనందాల ప్రయాణం జీవితాంతం సంతోషాలతో కొనసాగాలని, కుటుంబ సభ్యుల మధ్య ప్రేమానుబంధాలు మరింత బలపడాలని అందరూ మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ఆత్మీయుల ఆశీస్సులు, కుటుంబ సభ్యుల ఆనందోత్సాహాలు, సంప్రదాయబద్ధమైన తొట్టెల వేడుకతో ఈ బారసాల కార్యక్రమం అందరి హృదయాల్లో చెరగని ముద్ర వేసింది. ఒక చిన్నారి రాకతో ఎన్నో హృదయాల్లో వెలిగిన ఆనంద దీపాలకు ప్రతీకగా ఈ శుభకార్యం మధుర జ్ఞాపకంగా నిలిచింది.

# గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు

- **ప్రైవేట్ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలి**
- **లింగ నిష్పత్తి మెరుగుదలకు నిరంతర పర్యవేక్షణ, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి**

**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**

**నాగర్ కర్నూల్: భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ :** జిల్లాలో గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ హెచ్చరించారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో లింగ నిష్పత్తిని మెరుగుపరిచేందుకు నిరంతర పర్యవేక్షణతో పాటు ప్రజల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధ్యక్షతన క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రైవేట్ వైద్యులు, ఆస్పత్రుల నిర్వాహకులతో సమావేశమై క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ల నమోదు, నిర్వహణ, ప్రభుత్వ నిబంధనల అమలుపై సమీక్షించారు. నూతన అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న 13 ప్రైవేట్ ఆస్పత్రులు, 6 స్కానింగ్ కేంద్రాల దరఖాస్తులను పరిశీలించి, చర్చించిన అనంతరం అనుమతులు మంజూరు చేశారు. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినా, ప్రోత్సహించినా లేదా వాటికి సహకరించినా ఉపేక్షించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు, ఆస్పత్రులు, స్కానింగ్ కేంద్రాలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించే వైద్య సంస్థలపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రైవేట్ ఆస్పత్రుల గైనకాలజిస్టులు తల్లి, శిశువు ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వైద్య ప్రమాణాలను పాటిస్తూ సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. అనంతరం జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ, జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ కమిటీల సభ్యులతో సమీక్ష నిర్వహించి, జిల్లాలో అనుమతులతో పనిచేస్తున్న ఆస్పత్రులు, స్కానింగ్ కేంద్రాల వివరాలను తెలుసుకున్నారు. రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకున్న సంస్థలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తున్నట్లు నిర్ధారించిన తర్వాతే అనుమతుల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ చట్ట నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి నిహారిక, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవ సహాయం, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ, జిల్లా ప్రైవేట్ ఆస్పత్రుల అధ్యక్షుడు డాక్టర్ చెన్నయ్య, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రవి నాయక్, ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వలస బాట పడుతున్న గిరిజన చెంచు కుటుంబాలు

- **వివిధ చెంచు పెంటల నుండి 100 కుటుంబాలు ఇతర ప్రాంతాలకు వలస**
- **తల్లిదండ్రులతోపాటు చిన్నారులు కూడా వలస బాట**

**అచ్చంపేట: భవిష్యత్ ప్రజాపాలన జర్నలిస్టు జలగం సురేందర్:** లింగాల మండల పరిధిలోని గిరిజన ప్రాంతాలలో ఉన్నటువంటి చెంచు కుటుంబాలు వలస బాట పడుతున్నారు. లింగాల మండలానికి 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎర్ర పెంట, శ్రీరంగాపూర్, పద్మాన పల్లి, చెన్నంపల్లి, అప్పైపల్లి, గ్రామాల నుండి గిరిజన చెంచు కుటుంబాలు ఇప్పటికీ 100 కుటుంబాలు కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్, భద్రాచలం హైదరాబాద్ తదితర ప్రాంతాలకు గుంపు మేస్త్రీలు గిరిజనుల రాత్రి రాత్రి వివిధ ప్రైవేటు వాహనాలలో వారికి తెలియని ప్రదేశాలకు తీసుకువెళ్లారు, వారితోపాటు వారి పిల్లలు కూడా విద్యకు దూరమై వలస బాట పట్టారు. గ్రామాలలో గిరిజనులకు జీవనో ఉపాధి లేకపోవడంతో అట్టి గిరిజనులపై వివిధ గ్రామాలలో ఉన్నటువంటి గుంపు మేస్త్రిలు వారిని ఇతర ప్రదేశాలకు తరలించి ఇష్టం సరిగ్గా పనులు చేపిస్తున్నారు. వారికి జ్వరం లేదా ఇతర అనారోగ్యాలకు గురైనప్పుడు ఎవరు పట్టించుకునే నాధుడే కరువయ్యారు. గతంలో 2006 సంవత్సరంలో నాగర్ కర్నూల్ జిల్లాలో పెద్ద కొత్త పల్లి మండలంలో మారేడు దినే గ్రామంలో ఇతర రాష్ట్రాలకు వెళ్లి మృత్యువాత పడిన సంఘటన అందరికీ తెలిసిన విషయమే. మళ్లీ చెంచులపై గుంపు మేస్త్రిర్ల కన్ను పడి నిరుపేద గిరిజనులను తీసుకువెళ్లి ఇష్టం సరిగ్గా పనులు చేయిస్తున్నారు. గుంపు మేస్త్రీల పై చర్యలు తీసుకోవాలని. గిరిజనులు ఏ ప్రాంతానికి తరలించారు అనేది కూడా సర్వేలు నిర్వహించి. స్వగ్రామనకి వారిని తీసుకువచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

# కందవాడ నుంచి శబరిమలకు 50 మంది అయ్యప్ప స్వాముల పాదయాత్ర

- **గురుస్వామి ఉమాశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో మహా పడిపూజ.. భజనలతో మారుమోగిన గ్రామం**
- **ఐదేళ్లుగా కొనసాగుతున్న ఆధ్యాత్మిక యాత్ర.. ఘనంగా అన్నదాన కార్యక్రమం**

**భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి । రంగయ్య గారి శ్రీనివాస్ । అక్టోబర్ 23 । చేవెళ్ల నియోజకవర్గం :** చేవెళ్ల మండలం కందవాడ గ్రామంలో శుక్రవారం 'స్వామియే శరణం అయ్యప్ప' నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కందవాడకు చెందిన గురుస్వామి ఉమాశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఐదోసారి చేపడుతున్న శబరిమల పాదయాత్రను పురస్కరించుకుని స్థానిక హనుమాన్ ఆలయ ప్రాంగణంలో మహా పడిపూజను వైభవంగా నిర్వహించారు. కందవాడ నుంచి శబరిమల సన్నిధానం వరకు 50 మంది అయ్యప్ప స్వాములు కాలినడకన యాత్రకు సిద్ధమయ్యారు. ఐదేళ్ల క్రితం ఐదుగురు స్వాములతో ప్రారంభమైన ఈ పాదయాత్ర ప్రస్తుతం 50 మందికి చేరడం విశేషం. ఉదయం 10 గంటలకు నిర్వహించిన పడిపూజలో 18 పవిత్ర మెట్లకు ప్రతీకగా ఏర్పాటు చేసిన పడికి ప్రత్యేక పూజలు చేసి, ఇరుముడులు కట్టుకుని స్వామివారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా గురుస్వామి ఉమాశంకర్ రెడ్డి మాట్లాడుతూ, అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ఐదోసారి పాదయాత్ర చేపడుతున్నామని, కందవాడ గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. 41 రోజుల కఠిన దీక్షతో యాత్ర కొనసాగుతుందని పేర్కొన్నారు. అనంతరం శంకర్‌పల్లికి చెందిన శబరీష భక్త సమాజం గురుస్వామి విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన భజన కార్యక్రమంతో గ్రామం భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. 'స్వామియే శరణం అయ్యప్ప', 'హరిహర సుతనే శరణం', 'కన్నె మూల గణపతి భగవానే శరణం' వంటి భక్తి గీతాలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. గురుస్వామి విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, ఉమాశంకర్ రెడ్డి ఐదేళ్లుగా క్రమం తప్పకుండా పాదయాత్ర నిర్వహించడం అభినందనీయమని, 50 మంది స్వాముల యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. విద్యుత్ దీపాలు, పూలమాలలతో పూజా మండపాన్ని అందంగా అలంకరించి, అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 500 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. శుక్రవారం సాయంత్రం అయ్యప్ప స్వాముల బృందం కందవాడ నుంచి శబరిమలకు బయలుదేరనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మహా పడిపూజ, భజన కార్యక్రమం గ్రామంలో ఆధ్యాత్మిక శోభను నింపగా, భక్తులు సంతోషం వ్యక్తం చేశారు.

# ప్రశ్నిస్తాం పోరాడుతాం, పరిష్కరిస్తాం



కల్వకుంట్ల కవిత

**భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి శేరిలింగంపల్లి:** రానున్న జిహెచ్ఎంసి ఎన్నికలలో అన్ని డివిజన్ లలో పోటీ చేసి బల్దియాలో టిఆర్ఎస్ జండా ఎగరవేస్తామని ఆ పార్టీ అధినేత కల్వకుంట్ల కవిత అన్నారు. ఉమ్మడి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ వాసిలీ చంద్రశేఖర్ ప్రసాద్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మియాపూర్‌లోని నరేన్ గార్డెన్‌లో ఏర్పాటుచేసిన రాజధాని రణభేరి సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రశ్నిస్తాం, పోరాడుతాం పరిష్కరిస్తాం అని అన్నారు.మన పట్టభద్రుల ఎమ్మెల్సీ తొలి అభ్యర్థి అయిన శ్రీకాంత్ గౌడ్ ను ఆశీర్వదించాలని కోరారు. ఇక ముందు రాబోయే మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో కూడా పోటీ చేస్తామన్నారు. జి హెచ్ఎంసిలోని 300 డివిజన్లలో కూడా కూడా పోటీ చేస్తామని, ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో కూడా పోటీ చేస్తామని ఆమె ఈ సందర్భంగా తెలిపారు. హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతం చేస్తామంటే ఒప్పుకోలేదనీ, హైదరాబాద్ 400 ఏళ్ల ఘనమైన చరిత్ర ఉందని, ఆ చరిత్రను తెలుసుకోవాలనీ, చరిత్ర తెలవలేనోడు నాయకులు కాలేరు అన్నారు. హైదరాబాద్ నగరంలో కోటి మంది జనాభాకు కావాల్సిన అవసరాలు ఇప్పుడున్న ప్రభుత్వం తీర్చడం లేదని, మనం ఆ అవసరాలు తీర్చాలనీ పేర్కొన్నారు.

వందల ఏళ్ల క్రితం ముత్యాలను సృష్టించిన ఘనత సైబరాబాద్‌కు ఉందని ఇపుడు ఐటీ రంగంలో ప్రపంచంలోనే ప్రత్యేక స్థానంలో ఉందని, ఐటీ ఉద్యోగుల కోసం ఒక పాలసీ తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నా మన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే పెట్టుబడిదారులకు స్వాగతం పలకాలని, కానీ రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్తున్నాడనీ, మళ్ళీ వచ్చే ఆర్థిక సమ్మిట్‌లో ఏం చేస్తారో చెప్పండనీ కోరారు. డమ్మీ సమ్మిట్‌ల పేరుతో రావద్దని హెచ్చరించారు. మన టి ఆర్ ఎస్ పార్టీకి కమిట్ మెంట్ ఉన్న కార్యకర్తలు కావాలనీ సూచించారు. విశ్వ నగరం అని చెప్పుకుంటున్నాం కానీ నగరంలో మంచి నీళ్ళు లేవనీ నీళ్లు ఇవ్వలేని అసమర్ధ ప్రభుత్వాన్ని ఇప్పుడే చూస్తున్నా మన్నారు.

మన వాళ్ళు గల్లిల్లో తిరగాలనీ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలనీ. ప్రజల కోసం పని చేద్దామని పిలుపు నిచ్చారు. చెత్త గురించి అయితే చెప్పాల్సిన పనే లేదనీ, నగరంలో ఉన్న 50 వేల మంది కార్మికుల పొట్టకొడుతున్నా రనీ. ఇది న్యాయమా అని ప్రశ్నించారు. అలా చేస్తే చూస్తూ ఊరుకో మనీ. సీఎం ఇంటిముందు చెత్త పోసి నిరసన తేలుపుతామన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం కూరగాయలు అమ్మే వారికి ఏసీ ఆటోలు ఇవ్వాలనీ కోరారు. గర్భిణీల గురించి. ముసలలోల్ల గురించి ఆలోచించాలనీ రోడ్లు బాగు చేయాలని కోరారు. దోమలు టవర్లు కట్టాయనే వీడియో సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతుందన్నారు. హైదరాబాద్ నగరం ది ఏ ఆలత్ ఉండేదని ఏం అలత్ అయిందన్నారు. యువత కోసం కొత్త తరం ఆలోచనలతో ముందుకు వెళ్తామన్నారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు.

## ప్రజా ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపిన పండుగ
# సాయన్న ఉత్సవ కమిటీ చైర్మన్ బో ర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ అక్టోబర్ 23 :** తెలంగాణ రాష్ట్రంలో ముదిరాజ్ సామాజిక వర్గానికి సమస్త గుర్తింపునిస్తూ పూజ వీరుడు పండుగ సాయన్న ముదిరాజ్ 174 జయంతి వేడుకలను అధికారం గా అధికారికంగా నిర్వహించి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వానికి పండుగ సాయన్న ఉత్సవ కమిటీ తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని కమిటీ చైర్మన్ బోర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు అక్టోబర్ 22న హైదరాబాదులోని రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన పండుగసాయంతి జయంతి ఉత్సవాల్లో ముఖ్యమంత్రి పాల్గొనడం ముదిరాజ్ సమాజానికి గర్వకారణమని పేర్కొన్నారు కార్యక్రమం ద్వారా పండుగ సాయన్న పోరాట స్ఫూర్తి కి త్యాగాలకు సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి తగిన గుర్తింపు లభించిందని తెలిపారు ముదిరాజ్ సామాజిక సమాజం అభ్యున్నతికి సీఎం సానుకూలంగా స్పందన హర్షనీయమని బో ర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ చెప్పారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన రాజకీయ ప్రస్థానాన్ని కొడంగల్ నియోజకవర్గం లో ముదిరాజ్ సోదరులు తన ఎరుగుదలకు అందించిన సహకారాన్ని గుర్తు చేసుకోవడం తమ సమాజానికి ఎంతో ఆత్మవిశ్వాసాన్ని కలిగించిందని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు ముదిరాజుల సామాజిక

ఆర్థిక పరిస్థితులను పరిగణలోనికి తీసుకొని వారి అభివృద్ధికి అవసరమైన చేపట్టారని ప్రభుత్వం వైఖరి అభినందనీయమని పేర్కొన్నారు ముదిరాజుల ప్రధాన డిమాండ్లు ప్రభుత్వానికి ముద్రాజ్ సమాజ అభ్యున్నతికి దృష్టిలో ఉంచుకొని గౌరవ మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్ పండుగ సాయన్న ఉత్సవ కమిటీ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ముఖ్యమంత్రి పాలు కీలక అంశాలను తీసుకెళ్లారు ముదిరాజులను బిసి-డి నుంచి బీసీ ఏ గ్రూపులో అంశాన్ని పరిశీలించడం హైదరాబాద్ ముదిరాజ్ భవన నిర్మాణక అవసరమైన ప్రభుత్వ ఆర్థిక సాయం అందించడం ముదిరాజ్ యువతకు విద్య ఉద్యోగ ఆర్థిక రంగాల్లో మెరుగైన అవకాశాలు కల్పించడం సామాజిక రాజకీయ రంగాల్లో ముదిరాజులకు తగిన ప్రాధాన్యత అవకాశాలు కల్పించే దిశగా చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు పండుగ సాయన్న జయంతి వేడుకలను అధికారుల నిర్వహించి ముదిరాజ్ సమాజా గౌరవాన్ని పెంపొందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ముదిరాజ్ సమాజ సమస్యలను ప్రభుత్వం దృష్టిలో తీసుకెళ్లడం కీలకంగా వ్యవహరించిన మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్ కు ప్రభుత్వానికి మరోసారి ప్రతి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు ముదిరాజ్ సమాజ అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలు ఉత్సవ కమిటీ సంపూర్ణ సహకారం అందిస్తుందని సామాజ హక్కులు సంక్షేమ అభ్యున్నతి కోసం ఐక్యంగా కృషి చేస్తామని బోర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తెలియజేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాష్ట్ర యువత నాయకులు జగన్ ముదిరాజ్, జనార్ధన్ ముదిరాజ్, పోశాల సరస్వతి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## గుండాలలో బీర్ల ఐలయ్య సమక్షంలో ఎన్నికల సమరానికి సన్నాహాలు..
# అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం!

**గుండాల అక్టోబర్ 23 యాదాద్రి జిల్లా భవిషత్ ప్రజా పాలన :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమరానికి సిద్ధమవుతున్నాయి. ప్రచారాన్ని ముమ్మరం చేసి, పట్టభద్రులను నేరుగా కలిసి మద్దతు కూడగట్టాలని పార్టీ నాయకత్వం దిశానిర్దేశం చేస్తోంది. ఇందులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నల్గొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సమావేశంలో పాల్గొని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయానికి పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. పట్టభద్రులను కలిసి కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు కోరాలని, ప్రచార కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

**"అనంతరంలో ఇందిరమ్మ ఇంటికి భూమిపూజ"**

ఎన్నికల సన్నాహక సమావేశం అనంతరం గుండాల మండలంలోని అనంతరం గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి బీర్ల ఐలయ్య భూమిపూజ నిర్వహించి, ముగ్గు పోశారు. అర్హులైన పేదలకు సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం చేపడుతున్న గృహ నిర్మాణ కార్యక్రమాల్లో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది.

**"సుద్దాలలో కుటుంబానికి పరామర్శ.. శ్రీశైలానికి నివాళి"**

అనంతరం సుద్దాల గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన బండ శ్రీశైలం కుటుంబాన్ని బీర్ల ఐలయ్య పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. శ్రీశైలం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కార్యదర్శి పొడిచేటి వెంకన్న, జిల్లా ఉపాధ్యక్షుడు ఏలూరు రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నూనమంతుల విమల వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇమ్మడి దశరథ గుప్తా, వివిధ గ్రామాల సర్పంచులు పెండ్యాల వినోద్ కుమార్, దేవనబోయిన ఐలయ్య, గూడెపు కుమార్,మచ్చ నాగిరెడ్డి,లింగాల అనిల్ కుమార్ గౌడ్, వల్లాల రమేష్, గద్వాల ఉపేందర్, కాలి మంజుల,ఆంజనేయులు,సింగిల్ విండో డైరెక్టర్లు నూనమంతుల యాదయ్య, పొన్నగాని నారాయణ, అన్నెపర్తి యాదగిరితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నెక్స్ట్‌జెన్ అల్ట్రా లగ్జరీ నివాస సముదాయం 'ట్రెవిటా' ప్రారంభం

- **'ట్రూ లగ్జరీ' థీమ్‌తో సైబర్ సిటీ వినూత్న ప్రాజెక్ట్.. 60 వేల చదరపు అడుగుల క్లబ్‌హౌస్, 75 శాతం పచ్చదనంతో ప్రత్యేక ఆకర్షణ**

**హైదరాబాద్ సిటీ బ్యూరో, అక్టోబర్ 23 (భవిష్యత్ ప్రజాపాలన):** హైదరాబాద్‌లో ప్రముఖ నిర్మాణ సంస్థగా పేరొందిన సైబర్ సిటీ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ తన అత్యాధునిక అల్ట్రా లగ్జరీ నివాస ప్రాజెక్ట్ 'సైబర్ సిటీ ట్రెవిటా'కు సంబంధించి నూతన ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించింది. 'ట్రూ లగ్జరీ' (నిజమైన విలాసవంతమైన జీవనం) థీమ్‌తో రూపొందిస్తున్న ఈ ప్రాజెక్ట్‌లో ఆధునిక నిర్మాణశైలి, అత్యాధునిక సాంకేతికత, పచ్చదనం, ప్రపంచస్థాయి జీవనశైలి సదుపాయాలకు ప్రాధాన్యమిచ్చినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. కొండాపూర్‌లో ఏర్పాటు చేసిన ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను సందర్శించడం ద్వారా కొనుగోలుదారులు ప్రాజెక్ట్‌లోని నివాస వసతులు, సదుపాయాలు, జీవనశైలి ప్రత్యేకతలను ప్రత్యక్షంగా తెలుసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా సైబర్ సిటీ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, ఇల్లు కొనుగోలు చేసేవారికి నిజమైన విలాసవంతమైన జీవనం అంటే ఏమిటో 'సైబర్ సిటీ ట్రెవిటా' పరిచయం చేస్తుందని పేర్కొన్నారు. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో సరికొత్త జీవన అనుభూతిని అందించేందుకు నిర్మాణశైలి, రూపకల్పన, సాంకేతికతను సమన్వయం చేసినట్లు తెలిపారు. ట్రెవిటా ప్రాజెక్ట్‌లో భాగంగా 35 ప్రపంచస్థాయి సదుపాయాలతో కూడిన స్కైలైన్ డెక్‌ను ఏర్పాటు చేస్తున్నారు. టెర్రస్ స్విమ్మింగ్ పూల్‌తో పాటు ఐదు అంతస్తుల్లో విస్తరించిన 60 వేల చదరపు అడుగుల విశాలమైన క్లబ్‌హౌస్‌ను నిర్మిస్తున్నారు. ఇందులో క్రీడలు, వినోదం, విశ్రాంతికి సంబంధించిన పలు సదుపాయాలు అందుబాటులో ఉంటాయి. మొత్తం ప్రాజెక్టులో 75 శాతం స్థలాన్ని ఖాళీ ప్రదేశాలు, పచ్చదనానికి కేటాయించగా, 37 ప్రత్యేక ల్యాండ్‌స్కేప్ సదుపాయాలను రూపొందిస్తున్నారు. దీంతో నివాసితులకు ప్రకృతికి చేరువగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో జీవించే అవకాశం కలుగుతుందని సంస్థ వెల్లడించింది. అత్యాధునిక సాంకేతికతతో భద్రత, సౌకర్యాలు: ట్రెవిటా ప్రాజెక్ట్‌లో హైదరాబాద్‌లో తొలిసారిగా ఒక నిర్మాణ సంస్థ పరిచయం చేస్తున్నట్లు పేర్కొన్న ఔర్మ్ (ఆబతీవ) సంస్థకు చెందిన రెండు ఆధునిక సాంకేతిక పరిష్కారాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ప్రతి టవర్ ప్రవేశ లాబీలో బయోమెట్రిక్ భద్రతతో కూడిన, బీమా సదుపాయం ఉన్న ఔర్మ్ వాల్ట్స్ లాకర్లను ఏర్పాటు చేస్తున్నారు. నివాసితులు తమ విలువైన వస్తువులను భద్రంగా భద్రపరుచుకునేందుకు ఇవి ఉపయోగపడతాయి. అలాగే 'ఎలివేట్ బై ఔర్మ్' (ELIVATE by Aurm) పేరుతో రోబోటిక్ పార్శిల్ డెలివరీ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రత్యేక లిఫ్ట్ వ్యవస్థ ద్వారా ఈ-కామర్స్ పార్శిళ్లను నివాసితులకు చేరవేయడం ఈ సాంకేతికత ప్రత్యేకత. దీనివల్ల డెలివరీ సిబ్బంది నివాస ప్రాంతాల్లోకి ప్రవేశించాల్సిన అవసరం తగ్గడంతోపాటు, నివాసితుల గోప్యతకు రక్షణ లభిస్తుంది. సాధారణ లిఫ్ట్‌లపై ఒత్తిడి కూడా తగ్గుతుంది. విలాసవంతమైన నివాసాల కోసం హైదరాబాద్ ప్రధాన గమ్యస్థానంగా ఎదుగుతున్న నేపథ్యంలో, నాణ్యమైన జీవనం, పర్యావరణహిత వాతావరణం, ఆధునిక సాంకేతికతతో కూడిన నివాస సముదాయాలను అభివృద్ధి చేయడంపై దృష్టి సారిస్తున్నట్లు సైబర్ సిటీ ప్రతినిధులు తెలిపారు. 'ట్రెవిటా' ప్రాజెక్ట్ ద్వారా నివాసితుల దైనందిన జీవితాన్ని మరింత సౌకర్యవంతంగా, ప్రత్యేకంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు.

# పాచిల్ల గ్రామసభలో పాల్గొన్న యాదాద్రి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

- **నీటి వనరుల పరిరక్షణకు ప్రాధాన్యం.. పంటల ఎంపికలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచన**

**గుండాల అక్టోబర్ 23 యాదాద్రి జిల్లా భవిషత్ ప్రజా పాలన:** వాతావరణ పరిస్థితుల్లో చోటుచేసుకుంటున్న మార్పుల నేపథ్యంలో నీటి వనరుల వినియోగం, వ్యవసాయ ప్రణాళికలపై ముందస్తు అప్రమత్తత అవసరమని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. వర్షపాతం తగ్గే పరిస్థితులు ఏర్పడితే తాగునీరు, సాగునీటి అవసరాలపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున ప్రజలు, అధికారులు ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు. శుక్రవారం గుండాల మండలం పాచిల్ల గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో కలెక్టర్ పాల్గొని వాతావరణ మార్పులు, ఎల్‌నినోకు సంబంధించిన పరిస్థితులు, నీటి లభ్యత, వ్యవసాయ రంగంపై పడే ప్రభావం, విద్యుత్ వినియోగం తదితర అంశాలపై గ్రామస్థులతో చర్చించారు.వర్షాలు ఆశించిన స్థాయిలో కురవని పరిస్థితులు ఎదురైతే తాగునీరు, సాగునీటి సరఫరాపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని కలెక్టర్ వివరించారు. ఇలాంటి పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సూచించారు. ఇళ్లలో, వ్యవసాయ క్షేత్రాల్లో, ప్రజా అవసరాల కోసం వినియోగించే నీటిని వృథా చేయకుండా పొదుపుగా ఉపయోగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వర్షాభావ పరిస్థితులు వ్యవసాయ రంగంపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున రైతులు పంటల ఎంపిక విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ ప్రణాళికలు రూపొందించుకోవడం అవసరమని పేర్కొన్నారు. విద్యుత్‌ను కూడా అవసరానికి అనుగుణంగా వినియోగిస్తూ వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. వాతావరణ పరిస్థితులపై నిర్దిష్ట అంచనాలు, అందుబాటులో ఉన్న నీటి వనరుల వివరాలను పరిగణనలోకి తీసుకుని అధికారులు తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవడం కీలకం. నీటి పొదుపుపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించుకోవచ్చనే అంశాన్ని గ్రామసభలో ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రెడ్డి, చేనేత మరియు జౌళి శాఖ అధికారి శ్రీనివాస్, ఎంపీడీవో, తహసీల్దార్, సంబంధిత అధికారులు, గ్రామ సర్పంచ్ అల్లంశెట్టి మహేష్ ఉపసర్పంచ్ పందుల రమేష్ వార్డు సభ్యులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# జనాభాకు అనుగుణంగా పురోగతి సిఎస్

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ అక్టోబర్ 23 :** జనాభా గణన పురోగతిని, రాబోయే జనాభా గణన దశకు సంబంధించిన సన్నాహాలను సమీక్షించేందుకు, ప్రధాన కార్యదర్శి సంజయ్ జజు అధ్యక్షతన ఈరోజు సచివాలయంలో రాష్ట్ర స్థాయి జనాభా గణన సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. తెలంగాణ జనాభా గణన కార్యకలాపాల డైరెక్టర్ భారతి హోలికేరి, జనాభా గణన ప్రక్రియ మరియు ఇప్పటివరకు సాధించిన పురోగతిపై సవివరంగా వివరించారు. రాష్ట్రంలో ఇళ్ల జాబితా మరియు గృహ గణనతో కూడిన మొదటి దశ విజయవంతంగా పూర్తయిందని ఆమె కమిటీకి తెలియజేశారు. జనాభా గణనతో కూడిన రెండవ దశ, 2027 జనవరి మరియు ఫిబ్రవరి నెలల్లో ప్రారంభం కానుందని ఆమె తెలిపారు. ఈ విషయంలో, సజావుగా మరియు సమర్థవంతంగా అమలు జరిగేలా చూసేందుకు, జనాభా గణనలో పాల్గొనే సిబ్బందికి అవసరమైన అన్ని శిక్షణా కార్యక్రమాలు 2027 జనవరికి ముందే పూర్తి చేయబడతాయని ఆమె కమిటీకి తెలియజేశారు. జనాభా గణన ప్రారంభానికి

15 రోజుల ముందు పౌరులకు స్వీయ-గణన సౌకర్యం కల్పించబడుతుందని ఆమె ఇంకా వివరించారు. దీనివల్ల ప్రజలు తమ వివరాలను ముందుగానే అందించడానికి వీలవుతుంది జనగణనను క్రమపద్ధతిలో నిర్వహించడం సులభతరం అవుతుంది. రెండవ దశకు అవసరమైన సన్నాహాలను ఈ సమావేశం సమీక్షించింది. శిక్షణను సకాలంలో పూర్తి చేయడం, సంబంధిత శాఖల మధ్య సమన్వయం, గణన ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయడంపై ఈ సందర్భంగా ప్రధానంగా దృష్టి సారించారు. జనాభా గణన ప్రక్రియ సజావుగా, సమర్థవంతంగా జరిగేలా చూసేందుకు పకడ్బందీ ప్రణాళిక, అంతర్-శాఖల సమన్వయం యొక్క ప్రాముఖ్యతను ప్రధాన కార్యదర్శి సంజయ్ జజు నొక్కి చెప్పారు. ఈ సమావేశానికి ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్, సాధారణ పరిపాలనా మరియు అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, ఆరోగ్య శాఖ ముఖ్య కార కార్యదర్శి.

# దొంతాన్‌పల్లిలో బాలల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

- **బాల కార్మికులు, బాల్యవివాహాలు, విద్యార్థుల డ్రాప్‌అవుట్స్ నివారణపై మధ్యప్రదేశ్ ఎం.వి. ఫౌండేషన్ బృందం అధ్యయనం**
- **సర్పంచ్ అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో గ్రామంలో అమలవుతున్న విధానాలపై ఆరా**

**భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి ၊ రంగయ్య గారి శ్రీనివాస్ ၊ అక్టోబర్ 23 ၊ చేవెళ్ల నియోజకవర్గం :** రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం దొంతాన్‌పల్లి గ్రామపంచాయతీని మధ్యప్రదేశ్ కు చెందిన ఎం.వి. ఫౌండేషన్ బృందం సందర్శించి, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్యవివాహాల నివారణ, విద్యార్థులు మధ్యలోనే చదువు మానేయకుండా తీసుకుంటున్న చర్యలపై వివరాలు సేకరించింది. గ్రామంలో బాలల హక్కుల పరిరక్షణకు చేపడుతున్న కార్యక్రమాల గురించి సర్పంచ్ అబ్దుల్ అజీజ్, ఉప సర్పంచ్ బాలకృష్ణ, వార్డు సభ్యులు, న్యాయవాది, తల్లులు, స్వయం సహాయక సంఘాల సభ్యులతో బృందం చర్చించింది. ఈ సందర్భంగా సర్పంచ్ అబ్దుల్ అజీజ్, ఉప సర్పంచ్ బాలకృష్ణ, న్యాయవాది అశోక్, స్వయం సహాయక సంఘాల సభ్యురాలు స్వప్న, కేవీఎస్ గ్రూపు సభ్యులు అలవేలు, అలేఖ్య, కృప, గ్రామ కార్యదర్శి రమేష్‌ల నుంచి గ్రామంలో అమలు చేస్తున్న విధానాలు, తీసుకుంటున్న చర్యలపై వివరాలు

తెలుసుకుంది. అనంతరం మహారాజ్‌పేట పాఠశాలను సందర్శించి విద్యార్థులు, బాలల లింగ సమానత్వ కమిటీసభ్యులతో మాట్లాడింది. బాలల హక్కులు, విద్య ప్రాధాన్యత, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్యవివాహాల నివారణ అంశాలపై ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బందితో చర్చించింది. గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, పాఠశాల సిబ్బంది సమన్వయంతో బాలల హక్కుల పరిరక్షణకు చేపడుతున్న చర్యలను అధ్యయనం చేయడం ఈ పర్యటన ముఖ్య ఉద్దేశమని బృందం తెలిపింది.ఈ కార్యక్రమం లో ఎం.వి. ఫౌండేషన్ ప్రతినిధులు నాగమణి, టి. మంగ,ఎం.మంగ తదితరులు పాల్గొన్నారు.

# వంశపారంపర్య రక్త వ్యాధులపై అంతర్జాతీయ సదస్సు

● **అక్టోబర్ 23 నుంచి 25 వరకు హెచ్ఐసీసీ-నోవోటెల్‌లో జీఏఎన్ఎస్ఐడీ కాంగ్రెస్-2026.**

**హైదరాబాద్, అక్టోబర్ 22 (భవిష్యత్ ప్రజాపాలన):** తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా తదితర వంశపారంపర్య రక్త సంబంధిత వ్యాధులపై అవగాహన పెంపొందించడంతో పాటు, మెరుగైన వైద్య సేవలు, పరిశోధనలు, రోగుల సంక్షేమానికి అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా హైదరాబాద్‌లో అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు గ్లోబల్ యాక్షన్ నెట్‌వర్క్ ఫర్ సికిల్ సెల్ అండ్ అదర్ ఇన్‌హెరిటెడ్ బ్లడ్ డిజార్డర్స్ (GANSID) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ లాన్రే తుంజి-అజాయి, తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ (TSCS) అధ్యక్షుడు చంద్రకాంత్ అగర్వాల్ తెలిపారు. అక్టోబర్ 23 నుంచి 25 వరకు మాదాపూర్‌లోని హెచ్ఐసీసీ-నోవోటెల్ వేదికగా నాలుగో జీఏఎన్ఎస్ఐడీ కాంగ్రెస్-2026 నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ అంతర్జాతీయ సదస్సుకు హైదరాబాద్‌కు చెందిన తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ స్థానిక భాగస్వామిగా వ్యవహరిస్తోందన్నారు. తలసేమియా, సికిల్ సెల్ వ్యాధులు, ఇతర వంశపారంపర్య రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న 4,800 మందికి పైగా రోగులకు ఖాజా లాభాపేక్ష లేని సంస్థగా సేవలందిస్తోందని వివరించారు. GANSIDతో భాగస్వామ్యం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో వైద్య నిపుణులు, పరిశోధకులు, ఆరోగ్య సంస్థలు, రోగుల సంఘాల మధ్య సహకారాన్ని పెంపొందించడంతో పాటు, బాధితులకు, వారి కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు, మద్దతు వ్యవస్థలను అందించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సుకు 27 దేశాల నుంచి సుమారు 700 మంది రిజిస్టర్డ్ ప్రతినిధులు హాజరవుతారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ వైద్య నిపుణులు, పరిశోధకులు, ఆరోగ్య సంరక్షణ రంగ ప్రతినిధులు, రోగుల సంఘాల సభ్యులు, విధాన నిర్ణేతలు, సామాజిక కార్యకర్తలు పాల్గొని వంశపారంపర్య రక్త వ్యాధుల నివారణ, చికిత్స, పరిశోధనలు, రోగుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై చర్చించనున్నారు. ఈ కార్యక్రమంలో ఖాజా చీఫ్ మెడికల్ రీసెర్చ్ ఆఫీసర్, కార్యదర్శి డాక్టర్ సుమన్ జైన్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రత్నావళి, జాయింట్ సెక్రటరీ అలీమ్ బేగ్, మనోజ్ రూపణి, నరేష్ రాఠీ తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్ విమానాశ్రయంలో బీజేపీ జాతీయ నేతలకు ఘన స్వాగతం

● **భారీ పూలమాలలు, శాలువాలతో ఆత్మీయ ఆహ్వానం.. కోలన్ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో తరలివచ్చిన బీజేపీ శ్రేణులు**

**రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం- భవిష్యత్ ప్రజాపాలన :** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో శుక్రవారం మధ్యాహ్నం బీజేపీ జాతీయ నాయకులకు ఘన స్వాగతం లభించింది. బీజేపీ వివిధ విభాగాల జాతీయ కన్వీనర్, మాజీ ఎంపీ వీడీ శర్మ, బీజేపీ జాతీయ సెల్ జాయింట్ కన్వీనర్ విష్ణు వర్ధన్ రెడ్డికి బీజేపీ తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ సెల్ కన్వీనర్ కోలన్ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి ఘనంగా ఆహ్వానించారు. విమానాశ్రయానికి చేరుకున్న జాతీయ నాయకులకు స్వాగతం పలికేందుకు బీజేపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో అక్కడ సందడి నెలకొంది. పార్టీ నాయకత్వంపై అభిమానాన్ని, సంస్థాగత ఐక్యతను చాటుతూ కోలన్ శంకర్ రెడ్డి తన బృందంతో కలిసి జాతీయ నాయకులకు ఆత్మీయ స్వాగతం పలికారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించి తమ అభిమానాన్ని వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో పార్టీ బాధ్యతలు నిర్వహిస్తున్న నాయకులకు స్వాగతం పలకడం తమకు సంతోషంగా ఉందని పార్టీ శ్రేణులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు,కార్యకర్తలు పరస్పరం ఆత్మీయంగా పలకరించుకుంటూ ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు.పార్టీ బలోపేతం, నాయకులు-కార్యకర్తల మధ్య సమన్వయం, ప్రజల్లో పార్టీ భావజాలాన్ని మరింత విస్తరించడం వంటి అంశాల్లో సమష్టి కృషి అవసరమనే అభిప్రాయాన్ని నాయకులు వ్యక్తం చేశారు.

**ఐక్యతే పార్టీ బలం.. కార్యకర్తలే వెన్నెముక**

రాజకీయాల్లో నాయకత్వం ఎంత ముఖ్యమో, క్షేత్రస్థాయిలో పనిచేసే కార్యకర్తల పాత్ర కూడా అంతే కీలకమని ఈ స్వాగత కార్యక్రమం చాటిచెప్పింది. నాయకులు, కార్యకర్తలు పరస్పర సహకారంతో ముందుకు సాగినప్పుడే సంస్థాగతంగా మరింత బలోపేతం సాధ్యమవుతుందని పార్టీ శ్రేణులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సీహెచ్ కృష్ణ రెడ్డి, బి. ప్రతాప్, గంగాపురం వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, ప్రశాంత్, విష్ణు వర్ధన్ రెడ్డి, సత్యనారాయణ, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. జాతీయ నాయకులకు ఘన స్వాగతం పలుకుతూ కార్యక్రమాన్ని ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు.

# ప్రశ్నిస్తాం పోరాడుతాం, పరిష్కరిస్తాం

**కల్వకుంట్ల కవిత**

**భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి శేరిలింగంపల్లి:** రానున్న జిహెచ్ఎంసి ఎన్నికలలో అన్ని డివిజన్ లలో పోటీ చేసి బల్దియా లో టిఆర్ఎస్ జండా ఎగరవేస్తామని ఆ పార్టీ అధినేత కల్వకుంట్ల కవిత అన్నారు. ఉమ్మడి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ వాసిలీ చంద్రశేఖర్ ప్రసాద్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మియాపూర్ లోని నరేన్ గార్డెన్ లో ఏర్పాటుచేసిన రాజధాని రణభేరి సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రశ్నిస్తాం, పోరాడుతాం పరిష్కరిస్తాం అని అన్నారు.మన పట్టభద్రుల ఎమ్మెల్సీ తొలి అభ్యర్థి అయిన శ్రీకాంత్ గౌడ్ ను ఆశీర్వదించాలని కోరారు. ఇక ముందు రాబోయే మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో కూడా పోటీ చేస్తామన్నారు. జి హెచ్ఎంసి లో నీ 300 డివిజన్లలో కూడా కూడా పోటీ చేస్తామని, ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో కూడా పోటీ చేస్తామని ఆమె ఈ సందర్భంగా తెలిపారు. హైదరాబాద్ ను కేంద్ర పాలిత ప్రాంతం చేస్తామంటే ఒప్పుకోలేదనీ, హైదరాబాద్ 400 ఏళ్ల ఘనమైన చరిత్ర ఉందని, ఆ చరిత్ర ను తెలుసుకోవాలనీ, చరిత్ర తెలవలేనోడు నాయకులు కాలేరు అన్నారు. హైదరాబాద్ నగరంలో కోటి మంది జనాభా కు కావాల్సిన అవసరాలు ఇప్పుడున్న ప్రభుత్వం తీర్చడం లేదని, మనం ఆ అవసరాలు తీర్చాలనీ పేర్కొన్నారు.వందల ఏళ్ల క్రితం ముత్యాలను సృష్టించిన ఘనత సైబరాబాద్ కు ఉందని ఇపుడు ఐటీ రంగంలో ప్రపంచంలోనే ప్రత్యేక స్థానంలో ఉందని, ఐటీ ఉద్యోగుల కోసం ఒక పాలసీ తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే పెట్టుబడిదారులకు స్వాగతం పలకాలని, కానీ రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్తున్నాడనీ, మళ్ళీ వచ్చే ఆర్థిక సమ్మిట్ లో ఏం చేస్తారో చెప్పండనీ కోరారు.డమ్మీ సమ్మిట్‌ల పేరుతో రావద్దని హెచ్చరించారు. మన టి ఆర్ ఎస్ పార్టీకి కమిట్ మెంట్ ఉన్న కార్యకర్తలు కావాలనీ సూచించారు. విశ్వ నగరం అని చెప్పుకుంటున్నాం కానీ నగరంలో మంచి నీళ్ళు లేవనీ నీళ్లు ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వాన్ని ఇప్పుడే చూస్తున్నా మన్నారు. మన వాళ్ళు గల్లిల్లో తిరగాలనీ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలనీ. ప్రజల కోసం పని చేద్దామని పిలుపు నిచ్చారు. చెత్త గురించి అయితే చెప్పాల్సిన పనే లేదనీ, నగరంలో ఉన్న 50 వేల మంది కార్మికుల పొట్టకొడుతున్నా రనీ. ఇది న్యాయమా అని ప్రశ్నించారు. అలా చేస్తే చూస్తూ ఊరుకో మనీ. సీఎం ఇంటిముందు చెత్త పోసి నిరసన తేలుపుతామన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం కూరగాయలు అమ్మే వారికి ఏసీ ఆటోలు ఇవ్వాలనీ కోరారు. గర్భిణీ ల గురించి. ముసలోల్ల గురించి ఆలోచించాలనీ రోడ్లు బాగు చేయాలని కోరారు. దోమలు టవర్లు కట్టాయనే వీడియో సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతుందన్నారు. హైదరాబాద్ నగరం ది ఏ ఆలత్ ఉండేదని ఏం అలత్ అయిందన్నారు. యువత కోసం కొత్త తరం ఆలోచనలతో ముందుకు వెళ్తామన్నారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు.

# మల్కాజ్‌గిరి శాసనసభ నియోజకవర్గ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రజా భవన్‌లో

## తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మరియు విద్యుత్ శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లుని మర్యాదపూర్వకంగా కలిశారు

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ అక్టోబర్ 23:** ఈ సందర్భంగా మల్కాజ్‌గిరి నియోజకవర్గంలోని పలు ప్రజా సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

**ఆశా కిరణ్ చిల్డ్రన్స్ హోమ్స్‌కు ఆర్థిక సహాయం**

సిస్టర్స్ ఆఫ్ చారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశా కిరణ్ చిల్డ్రన్స్ హోమ్స్‌కు గ్రాంటు రూపంలో నిధులు మంజూరు చేసి, సంస్థ సేవలకు ఆర్థిక సహకారం అందించాలని ఎమ్మెల్యే ఉప ముఖ్యమంత్రివర్యులను కోరారు.

**అర్హులకు టీ-ఫైడ్ ద్వారా సబ్సిడీలు**

టీ-ఫైడ్ ద్వారా అర్హులైన లబ్ధిదారులకు త్వరగా సబ్సిడీలు మంజూరు చేసి, వారికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు**

ఎల్ నినో ప్రభావంతో నెలకొంటున్న పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, నియోజకవర్గంలో విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజలకు నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన ప్రాంతాల్లో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయడంతో పాటు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సింగిల్ ఫేజ్ నుంచి త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరాకు మార్పులు చేపట్టాల్సిన ప్రాంతాల్లో తగిన చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, బంచ్ కేబుల్స్ అమర్చాలని కోరారు.

**యాదమ్మనగర్‌లో విద్యుత్ బల్క్ మీటర్ల సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి**

వెంకటాపురం డివిజన్ పరిధిలోని యాదమ్మనగర్‌లో పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలు, ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాల ప్రజలు నివసిస్తున్న ప్రాంతంలో విద్యుత్ బల్క్ మీటర్ల కారణంగా ఎదురవుతున్న సమస్యలను ఎమ్మెల్యే ఉప ముఖ్యమంత్రివర్యుల దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, వారి సమస్యలకు తగిన పరిష్కారం చూపేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న ఇతర ప్రజా అవసరాలకు సంబంధించిన సమస్యలను కూడా వివరించి, వాటి పరిష్కారానికి ప్రభుత్వ శాఖల ద్వారా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అందజేసిన వినతిపత్రంపై ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు సానుకూలంగా స్పందించి, సంబంధిత అంశాలను పరిశీలించి మల్కాజ్‌గిరి ప్రజల సంక్షేమం కోసం తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిస్టర్స్ ఆఫ్ చారిటీ సభ్యులు సిస్టర్ అనిత, సిస్టర్ క్యాథరిన్, లియోనార్డ్ మీగర్, డేవిడ్ ఫ్రాంక్లిన్, పాస్టర్ విన్సెంట్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరుకు బ్లాక్ డే.. నీటి హక్కులపై రాజీపడే ప్రసక్తే లేదు

● **పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నీళ్లు ఇతర ప్రాంతాలకు తరలించే ప్రతిపాదనలపై చీమర్ల అర్జున్ రెడ్డి ఆగ్రహం**

● **ముందుగా పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి.. పాలమూరు రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలి.. ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు మౌనం వీడాలి**

**మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన, రంగారెడ్డి జిల్లా:** పాలమూరు ప్రాంతానికి సాగునీటి విషయంలో మరోసారి అన్యాయం జరిగే పరిస్థితులు ఏర్పడుతున్నాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన సమీక్షలో పాలమూరు ప్రజలకు శుభవార్త అందుతుందని ఆశించినప్పటికీ, తమ ప్రాంత ప్రయోజనాలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుంటే సహించేది లేదని చీమర్ల అర్జున్ రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం లక్ష్యం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతులకు సాగునీరు అందించడం, కరువును పారదోలడం, వలసలను నివారించడం కావాలని స్పష్టం చేశారు. తమ ప్రాంతానికి కేటాయించిన నీటి హక్కులకు భంగం కలిగించే ప్రతిపాదనలను వ్యతిరేకిస్తామని పేర్కొంటూ, పాలమూరు ప్రజల ప్రయోజనాల పరిరక్షణ కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు.

**పాలమూరు రైతుల ఆశలపై నీళ్లు చల్లొద్దు**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా దశాబ్దాలుగా కరువు, సాగునీటి కొరత, ఉపాధి అవకాశాల లేమి, వలసల సమస్యలతో సతమతమవుతోందని చీమర్ల అర్జున్ రెడ్డి పేర్కొన్నారు. వర్షాలు సకాలంలో కురవక, చెరువులు, కుంటలు నిండక, బోరుబావుల్లో నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న సందర్భాలు ఎన్నో ఉన్నాయని గుర్తుచేశారు. వ్యవసాయంపై ఆధారపడి జీవించే కుటుంబాలు సాగునీరు లేక పంటలు పండించలేకపోవడం, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సి రావడం పాలమూరు ప్రజల జీవితాల్లో తీవ్రమైన ప్రభావం చూపిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులను మార్చాలనే లక్ష్యంతోనే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే తమ పొలాలకు సాగునీరు అందుతుందని, బీడు భూములు పచ్చని పంట పొలాలుగా మారుతాయని, రైతుల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయని ప్రజలు ఆశిస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి ప్రాజెక్టుకు సంబంధించి నీటిని ఇతర ప్రాంతాలకు తరలించే ప్రతిపాదనలు తెరపైకి వస్తే పాలమూరు ప్రజల్లో ఆందోళన నెలకొనడం సహజమని అన్నారు. “పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం మా రైతుల కన్నీళ్లు తుడవాలి.. మా బీడు భూములను పచ్చని పంట పొలాలుగా మార్చాలి. మా యువత వలసల బాట పట్టకుండా మా ప్రాంతంలోనే ఉపాధి కల్పించాలి. మా ప్రాంతానికి న్యాయం జరిగే వరకు మా నీటి హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతాం.”

**ముందుగా పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యతతో పూర్తి చేయాలని చీమర్ల అర్జున్ రెడ్డి డిమాండ్ చేశారు. పాలమూరు రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని, ప్రాజెక్టుల నిర్మాణం, నిధుల కేటాయింపు, పనుల పురోగతి, నీటి పంపిణీపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరారు. సాగునీటి కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రైతులకు ముందుగా న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రాజెక్టుల లక్ష్యాలు నెరవేరకముందే నీటి తరలింపుపై ప్రతిపాదనలు ముందుకు రావడం తమ ప్రాంత ప్రజల్లో ఆందోళనకు కారణమవుతోందని పేర్కొన్నారు. పాలమూరు రైతులకు ఎంత నీరు అందుతుంది? పెండింగ్ పనులు ఎప్పటికి పూర్తవుతాయి? సాగునీరు ఎప్పటి నుంచి అందుబాటులోకి వస్తుంది? అనే ప్రశ్నలకు ప్రభుత్వం స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టుల నిర్మాణం కేవలం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పనులు వేగవంతం కావాలని, రైతులకు వాస్తవంగా ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సాగునీరు అందితే వ్యవసాయం అభివృద్ధి చెందడంతో పాటు పశు పోషణ, అనుబంధ రంగాలు, స్థానిక వ్యాపారాలు కూడా బలోపేతమవుతాయని

వివరించారు. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరిగి, వలసల సమస్య తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సూటి ప్రశ్నలు**

పాలమూరు ప్రాంతానికి చెందిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమ జిల్లాలోని రైతుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని చీమర్ల అర్జున్ రెడ్డి కోరారు. పాలమూరు ప్రజలు తమ ప్రాంతానికి సాగునీరు అందుతుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, ఆ ఆశలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పాలమూరు రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించే హామీ, స్పష్టమైన కార్యాచరణ లేకుండా ఇతర ప్రాంతాలకు నీటిని తరలించే ప్రతిపాదనలు ఎందుకు ముందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. ముందుగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి, రైతుల పొలాలకు నీరు అందించిన తర్వాతే ఇతర ప్రతిపాదనలపై చర్చించాలని డిమాండ్ చేశారు. పాలమూరు ప్రాంతానికి కేటాయించిన నీటి హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ సమీక్షలు, ప్రకటనలు ప్రజలకు ఆశలు కల్పించడానికే పరిమితం కాకూడదని, వాటి ఫలితాలు రైతుల పొలాల్లో కనిపించాలని అన్నారు. సాగునీటి ప్రాజెక్టుల పురోగతి, నీటి లభ్యత, పంపిణీ ప్రణాళిక వంటి అంశాలపై ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు.

**ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్యేలు మౌనం వీడాలి**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు పాలమూరు నీటి హక్కుల అంశంపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలని చీమర్ల అర్జున్ రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లాలోని రైతుల ప్రయోజనాలను కాపాడటంలో ఎమ్మెల్యేలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, తమ ప్రాంతానికి సంబంధించిన కీలకమైన సాగునీటి అంశాలపై మౌనంగా ఉండకూడదని అన్నారు. పాలమూరు రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి కోసం కృషి చేయడం, నీటి కేటాయింపులపై స్పష్టత సాధించడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని పేర్కొన్నారు. రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం నుంచి హామీలు సాధించాలని కోరారు. ఈ అంశంపై ప్రజాప్రతినిధులు స్పందించకపోతే ప్రజాస్వామ్యబద్ధంగా తమ నిరసనను తెలియజేస్తామని, అవసరమైతే వారి ఇళ్లను ముట్టడించే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ప్రజల ఓట్లతో ఎన్నికైన నాయకులు ప్రజల సమస్యలపై స్పందించాల్సిందేనని, ప్రాంత ప్రయోజనాల విషయంలో బాధ్యతను విస్మరించరాదని స్పష్టం చేశారు. పాలమూరు రైతుల భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయాలపై ప్రజాప్రతినిధులు తమ అభిప్రాయాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు.

**ఇతర ప్రాంతాల ప్రజలపై వ్యతిరేకత కాదు.. పాలమూరుకు న్యాయం కావాలి**

తమ పోరాటం ఇతర ప్రాంతాల ప్రజలకు వ్యతిరేకంగా కాదని, పాలమూరు రైతులకు అన్యాయం జరగకూడదనే ఉద్దేశంతోనే ఈ డిమాండ్లు చేస్తున్నామని చీమర్ల అర్జున్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలని, ప్రతి రైతుకు సాగునీరు అందాలని తాము కోరుకుంటున్నామని పేర్కొన్నారు. అయితే ఒక ప్రాంత అభివృద్ధి పేరుతో మరో ప్రాంత రైతుల ప్రయోజనాలు దెబ్బతినకూడదని అన్నారు. నీటి పంపిణీ విషయంలో అన్ని ప్రాంతాల అవసరాలు, ప్రాజెక్టుల లక్ష్యాలు, చట్టబద్ధమైన కేటాయింపులు, రైతుల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. పాలమూరు ప్రాంతానికి సంబంధించిన ప్రాజెక్టుల పూర్తి, సాగునీటి సరఫరా, నీటి హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. “మా పోరాటం ఎవరికీ వ్యతిరేకం కాదు.. మా ప్రాంత రైతులకు న్యాయం జరగాలన్నదే మా ఆకాంక్ష. ఇతర ప్రాంతాల పొలాలు పచ్చబడటాన్ని మేము వ్యతిరేకించం. అదే సమయంలో పాలమూరు రైతుల పొలాలు బీడుగా మిగిలిపోవడాన్ని కూడా అంగీకరించం. ప్రతి ప్రాంతానికి న్యాయం జరగాలి.. ప్రతి రైతుకు సాగునీరు అందాలి.. పాలమూరు హక్కులకు భంగం కలగకూడదు.”

**పాలమూరు పచ్చబడే వరకు పోరాటం ఆగదు**

పాలమూరు ప్రాంతానికి సాగునీరు అందించడం, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడం, రైతుల జీవితాల్లో మార్పు తీసుకురావడం ప్రభుత్వ ప్రాధాన్యతలుగా ఉండాలని చీమర్ల అర్జున్ రెడ్డి పేర్కొన్నారు. ప్రాజెక్టుల ద్వారా ప్రయోజనం పొందాల్సిన రైతులకు నీరు అందకుండా జాప్యం జరగడం వల్ల వ్యవసాయ రంగం తీవ్రంగా ప్రభావితమవుతుందని అన్నారు. అందువల్ల ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన కార్యాచరణ ప్రకటించి, పనులను వేగవంతం చేయాలని కోరారు. పాలమూరు ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, యువత ఉపాధి కోసం వలస వెళ్లాల్సిన పరిస్థితులు తగ్గేలా స్థానికంగా వ్యవసాయ, ఉపాధి అవకాశాలను పెంపొందించాలని సూచించారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం బాధ్యతాయుతంగా స్పందించాలని కోరారు. పాలమూరు ప్రాంతానికి న్యాయం జరిగే వరకు నీటి హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటాన్ని కొనసాగిస్తామని చీమర్ల అర్జున్ రెడ్డి స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలను కాపాడటం, సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడం, పాలమూరును సస్యశ్యామలం చేయడం లక్ష్యంగా ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమిస్తామని తెలిపారు. “పాలమూరు రైతుల ఆశయమే మా ఉద్యమం.. సాగునీటి హక్కుల పరిరక్షణే మా లక్ష్యం.. కరువు, వలసల నుంచి పాలమూరుకు విముక్తి కలిగే వరకు మా గళం ఆగదు. మా ప్రాంతానికి న్యాయం జరిగి, మా రైతుల పొలాలు పచ్చబడినప్పుడే పాలమూరు అభివృద్ధికి నిజమైన అర్థం చేకూరుతుంది” అని చీమర్ల అర్జున్ రెడ్డి పేర్కొన్నారు.

# కరువు, ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ

- ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు
- కరవు ప్రభావిత మండలాల గుర్తింపు నుంచి నీటి సంరక్షణ వరకు పటిష్ట చర్యలు
- తాగునీరు, సాగునీటి సంరక్షణకు ప్రత్యేక ప్రణాళికలు..
- ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలి.. ప్రజలను చైతన్యపరచాలి
- రైతులకు అండగా ప్రత్యామ్నాయ పంటలు, గ్రామీణ ఉపాధిపై ప్రత్యేక దృష్టి: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ అక్టోబర్ 23:** ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే కరువును ముందుగానే అంచనా వేసి తాగునీరు, సాగునీటి లభ్యతను కాపాడటంతో పాటు విద్యుత్ సరఫరా, వ్యవసాయం, గ్రామీణ ఉపాధి వంటి కీలక రంగాలకు రానున్న రోజుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శాఖల వారీగా సమగ్రంగా కార్యచరణ ప్రణాళికలు రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ తీర్మానించింది. నియమిత గడువు అక్టోబర్ 31 తేదీ లోగా రాష్ట్రంలోని కరువు మండలాలను ప్రకటించడంతో పాటు, ఎల్ నినో, కరువు పరిస్థితులను చర్చించడానికి అఖిల పక్ష సమావేశం త్వరలో ఏర్పాటు చేయాలని కమిటీ తీర్మానించింది. రాష్ట్రంలో నెలకొన్న కరువు, ఎల్-నినో పరిస్థితులను అధిగమించేందుకు, తగిన చర్యలను సమీక్షించి ప్రభుత్వానికి సిఫార్సులు చేసేందుకు సచివాలయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, సబ్-కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ తొలి సమావేశం శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఎల్ నినో , కరువు ప్రభావం, నీటి లభ్యత, రైతులకు అందించాల్సిన ఉపశమనం, భవిష్యత్తు కార్యాచరణపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ సమావేశానికి సబ్-కమిటీ సభ్యులు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి, సిఎస్

సంజయ్ జాజుతో పాటు సంబంధిత శాఖల కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, కరవు ప్రభావిత మండలాలను శాస్త్రీయంగా గుర్తించి, నిబంధనల ప్రకారం అర్హత కలిగిన మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. కరువు ప్రభావాన్ని తగ్గించి, ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు సమయానికి అందించడమే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కరువు పరిస్థితులను శాస్త్రీయంగా విశ్లేషించి, అర్హత కలిగిన మండలాలను గుర్తించాలని సూచించారు. ఇప్పటికే కరువు తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతాలతో పాటు, 20 శాతానికి మించి కరువు ప్రభావం ఉన్న మండలాల పరిస్థితులను కూడా పరిశీలించాలని తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా అర్హత కలిగిన మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించే అంశంపై సిఫార్సులు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. కరువు ప్రభావం వివిధ రంగాలపై ఎలా ఉండబోతోందో ముందుగానే అంచనా వేస్తే, ప్రజలకు అవసరమైన సహాయాన్ని సకాలంలో అందించేందుకు వీలవుతుందని చెప్పారు. అందుకే ప్రతి శాఖ తన పరిధిలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. తాగునీరు, సాగునీటి అవసరాలకు ప్రాధాన్యమిస్తూ అందుబాటులో ఉన్న నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్ రంగంలో ఎదురయ్యే సవాళ్లను ముందుగానే గుర్తించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు శాఖ సిద్ధంగా ఉండాలని చెప్పారు. ప్రజలకు అవసరమైన సేవలు నిరంతరాయంగా అందించేందుకు అన్ని శాఖలు తమ అవసరాలను ముందుగానే అంచనా వేయాలని, అత్యవసర ఖర్చుల కోసం ఆర్థిక శాఖ తగిన విధంగా సహకరించేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ రంగంపై కరువు ప్రభావాన్ని తగ్గించేందుకు రానున్న పంటల సీజన్‌కు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా రైతులకు ముందస్తు సమాచారం అందించాలని అన్నారు. కరువు, ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. సమస్యలు తీవ్రరూపం దాల్చిన తర్వాత స్పందించడం కంటే, ముందుగానే వాటిని గుర్తించి నివారణ చర్యలు చేపట్టడం ముఖ్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, జిల్లాల్లో ప్రతి వారం సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి చేపట్టిన చర్యలు, కరువు నివారణ చర్యలపై జిల్లా కలెక్టర్లు తగు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రస్తుత నీటి ఎద్దటి నేపథ్యంలో వరి వేయవద్దని, దీనికి ఇప్పటి నుండే చర్యలు చేపట్టాలని సూచించారు. నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా రైతులకు ముందస్తు సమాచారం అందించాలని వ్యవసాయ, నీటిపారుదల శాఖలను ఆదేశించారు. గ్రామస్థాయిలో రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, సాగు ప్రణాళికలు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన ప్రభుత్వ పథకాలను సమర్థంగా వినియోగించుకొని, కరువు పరిస్థితుల్లోనూ రైతులకు అండగా నిలిచే విధంగా కార్యాచరణ

రూపొందించాలని సూచించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, వాస్తవ పరిస్థితులపై రైతులు, సాధారణ ప్రజానీకాన్ని చైతన్య పర్చాలని అన్నారు. మండలాల్లో భూ గర్భ జలాల మట్టం, వేసవి తీవ్రత తదితర అంశాలపై గణాంకాలను ప్రతీ వారం నివేదికలను జిల్లాల్లో విడుదల చేయాలని సూచించారు. రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా, మండల, గ్రామ స్థాయి వరకు ప్రజలకు అవసరమైన సమాచారం చేరేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ నిర్ణయాలు, నీటి సంరక్షణ చర్యలు, వ్యవసాయ సలహాలు, అందుబాటులో ఉండే సహాయ కార్యక్రమాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సహకారం తీసుకోవాలని తెలిపారు. రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ, ప్రస్తుత ఎల్-నినో పరిస్థితుల నేపథ్యంలో ప్రతీ జిల్లా కలెక్టర్లు, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ల కు అత్యవసర ప్రత్యేక నిధులు కేటాయించాలని అన్నారు. ప్రస్తుత ఎల్-నినో, కరువు పరిస్థితులతో రాష్ట్రంలో దాదాపు రూ. 7,000 కోట్లతో కరువు పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు తాగునీరు, రైతులకు అవసరమైన సహాయం, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉండేలా కార్యాచరణను సిద్ధం చేసి, దాని అమలుపై నిరంతరం దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, జిల్లాల్లో రోజు రోజుకు చెరువుల్లో నీరు గణనీయంగా తగ్గిపోతుందని తద్వారా చేపల మనుగడకు కష్టంగా మారిందని అన్నారు. ఈ పరిస్థితుల్లో పెద్ద రిజర్వాయర్లలో చేపలను వదిలేందుకు ప్రాధాన్యత నిస్తున్నామన్నారు. పశువులకు తాగునీటి తొట్టెలను ప్రతీ గ్రామంలో ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, ఇప్పటికే ప్రతీ జిల్లా కలెక్టర్ కు అత్యవసర నిధుల కింద ఒక కోటి రూపాయలను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. వర్షాపాతం తక్కువగా నమోదు, పంట విస్తీర్ణం 50 శాతం కంటే తక్కువగా ఉండడం తదితర ప్రమాణాలను పరిగణనలో తీసుకొని 358 మండలాలలో కరువు పరిస్థితులు ఉన్నట్టు ప్రాథమికంగా నిర్ధారించమని తెలిపారు. నియమిత గడువైన, ఈనెల 31 తేదీ లోగా కేంద్ర ప్రభుత్వానికి కరువు మండలాల జాబితా ను సమర్పిస్తామని తెలిపారు. మొత్తం 33 జిల్లాలకు గాను 18 జిల్లాల్లో కనిష్ట వర్షపాతం నమోదుకాగా, 15 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదయిందని తెలిపారు. 324 మండలాల్లో భూగర్భ జలాల మట్టం ఆందోళనకర స్థాయిలో ఉందని వివరించారు. రాష్ట్రం లోని రిజర్వాయర్లలో మొత్తం 470 టీ.ఎం.సిలకు గాను ప్రస్తుతం 170 టి.ఎం.సిల జలాలు మాత్రమే ఉన్నాయన్నారు. సింగూరు జలాశయాన్ని తానూ స్వయంగా పరిశీలించామని, ఈ జలాశయంలో నీటి లేమితో ఏర్పడ్డ పరిస్థితులను అధిగమించడానికి ప్రత్యామ్నాయ ప్రణాళికలను రూపొందించామన్నారు.

## రూ.19 కోట్లతో రామంతాపూర్ పెద్ద చెరువుకు మహర్దశ

- శరవేగంగా సాగుతున్న సుందరీకరణ పనులు.. క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**ఉప్పల్,అక్టోబర్23(భవిష్యత్ ప్రజాపాలన) :** ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధిలో మరో కీలక ముందడుగు పడుతోంది. రామంతాపూర్ పెద్ద చెరువు రూపురేఖలు మార్చే లక్ష్యంతో హైడ్రా చేపట్టిన సుందరీకరణ, అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. సుమారు 18.23 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ. 19 కోట్ల నిధులు కేటాయించడం హర్షణీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. చెరువులో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల తీరును సమీక్షించారు. చెరువు పరిరక్షణతో పాటు

పరిసర ప్రాంతాల అభివృద్ధికి చేపడుతున్న చర్యలను పరిశీలిస్తూ, పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా సాగాలని సూచించారు.

**చెరువుల పరిరక్షణ.. పర్యావరణానికి రక్షణ**

చెరువులు నగరానికి జీవనాధారమని, వాటి పరిరక్షణ భవిష్యత్ తరాలకు ఎంతో అవసరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రామంతాపూర్ పెద్ద చెరువు అభివృద్ధి పూర్తయితే పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వాతావరణం అందుబాటులోకి రావడంతో పాటు, చెరువు పరిరక్షణకు మరింత ప్రాధాన్యత లభిస్తుందని తెలిపారు.

**అభివృద్ధి పనుల్లో నాణ్యతే ప్రథమ ప్రాధాన్యత**

ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడేలా అభివృద్ధి పనులు చేపట్టాలని, పనుల్లో ఎలాంటి నాణ్యతా లోపాలు తలెత్తకుండా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా చెరువు అభివృద్ధి పనులు ముందుకు సాగాలని స్పష్టం చేశారు. ఉప్పల్ నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల మెరుగుదలతో పాటు చెరువుల పరిరక్షణ, పర్యావరణ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. రామంతాపూర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులు పూర్తయితే ఈ ప్రాంత అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రూ. 19 కోట్ల నిధులతో రామంతాపూర్ పెద్ద చెరువు అభివృద్ధి దిశగా అడుగులు పడుతుండటంతో స్థానిక ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈ కార్యక్రమములో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అంగడిపేట ప్రీమియర్ లీగ్ సందడి

### విజేత జట్టుకు రూ.40,000 బహుమతి అందజేసిన BRS నాయకులు వడ్త్యా రమేష్

- క్రీడలకు ప్రోత్సాహం అందిస్తున్న BRS - అంగడిపేటలో విజేతలకు బహుమతుల పంపిణీ

**పీఏ పల్లి భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వడ్త్య :** దేవరకొండ నియోజకవర్గం, పీఏ పల్లి మండలంలోని అంగడిపేట గ్రామంలో మండల స్థాయిలో ఏర్పాటు చేసిన అంగడిపేట ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్టుకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన BRS దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్యా రమేష్ గారు విజేత జట్టుకు ప్రథమ బహుమతిగా రూ. 40,000 నగదు మరియు షీల్డ్ ను అందజేశారు. మండల స్థాయి BRS పార్టీ నాయకుల చేతుల మీదుగా ఈ బహుమతులను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వడ్త్యా రమేష్ మాట్లాడుతూ యువత క్రీడల వైపు మొగ్గు చూపాలని, గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం వల్ల యువతలో ఐక్యత, క్రీడా స్ఫూర్తి పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అజ్మాపురం మాజీ సర్పంచ్ రామకృష్ణ, ఘనపురం శంకర్, వార్డు సభ్యులు సైదులు, నోముల యాదగిరి, జాగ్రూ బావోజీ, వార్డు సభ్యులు బీమా నాయక్, కొండలు, శివ, ఆర్గనైజేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లపై అధికారుల పరిశీలన

- అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

**భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి । రంగయ్య గారి శ్రీనివాస్ । అక్టోబర్ 23 । చేవెళ్ల నియోజకవర్గం :** అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి సంబంధించి అక్టోబర్ 26న నిర్వహించనున్న పరీక్షల నేపథ్యంలో చేవెళ్ల ఆర్డీఓ పార్థ సింహారెడ్డి, మొయినాబాద్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ వై. మల్లికార్జున్ రెడ్డి, ఎస్ఐ సత్యనారాయణ మొయినాబాద్ పరిధిలోని పలు పరీక్షా కేంద్రాలను సందర్శించి తనిఖీ చేశారు. కేజీ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల, వీజేఐటీ ఇంజనీరింగ్ కళాశాల, చైతన్య డీమ్డ్ టు బి యూనివర్సిటీ, జేబీఐటీ ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్షల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, సజావుగా జరిగేలా తీసుకుంటున్న చర్యలను సమీక్షించి, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లపై దృష్టి సారించారు. అక్టోబర్ 26న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.

## తెలివైన కుందేలు - మూర్ఖపు సింహం

**కథ:** అనగనగా ఒక పెద్ద అడవిలో భాసురకము అనే ఒక బలమైన సింహం నివసిస్తూ ఉండేది. ఆ సింహం క్రూరత్వంతో అడవిలోని జంతువులను విచ్చలవిడిగా చంపేసేది. దాంతో భయపడిపోయిన జంతువులన్నీ ఒకరోజు సింహం దగ్గరకు వచ్చి, "మహారాజా! మీరు ఇలా అందరినీ చంపేస్తే అడవి ఖాళీ అయిపోతుంది. కాబట్టి మేమే రోజూ ఒక జంతువును మీ ఆహారం కోసం పంపుతాము" అని వేడుకున్నాయి. సింహం అందుకు ఒప్పుకుంది. ఒకరోజు ఒక చిన్న కుందేలు వంతు వచ్చింది. ఆ కుందేలు చాలా తెలివైంది. అది ఎలాగైనా సింహం బారి నుండి అడవిని, తన ప్రాణాన్ని కాపాడుకోవాలని ఒక ఉపాయం ఆలోచించింది. అందుకే సింహం దగ్గరకు చాలా ఆలస్యంగా వెళ్ళింది. ఆకలితో



నకనకలాడుతున్న సింహం కోపంతో, "ఎందుకు ఇంత ఆలస్యం అయింది? నిన్ను, నిన్ను పంపిన జంతువులన్నింటినీ ఇప్పుడే చంపేస్తాను" అని గర్జించింది. అప్పుడు కుందేలు వణుకుతున్నట్లు నటిస్తూ, "మహారాజా! నా తప్పు లేదు. నేను వస్తుండగా దారిలో మరొక పెద్ద సింహం నన్ను ఆపి, తనే ఈ అడవికి రాజునని చెప్పింది. నేను చాలా కష్టపడి దాని నుండి తప్పించుకుని మీ దగ్గరకు వచ్చాను" అని అబద్ధం చెప్పింది. ఆ మాట వినగానే సింహానికి అహంకారం, కోపం ఎక్కువయ్యాయి. "ఈ అడవికి రాజును నేనే! ఆ ఇంకొక సింహం ఎక్కడుందో నాకు ఇప్పుడే చూపించు, దాన్ని చంపేస్తాను" అని గర్జించింది. కుందేలు సింహాన్ని ఒక పాత లోతైన బావి దగ్గరకు తీసుకువెళ్లి, "మహారాజా! ఆ సింహం ఈ కోటలోనే దాక్కుంది, లోపలికి చూడండి" అంది.

Edited,Printed,Published and Owend by CHITLA DIVYA ,Printed at POTHUGANTI RACHANA , G2, TSRINIVAS, ROAD NO : 4 , RANGAREDDY , Hyderabad- 500035 . Published at H.NO : 177/P , PLOT NO : 402 ANJAMMA RESIDENCY , MANIKONDA , Hyderabad - 500089, Telangana. Editor : CHITLA VIJAYKUMAR REDDY , RNI : TGTEL/26/A0153 e-mail : bhavishyatprajapalana@gmail.com , Cell : 81061 86888

# రంగారెడ్డి జిల్లాకు ఈఎస్ఐ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి మంజూరు చేయాలి

- **లక్షలాది మంది కార్మికుల ఆరోగ్యానికి భరోసా కల్పించాలి**
- **ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పానుగంటి పర్వతాలు డిమాండ్**
- **ఈఎస్ఐ డైరెక్టర్ ప్రియరంజన్ సిన్హాకు వినతిపత్రం అందజేత**

**మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన,రంగారెడ్డి జిల్లా :** రంగారెడ్డి జిల్లాలో పారిశ్రామిక, ఐటీ, నిర్మాణ రంగాలు వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో లక్షలాది మంది కార్మికులు, ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు అత్యాధునిక వైద్య సదుపాయాలతో కూడిన ఈఎస్ఐ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని మంజూరు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పానుగంటి పర్వతాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల శ్రమతో పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందుతున్నప్పటికీ, వారికి అవసరమైన నాణ్యమైన వైద్య సేవలు సమీపంలో అందుబాటులో లేకపోవడం విచారకరమని అన్నారు. కార్మికుల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. ఈ మేరకు ఏఐటీయూసీ ప్రతినిధి బృందం ఈఎస్ఐ డైరెక్టర్ ప్రియరంజన్ సిన్హాను కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ ప్రతినిధి బృందంలో ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బి. దత్తు నాయక్, జిల్లా అధ్యక్షుడు వడ్ల సత్యనారాయణ, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు పద్ధతి లక్ష్మణ్, జిల్లా సహాయ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు. జిల్లాలో కార్మికులకు ఎదురవుతున్న వైద్య సమస్యలను వివరించి, సమగ్ర వైద్య సదుపాయాలతో కూడిన ఆసుపత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**పారిశ్రామికంగా అభివృద్ధి.. వైద్య సదుపాయాల్లోనూ ముందుండాలి**

ఈ సందర్భంగా పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ షాద్‌నగర్ నుంచి కాటేదాన్ వరకు, మహేశ్వరం నుంచి చేవెళ్ల వరకు విస్తరించి ఉన్న పారిశ్రామిక ప్రాంతాల్లో వేలాది పరిశ్రమలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆయా పరిశ్రమల్లో లక్షలాది మంది కార్మికులు పనిచేస్తున్నారని, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విధులు నిర్వహించే ఉద్యోగులు, ఫ్యూచర్ సిటీ నిర్మాణ పనుల్లో పాల్గొంటున్న కార్మికులు సహా అనేక రంగాలకు చెందిన వారు ఈ ప్రాంతంపై ఆధారపడి జీవిస్తున్నారని వివరించారు. ఇంతటి విస్తృతమైన పారిశ్రామిక, ఉపాధి కేంద్రంగా

రంగారెడ్డి జిల్లా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, కార్మికుల అవసరాలకు అనుగుణంగా ఈఎస్ఐ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అందుబాటులో లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనారోగ్యానికి గురైన కార్మికులు వైద్యం కోసం సనత్‌నగర్ లేదా నాచారం ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. ప్రయాణానికే ఎక్కువ సమయం వెచ్చించాల్సి రావడంతో పాటు పనికి దూరమై వేతనం కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. కార్మికులకు అత్యవసర వైద్యం అవసరమైనప్పుడు సమీపంలోనే మెరుగైన వైద్య సదుపాయాలు ఉండటం ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రత్యేక వైద్య సేవలు, ఆధునిక పరీక్షలు, అవసరమైన చికిత్సలు అందించే స్థాయిలో ఆసుపత్రిని ఏర్పాటు చేస్తే కార్మికులతో పాటు వారి కుటుంబాలకు కూడా ఎంతో ప్రయోజనం చేకూరుతుందని వివరించారు.

**"కార్మికుడి ఆరోగ్యం కుటుంబానికి భరోసా.. సమాజ అభివృద్ధికి పునాది"**

కార్మికుల ఆరోగ్యమే పారిశ్రామిక అభివృద్ధికి పునాది అని పానుగంటి పర్వతాలు పేర్కొన్నారు. పరిశ్రమల ఉత్పత్తి పెరగడంలో, సంస్థల పురోగతిలో కార్మికుల శ్రమ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. అలాంటి కార్మికులకు నాణ్యమైన వైద్యం అందించడం కేవలం సదుపాయం మాత్రమే కాదని, వారి కుటుంబాల భద్రతకు సంబంధించిన ముఖ్యమైన బాధ్యత అని అన్నారు. "కార్మికుడి చెమట చుక్కతో పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయి.. అతని ఆరోగ్యం బాగుంటేనే కుటుంబం సంతోషంగా ఉంటుంది. పని చేసే ప్రాంతానికి సమీపంలోనే నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తీసుకురావడం కార్మికుల హక్కుల పరిరక్షణలో కీలకమైన అడుగు" అని పానుగంటి పర్వతాలు పేర్కొన్నారు. భాగ్యనగరానికి సమీపంలో ఉన్న రంగారెడ్డి జిల్లా రోజురోజుకూ పారిశ్రామికంగా, ఆర్థికంగా విస్తరిస్తోందని, ఈ అభివృద్ధికి అనుగుణంగా వైద్య మౌలిక సదుపాయాలను కూడా పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు. జిల్లాలో పనిచేస్తున్న కార్మికులు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి మారాలని, స్థానికంగా అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి రావాలని కోరారు.

**ఆసుపత్రి సాధించే వరకు కార్మికుల పక్షాన పోరాటం**

రంగారెడ్డి జిల్లాకు ఈఎస్ఐ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి మంజూరయ్యే వరకు ఏఐటీయూసీ కార్మికుల తరఫున పోరాటం కొనసాగిస్తుందని పానుగంటి పర్వతాలు స్పష్టం చేశారు. ఈ సమస్యను ఒక సంఘానికి మాత్రమే పరిమితం చేయకుండా, అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని ఉమ్మడి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. కార్మికుల దీర్ఘకాలిక అవసరాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ఆసుపత్రి ఏర్పాటు కోసం ప్రజా ఉద్యమాన్ని మరింత విస్తరిస్తామని పేర్కొన్నారు. కార్మికులు అనారోగ్యానికి గురైనప్పుడు సరైన సమయంలో వైద్యం అందక ఇబ్బందులు పడకూడదని, వారి వైద్య అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. సంబంధిత అధికారులు జిల్లాలోని పారిశ్రామిక ప్రాంతాల అవసరాలను సమగ్రంగా పరిశీలించి, ఆసుపత్రి మంజూరుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు.

**పలుమార్లు విన్నవించినా పరిష్కారం లభించలేదు**

ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బి. దత్తు నాయక్ మాట్లాడుతూ జిల్లాలో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని గతంలో పలుమార్లు జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులను కలిసి విజ్ఞప్తులు చేసినట్లు తెలిపారు. అయినప్పటికీ సమస్యకు పరిష్కారం లభించకపోవడం బాధాకరమని అన్నారు. కార్మికుల సంఖ్య, పరిశ్రమల విస్తరణ, వైద్య అవసరాలను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్మికుల శ్రమతో ఉత్పత్తి పెరుగుతోందని, పరిశ్రమలు, వివిధ సంస్థల ద్వారా ప్రభుత్వాలకు గణనీయమైన ఆదాయం సమకూరుతోందని దత్తు నాయక్ పేర్కొన్నారు. అలాంటి కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన ఆసుపత్రి మంజూరులో జాప్యం జరగడం సరికాదని అభిప్రాయపడ్డారు. వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి కారణంగా కార్మికులు ఎదుర్కొంటున్న ఆర్థిక, సమయపరమైన ఇబ్బందులను అధికారులు గుర్తించాలని అన్నారు. రంగారెడ్డి జిల్లాలోనే సమగ్ర వైద్య సదుపాయాలతో కూడిన ఈఎస్ఐ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేయడం ద్వారా కార్మికులకు సకాలంలో చికిత్స అందుతుందని, వారి కుటుంబాలకు వైద్య భరోసా కలుగుతుందని తెలిపారు. ఆసుపత్రి మంజూరుపై ప్రభుత్వం, సంబంధిత అధికారులు సానుకూల నిర్ణయం తీసుకోకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

**కార్మికుల వైద్య హక్కుల కోసం ఐక్య పోరాటం**

రంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికులు, ఉద్యోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం అత్యవసరమని ఏఐటీయూసీ నాయకులు పేర్కొన్నారు. కార్మికుల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని ఈఎస్ఐ ఆసుపత్రి మంజూరుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకొని సంబంధిత అధికారులు త్వరితగతిన చర్యలు చేపడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈఎస్ఐ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు కోసం కార్మిక సంఘాలన్నింటినీ సమన్వయం చేసుకుంటూ, కార్మికులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు.

# శంషాబాద్ విమానాశ్రయంలో బీజేపీ జాతీయ నేతలకు ఘన స్వాగతం

- **భారీ పూలమాలలు, శాలువాలతో ఆత్మీయ సత్కారం.. కోలన్ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో తరలివచ్చిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు**
- **నాయకులు-కార్యకర్తల సమన్వయమే పార్టీ బలం.. సంస్థాగత ఐక్యతతో ప్రజలకు మరింత చేరువ కావాలన్న నేతలు**

**మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన,రంగారెడ్డి జిల్లా :** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో శుక్రవారం మధ్యాహ్నం బీజేపీ జాతీయ నాయకులకు ఘన స్వాగతం లభించింది. బీజేపీ వివిధ విభాగాల జాతీయ కన్వీనర్, మాజీ ఎంపీ వీడీ శర్మ, బీజేపీ జాతీయ సెల్ జాయింట్ కన్వీనర్ విష్ణు వర్ధన్ రెడ్డికి బీజేపీ తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ సెల్ కన్వీనర్ కోలన్ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా ఆహ్వానం పలికారు. భారీ పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి తమ అభిమానాన్ని, గౌరవాన్ని చాటుకున్నారు. జాతీయ స్థాయిలో పార్టీ బాధ్యతలు నిర్వహిస్తున్న నాయకులకు స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో విమానాశ్రయానికి చేరుకోవడంతో అక్కడ సందడి నెలకొంది. జాతీయ నాయకులు విమానాశ్రయానికి చేరుకున్న సందర్భంగా కోలన్ శంకర్ రెడ్డి తన బృందంతో కలిసి వారికి ఆత్మీయ స్వాగతం పలికారు. పూలమాలలు, శాలువాలతో సత్కరిస్తూ అభినందనలు తెలియజేశారు. పార్టీ నాయకత్వం పట్ల తమకున్న గౌరవాన్ని, సంస్థాగత కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలనే ఆసక్తిని ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు వ్యక్తం చేశారు. జాతీయ స్థాయి నాయకులు రాష్ట్రానికి వచ్చిన సందర్భంలో వారిని కలుసుకోవడం, స్వాగతం పలకడం సంతోషంగా ఉందని పార్టీ శ్రేణులు పేర్కొన్నారు. విమానాశ్రయ ప్రాంగణంలో నాయకులు, కార్యకర్తలు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ ఉత్సాహంగా పాల్గొన్నారు. స్వాగత కార్యక్రమం సందర్భంగా పార్టీ వ్యవహారాలు, క్షేత్రస్థాయి కార్యకలాపాలు, నాయకులు--కార్యకర్తల మధ్య సమన్వయం వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగాల్సిన అవసరాన్ని పలువురు గుర్తుచేశారు. పార్టీ కార్యక్రమాలు విజయవంతం కావాలంటే అగ్ర నాయకత్వం నుంచి క్షేత్రస్థాయి కార్యకర్తల వరకు అందరూ సమష్టిగా పనిచేయడం ముఖ్యమని అభిప్రాయపడ్డారు.

**కోలన్ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ ఆహ్వానం**

బీజేపీ తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ సెల్ కన్వీనర్ కోలన్ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ స్వాగత కార్యక్రమంలో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నాయి. జాతీయ నాయకులకు పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించడం ద్వారా తమ అభిమానాన్ని తెలియజేశాయి. నాయకులను గౌరవించడం, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం, సంస్థాగత సంబంధాలను బలోపేతం చేసుకోవడం రాజకీయ పార్టీల కార్యకలాపాల్లో ముఖ్యమైన అంశాలని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. పార్టీకి సంబంధించిన వివిధ విభాగాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న నాయకులు పరస్పర సమన్వయంతో ముందుకు సాగితే కార్యక్రమాల నిర్వహణ మరింత సులభతరమవుతుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రస్థాయి నాయకత్వం, జాతీయ నాయకత్వం, క్షేత్రస్థాయి కార్యకర్తల మధ్య నిరంతర సంబంధాలు కొనసాగడం ద్వారా పార్టీ కార్యక్రమాల గురించి ప్రజలకు మరింత విస్తృతంగా తెలియజేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, ప్రతి నాయకుడి బాధ్యతకు తగిన గౌరవం లభించినప్పుడు సంస్థాగతంగా పరస్పర విశ్వాసం పెరుగుతుందని తెలిపారు.

**ఐక్యతే పార్టీ బలం.. కార్యకర్తలే సంస్థాగత పునాది**

రాజకీయాల్లో నాయకత్వం కీలకమైనదే అయినప్పటికీ, క్షేత్రస్థాయిలో ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగించే కార్యకర్తల పాత్ర కూడా ముఖ్యమైనది. పార్టీ విధానాలు, కార్యక్రమాలు, లక్ష్యాలను ప్రజలకు వివరించడంలో కార్యకర్తలు వారధులుగా పనిచేస్తారు. నాయకులు, కార్యకర్తలు పరస్పర సహకారంతో ముందుకు సాగినప్పుడే సంస్థాగత కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని ఈ సందర్భంగా పార్టీ నాయకులు అభిప్రాయపడ్డారు. పార్టీ బలోపేతం అనేది ఒక్కరోజులో సాధ్యమయ్యే ప్రక్రియ కాదని,

నిరంతర కృషి, క్రమశిక్షణ, సమన్వయం, ప్రజలతో సత్సంబంధాల ద్వారా అది సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకోవడం, వారి అభిప్రాయాలను వినడం, ప్రజా సమస్యలపై బాధ్యతాయుతంగా స్పందించడం ద్వారా రాజకీయ నాయకులు ప్రజలతో సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవచ్చని తెలిపారు. పార్టీ కార్యక్రమాలు కేవలం సమావేశాలు, స్వాగతాలకే పరిమితం కాకుండా ప్రజల అవసరాలు, అభిప్రాయాలు, స్థానిక సమస్యలపై దృష్టి సారించినప్పుడే వాటికి మరింత ప్రాధాన్యత ఏర్పడుతుందని అభిప్రాయపడ్డారు. "నాయకత్వానికి గౌరవం కార్యకర్తల విశ్వాసంతో పెరుగుతుంది.. కార్యకర్తలకు బలం నాయకుల అండతో లభిస్తుంది. పరస్పర గౌరవం, సమన్వయం, క్రమశిక్షణతో కూడిన ఐక్యత ఏ సంస్థకైనా పునాది. ప్రజలతో మమేకమై, వారి సమస్యలను అర్థం చేసుకుంటూ సమష్టిగా పనిచేసినప్పుడే సంస్థాగత లక్ష్యాల సాధనకు మార్గం సుగమమవుతుంది." ఈ సందేశం నాయకులు, కార్యకర్తల మధ్య ఉన్న పరస్పర సంబంధాల ప్రాధాన్యతను తెలియజేస్తోంది. పార్టీ కార్యక్రమాల నిర్వహణలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యానికి ప్రాధాన్యతనిస్తూ, సమన్వయంతో ముందుకు సాగడం అవసరమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.

**జాతీయ నాయకులకు ఘన స్వాగతం.. ఉత్సాహంగా పాల్గొన్న పార్టీ శ్రేణులు**

శంషాబాద్ విమానాశ్రయంలో నిర్వహించిన స్వాగత కార్యక్రమంలో బీజేపీ నాయకులు సీహెచ్ కృష్ణ రెడ్డి, బి. ప్రతాప్, గంగాపురం వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, ప్రశాంత్, విష్ణు వర్ధన్ రెడ్డి, సత్యనారాయణ, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై జాతీయ నాయకులకు పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కోలన్ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. పార్టీ నాయకత్వంపై తమకున్న గౌరవాన్ని వ్యక్తం చేస్తూ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. జాతీయ నాయకుల రాక సందర్భంగా ఏర్పడిన ఈ సమావేశం పార్టీ శ్రేణుల మధ్య పరస్పర పరిచయాలు, ఆత్మీయ పలకరింపులకు వేదికగా నిలిచింది. వివిధ బాధ్యతలు నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు కలిసి పాల్గొనడం ద్వారా సంస్థాగత సంబంధాలను కొనసాగించాలనే ఆకాంక్ష వ్యక్తమైంది.

**ప్రజలతో అనుబంధమే రాజకీయ కార్యకలాపాలకు కీలకం**

రాజకీయ పార్టీల కార్యకలాపాల్లో ప్రజలతో నిరంతర సంబంధాలు, స్థానిక సమస్యలపై అవగాహన, బాధ్యతాయుతమైన స్పందన ఎంతో ముఖ్యమైనవి. ప్రజల అవసరాలను తెలుసుకుంటూ, వారి అభిప్రాయాలకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజాస్వామ్య పద్ధతుల్లో తమ కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా రాజకీయ సంస్థలు సమాజంతో అనుబంధాన్ని కొనసాగించగలవు. ఈ నేపథ్యంలో నాయకులు, కార్యకర్తల సమన్వయంతో పాటు ప్రజా సమస్యలపై నిరంతర దృష్టి అవసరమని పలువురు అభిప్రాయపడ్డారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో బీజేపీ జాతీయ నాయకులకు స్వాగతం పలికిన కార్యక్రమం పార్టీ శ్రేణుల ఉత్సాహాన్ని, నాయకుల పట్ల వారికున్న అభిమానాన్ని చాటిచెప్పింది. కోలన్ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆత్మీయ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు కలసి పాల్గొని జాతీయ నాయకులకు ఘన స్వాగతం పలికారు. భవిష్యత్తులోనూ పరస్పర సమన్వయంతో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ, ప్రజలతో సంబంధాలను కొనసాగించాలని పార్టీ శ్రేణులు ఆకాంక్షించాయి.

# పానగల్ ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధికి రూ.20 కోట్లు మంజూరు

- **ముఖ్యమంత్రి,మంత్రి జూపల్లికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**
- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ఆలయ యునెస్కో గుర్తింపు దిశగా కృషి చేస్తా: మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి..**
- **శివలింగంపై నిరంతర ఛాయ కనిపించేలా నిర్మించిన సోమేశ్వరాలయం తెలంగాణ శిల్పకళా వైభవానికి నిదర్శనం**
- **నిధులు మంజూరు కావటంతో భక్తులు, స్థానిక ప్రజలు హర్షం**

**మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ స్టాఫ్**

**రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ అక్టోబర్ 23:** పానగల్‌లోని చారిత్రక ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేయడం పట్ల రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచిన ఛాయా సోమేశ్వరాలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి తెలిపారు. ప్రపంచస్థాయిలో ఎక్కడ లేని విధంగా "వందల ఏళ్ల క్రితమే శిల్పులు కాంతి, నీడ, నిర్మాణ శాస్త్రాన్ని సమన్వయం చేసి శివలింగంపై నిరంతర ఛాయ కనిపించేలా నిర్మించిన ఛాయా సోమేశ్వరాలయం తెలంగాణ శిల్పకళా వైభవానికి, ప్రాచీన నిర్మాణ విజ్ఞానానికి అద్భుత నిదర్శనమన్నారు. ఆలయానికి యునెస్కో గుర్తింపు తీసుకురావడానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధికి రూ.20 కోట్లు

మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో చారిత్రక వారసత్వాన్ని కాపాడటంతో పాటు మరింత పర్యాటక ప్రాధాన్యత తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. మంత్రి చొరవతో ఆలయ అభివృద్ధి నిధులు విడుదల కావటంలో భక్తులు,స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కోతి - మొసలి

**కథ:**

అనగనగా ఒక నది ఒడ్డున ఒక పెద్ద రేగు చెట్టు (నల్ల నేరేడు చెట్టు) ఉండేది. ఆ చెట్టుపై ఒక తెలివైన కోతి నివసిస్తూ ఉండేది. ఆ నదిలో ఒక మొసలి కూడా ఉండేది. రోజులు గడుస్తున్న కొద్దీ ఆ కోతి, మొసలి మంచి స్నేహితులయ్యారు. కోతి ప్రతిరోజూ చెట్టు నుండి తీపి నేరేడు పండ్లను కోసి మొసలికి ఇచ్చేది. మొసలి వాటిని తిని ఎంతో సంతోషించేది. ఒకరోజు మొసలి కొన్ని పండ్లను తన భార్య కోసం ఇంటికి తీసుకెళ్ళింది. ఆ పండ్లను తిన్న మొసలి భార్య, "ప్రతిరోజూ ఇంత తీపి పండ్లు తినే ఆ కోతి గుండె ఇంకెంత రుచిగా ఉంటుందో! నాకు ఆ కోతి గుండె కావాలి, ఎలాగైనా రేపు దాన్ని ఇంటికి తీసుకురండి" అని పట్టుబట్టింది. మొసలి మొదట నిరాకరించినా, భార్య ఒత్తిడి తట్టుకోలేక తన స్నేహితుడిని మోసం చేయడానికి ఒప్పుకుంది. మరుసటి రోజు మొసలి కోతి దగ్గరకు వచ్చి, "మిత్రమా! మా భార్య నీకు కృతజ్ఞతలు చెప్పడానికి నిన్ను మా ఇంటికి విందుకు రమ్మంది" అని పిలిచింది. కోతి సంతోషంగా ఒప్పుకుని, మొసలి వీపుపై కూర్చుంది. మొసలి నది మధ్యలోకి వెళ్ళిన తర్వాత కోతితో అసలు నిజం చెప్పింది–తన భార్య కోతి గుండెను తినాలనుకుంటోందని అంది. కోతి ఒక్క క్షణం భయపడినా, వెంటనే తెప్పరిల్లి ఒక ఉపాయం ఆలోచించింది.

## శిల్పి - కష్టాల విలువ

**కథ:**

ఒక ఊరిలో ఒక గొప్ప శిల్పి ఉండేవాడు. అతను రాళ్లను ఎంతో అందమైన విగ్రహాలుగా మార్చడంలో దిట్ట. ఒకరోజు అతను ఒక పెద్ద గుడి కోసం మంచి విగ్రహాన్ని తయారు చేయాలని, అడవికి వెళ్లి రెండు పెద్ద సమానమైన రాళ్లను వెతికి తెచ్చుకున్నాడు. మరుసటి రోజు శిల్పి తన ఉలి మరియు సుత్తిని తీసుకుని మొదటి రాయిని చెక్కడం ప్రారంభించాడు. అతను సుత్తితో రాయిపై గట్టిగా దెబ్బ కొట్టగానే, ఆ రాయి ఏడుస్తూ ఇలా అంది, "అయ్యో! నా వల్ల కావడం లేదు. ఈ దెబ్బలు నేను భరించలేకపోతున్నాను. దయచేసి నన్ను వదిలేయండి, నన్ను కొట్టకండి" అని బతిమిలాడింది. శిల్పి ఆ రాయిపై జాలిపడి దాన్ని పక్కన పెట్టేశాడు. ఆ తర్వాత శిల్పి రెండవ రాయిని తీసుకుని చెక్కడం మొదలుపెట్టాడు. సుత్తి దెబ్బలకు ఆ రాయికి కూడా చాలా నొప్పి కలిగింది, కానీ అది ఓపిక పట్టింది. "నేను అందమైన విగ్రహంగా మారాలంటే ఈ కష్టాన్ని భరించక తప్పదు" అని మనసులో అనుకుంటూ శిల్పి కొట్టిన ప్రతి దెబ్బను ఓర్చుకుంది. కొద్ది రోజుల్లోనే ఆ రాయి ఎంతో అందమైన దైవ విగ్రహంగా మారిపోయింది. కొన్ని రోజులకు గుడి ధర్మకర్తలు వచ్చి శిల్పి తయారు చేసిన అందమైన విగ్రహాన్ని చూసి మురిసిపోయారు. దాన్ని గుడిలో ప్రతిష్ఠించడానికి తీసుకెళ్తుండగా, వారికి పక్కన పడేసి ఉన్న మొదటి రాయి కనిపించింది. వారు శిల్పితో, "ఈ రాయిని కూడా మేము తీసుకెళ్తాము. గుడికి వచ్చే భక్తులు దీనిపై కొబ్బరికాయలు కొట్టడానికి ఉపయోగపడుతుంది" అని చెప్పారు. శిల్పి సరేనన్నాడు. గుడి తెరిచిన తర్వాత, రెండవ రాయితో చేసిన విగ్రహాన్ని గర్భగుడిలో పెట్టి, అందరూ దానికి పూలు వేసి, హారతులు ఇచ్చి భక్తితో పూజించడం మొదలుపెట్టారు. కానీ మొదటి రాయిని గుడి బయట పెట్టారు. అక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరూ దానిపై గట్టిగా కొబ్బరికాయలు కొడుతూ వెళ్ళసాగారు. ఒకరోజు రాత్రి మొదటి రాయి ఏడుస్తూ రెండవ రాయితో అంది, "నువ్వేమో గర్భగుడిలో ఎంతో గౌరవంగా పూజలు అందుకుంటున్నావు, నేనేమో రోజూ ఈ కొబ్బరికాయల దెబ్బలు తింటూ నరకం చూస్తున్నాను. నా రాత ఎందుకు ఇలా ఉంది?" అని అడిగింది. అప్పుడు రెండవ రాయి నవ్వి ఇలా అంది, "మిత్రమా! శిల్పి నిన్ను చెక్కేటప్పుడు నువ్వు ఆ తాత్కాలిక కష్టాన్ని, సుత్తి దెబ్బలను భరించడానికి నిరాకరించావు. నేను ఆ రోజు కష్టపడ్డాను కాబట్టే ఈరోజు పూజలు అందుకుంటున్నాను. నువ్వు ఆ రోజు కష్టాన్ని వద్దనుకున్నావు కాబట్టే ఈరోజు జీవితాంతం దెబ్బలు తింటున్నావు" అని చెప్పింది. మొదటి రాయి తన తప్పు తెలుసుకుని పశ్చాత్తాపపడింది.

**నీతి:**

**జీవితంలో విజయం సాధించాలంటే ప్రారంభంలో వచ్చే కష్టాలను, క్రమశిక్షణను ఓపికతో భరించాలి. శ్రమ పడకుండా సుఖపడాలని చూస్తే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవు.**

# అసంఘటిత కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డులు

- **హమాలీ, డొమెస్టిక్ వర్కర్స్ కోసం త్వరలో ఏర్పాటు**
- **కార్మికుల హక్కుల పరిరక్షణే ప్రజాస్వామ్యానికి బలం**
- **పరిశ్రమల అభివృద్ధి-కార్మికుల సంక్షేమం రెండూ ముఖ్యం**
- **శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి**

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ అక్టోబరు 23:** అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించడంతో పాటు వారి హక్కులను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని శక్తి, గనుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. హమాలీ, డొమెస్టిక్ వర్కర్స్ కోసం వేర్వేరుగా సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల సంక్షేమానికి చట్టపరమైన చర్యలు చేపట్టామని, ఇందుకు సంబంధించిన నిబంధనలను త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని లెమన్ ట్రీ హోటల్‌లో "సోషల్ డెమోక్రసీ, పొలిటికల్ లీడర్‌షిప్ అండ్ ట్రేడ్ యూనియన్స్: రీబిల్డింగ్ ది ఆర్కిటెక్చర్ ఆఫ్ సోషల్ డైలాగ్" అనే అంశంపై నిర్వహించిన సదస్సులో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం, కార్మికుల హక్కులను పరిరక్షించడం, భవిష్యత్తులో పని విధానాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా కార్మిక రంగాన్ని సిద్ధం చేయడం వంటి అంశాలపై ఈ సదస్సులో చర్చించారు. దేశంలోని సుమారు 93 శాతం మంది కార్మికులు అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారని మంత్రి తెలిపారు. సంఘటిత రంగ కార్మికులకు ట్రేడ్ యూనియన్ల ద్వారా తమ హక్కులు, డిమాండ్ల సాధన కోసం పోరాడే అవకాశం ఉందని, అసంఘటిత రంగ కార్మికులకు ఆ స్థాయిలో ప్రాతినిధ్యం, రక్షణ లేదని అన్నారు. ఈ రంగంలోని కార్మికుల సమస్యల పరిష్కారానికి మరిన్ని చర్చలు, విధానపరమైన చర్యలు అవసరమన్నారు. తన తండ్రి గడ్డం వెంకటస్వామి అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపేవారని గుర్తుచేశారు. ప్రైవేటు రంగ ఉద్యోగులకు పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టే సమయంలో పారిశ్రామిక వర్గాల నుంచి వ్యతిరేకత వచ్చినా, కార్మికుల ప్రయోజనాల కోసం ఆయన అండగా నిలిచారని తెలిపారు. గిగ్ వర్కర్ల హక్కుల పరిరక్షణకు రాహుల్ గాంధీ చేపట్టిన చొరవను మంత్రి ప్రస్తావించారు. రాహుల్ గాంధీ చొరవతోనే తెలంగాణలో గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం చట్టాన్ని తీసుకొచ్చామని, వారి ప్రయోజనాలను పరిరక్షించేందుకు బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంబంధిత నిబంధనలను త్వరలో ప్రకటిస్తామన్నారు. హమాలీ కార్మికులు, డొమెస్టిక్ వర్కర్స్ కోసం వేర్వేరు సంక్షేమ బోర్డుల ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల హక్కులు, సామాజిక భద్రత, న్యాయమైన వేతనాలు, పని ప్రదేశాల్లో భద్రత వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. తెలంగాణలో గత పదేళ్లుగా కనీస వేతనాలను ప్రకటించలేదని, తాను కార్మిక శాఖ బాధ్యతలు చేపట్టిన తర్వాత కనీస వేతనాలను ప్రకటించామని మంత్రి తెలిపారు. ఈ విషయంలో పరిశ్రమల ప్రతినిధులతో చర్చించి, కార్మికులకు న్యాయం జరిగేలా నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. కార్మికులకు తగిన వేతనాలు, గౌరవప్రదమైన జీవనం అందినప్పుడే ఉత్పాదకత పెరుగుతుందని, పరిశ్రమల్లో పారిశ్రామిక శాంతి నెలకొంటుందని వివరించారు. పరిశ్రమలు,

కార్మికులు పరస్పర సహకారంతో ముందుకు సాగినప్పుడే పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్మికుల భద్రతను విస్మరించరాదని మంత్రి అన్నారు. సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో 54 మంది కార్మికులు మరణించిన ఘటనను ప్రస్తావిస్తూ.. ఫ్యాక్టరీల తనిఖీల సందర్భంగా అధికారులు సూచించిన భద్రతా చర్యలను యాజమాన్యాలు తప్పనిసరిగా అమలు చేయాలని చెప్పారు. తనిఖీ నివేదికలను కంపెనీల బోర్డు సమావేశాల్లో చర్చించి, భద్రతా లోపాలను సరిదిద్దేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమల యాజమాన్యాలు తమ బాధ్యతలను గుర్తించి కార్మికుల ప్రాణాలను కాపాడేందుకు ప్రాధాన్యమివ్వాలని అన్నారు. తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్య సాధనకు నైపుణ్యాభివృద్ధి కీలకమని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నామని, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. రక్షణ, ఏరోస్పేస్ తదితర రంగాల్లో వస్తున్న కొత్త పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కలిగిన యువతను తయారు చేయడమే లక్ష్యమన్నారు. ఐటీఐ విద్యార్థులకు నెలకు రూ. 2,000 స్టైపెండ్ అందించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. విదేశాల్లో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా తెలంగాణ యువతకు జర్మన్ భాషలో శిక్షణ అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. జర్మనీలో నైపుణ్యం కలిగిన మానవ వనరులకు అవకాశాలు ఉన్నాయని, అక్కడి సంస్థలతో చర్చల సందర్భంగా సుమారు 5 లక్షల ఉద్యోగ అవకాశాల గురించి ప్రస్తావన వచ్చిందని చెప్పారు. తన నియోజకవర్గంలోని మందమర్రిలో 70 మంది యువతకు జర్మన్ భాషలో శిక్షణ అందిస్తున్నామని, వారికి తన సంస్థ తరపున స్టైపెండ్ కూడా ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన యువతకు జర్మనీలో ఉపాధి కల్పించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. యూరప్, జపాన్ తదితర దేశాల్లో మారుతున్న ఉపాధి అవకాశాలకు అనుగుణంగా స్థానిక భాషలు,

ఆధునిక నైపుణ్యాల్లో శిక్షణ పొందడం అవసరమన్నారు. విధాన నిర్ణయాల్లో కార్మికులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. బలమైన ట్రేడ్ యూనియన్లు, బాధ్యతాయుతమైన రాజకీయ నాయకత్వం, న్యాయమైన వేతనాలు, సామాజిక భద్రత, అర్థవంతమైన సామాజిక సంభాషణ ద్వారా న్యాయబద్ధమైన, సమ్మిళిత సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. కార్మిక సంఘాల నాయకులు, రాజకీయ ప్రతినిధులు, నిపుణులు క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్మిక సంస్కరణలు పరిశ్రమల అభివృద్ధికి దోహదపడటంతో పాటు కార్మికుల హక్కులను పరిరక్షించేలా ఉండాలని చెప్పారు. సదస్సులో వచ్చే ఆచరణాత్మక సూచనలను పరిశీలించి, కార్మికుల ప్రయోజనాలకు అనుగుణంగా సాధ్యమైన మేరకు అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, కనీస వేతనాల సలహా మండలి ఛైర్మన్ జనక్ ప్రసాద్, మాజీ ఎంపీ ఖుంతియా, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్‌తో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# పట్టభద్రులంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

- **నవంబర్ 6 చివరి గడువు.. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటు హక్కు పొందాలి**
- **పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు నమోదుకు ప్రాధాన్యత ఇవ్వాలి.. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి విజ్ఞప్తి**

**మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం పరిధిలోని:** ప్రజాస్వామ్య వ్యవస్థలో పట్టభద్రుల భాగస్వామ్యం కీలకమని, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకొని తన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి రంగారెడ్డి-మహబూబ్‌నగర్-హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ, నవంబర్ 6వ తేదీ చివరి గడువు కావడంతో అర్హులైన పట్టభద్రులు నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. విద్యావంతుల గొంతుక చట్టసభల్లో వినిపించాలంటే ఓటరు నమోదు మొదటి అడుగు అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం మీర్పేట్ జీహెచ్ఎంసీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల సమన్వయకర్తగా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడిగా పనిచేస్తున్న కామోజీ తిరుపతయ్య పట్టభద్రుల ఓటరు నమోదు ప్రాధాన్యతను వివరిస్తూ అర్హులైన యువతీ యువకులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, నిరుద్యోగ పట్టభద్రులు, వివిధ వృత్తుల్లో స్థిరపడిన విద్యావంతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదుపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తూ, అర్హులైన వారందరూ గడువులోగా తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకునేలా చొరవ చూపాలని కోరారు.

**ప్రజాస్వామ్యంలో పట్టభద్రుల ఓటుకు ప్రత్యేక ప్రాధాన్యత**

ఓటు హక్కు ప్రజాస్వామ్యం కల్పించిన విలువైన హక్కు మాత్రమే కాకుండా, సమాజ భవిష్యత్తును నిర్ణయించడంలో ప్రతి పౌరుడిపై ఉన్న బాధ్యతకు ప్రతీక అని కామోజీ తిరుపతయ్య పేర్కొన్నారు. ముఖ్యంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతులు తమ అభిప్రాయాలను ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యక్తం చేసేందుకు ఓటరు నమోదు కీలకమని తెలిపారు. విద్యారంగ సమస్యలు, నిరుద్యోగుల ఇబ్బందులు, ఉద్యోగుల హక్కులు, యువత భవిష్యత్తు, ఉన్నత విద్యలో మార్పులు వంటి అంశాలపై పట్టభద్రుల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ తమ అర్హతను పరిశీలించుకొని ఓటరు నమోదుకు ముందుకు రావాలని సూచించారు. ఉన్నత విద్యను అభ్యసించినప్పటికీ ఓటరు నమోదుపై సరైన అవగాహన లేకపోవడం వల్ల కొందరు అర్హులు దరఖాస్తు చేసుకోకుండా ఉండిపోతున్నారని, అలాంటి పరిస్థితి రాకుండా పట్టభద్రుల్లో విస్తృత అవగాహన అవసరమని పేర్కొన్నారు. ఉద్యోగాలు చేస్తున్నవారు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులు, ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న విద్యావంతులు, ఉపాధ్యాయులు తమ అర్హతకు అనుగుణంగా నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు.

**నాలుగు విధానాల్లో ఓటరు నమోదుకు అవకాశం**

పట్టభద్రులు తమ సౌలభ్యాన్ని బట్టి ఆఫ్‌లైన్, ఆన్‌లైన్, క్యూఆర్ కోడ్, వాట్సాప్ విధానాల ద్వారా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆఫ్‌లైన్ విధానంలో ఫారం-18ను పూర్తిగా నింపి సంబంధిత అధికారులకు సమర్పించవచ్చని, ఆన్‌లైన్ విధానంలో ఎన్నికల అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న మార్గదర్శకాలను అనుసరించి దరఖాస్తు చేసుకోవచ్చని

వివరించారు. ప్రచార పోస్టర్‌లో అందించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా కూడా నమోదు ప్రక్రియను ప్రారంభించవచ్చని పేర్కొన్నారు. వాట్సాప్ ద్వారా నమోదు చేసుకోవాలనుకునే పట్టభద్రులు ఔూ.ఎజూూమీూూహీూ.×చీ వెబ్‌సైట్‌ను సందర్శించి, అందులో సూచించిన విధానాన్ని అనుసరించాలని తెలిపారు. దరఖాస్తు సమయంలో అధికారిక మార్గదర్శకాల ప్రకారం అవసరమైన ధ్రువపత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఆధార్ వివరాలు, ఫొటో, డిగ్రీ మార్కుల జాబితా లేదా తాత్కాలిక పట్టా ధ్రువపత్రం వంటి పత్రాలు అవసరమవుతాయా అనే విషయాన్ని సంబంధిత అధికారిక సూచనల ప్రకారం నిర్ధారించుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకునే ముందు అర్హత ప్రమాణాలు, అవసరమైన పత్రాలు, సమర్పించాల్సిన విధానం గురించి పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. చివరి తేదీ సమీపించిన తర్వాత తొందరపాటుకు గురికాకుండా ముందుగానే దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవడం మంచిదని పేర్కొన్నారు. దరఖాస్తు సమర్పించినంత మాత్రాన ప్రక్రియ పూర్తయినట్లు భావించకుండా, ఓటరు జాబితాలో తమ పేరు నమోదైందో లేదో అధికారిక మార్గాల ద్వారా పరిశీలించుకోవాలని తెలిపారు.

**పట్టభద్రుల సమస్యలకు ప్రజాస్వామ్య వేదిక**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు విద్యావంతుల అభిప్రాయాలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లే ముఖ్యమైన ప్రజాస్వామ్య వేదికగా నిలుస్తాయని కామోజీ తిరుపతయ్య పేర్కొన్నారు. విద్యావంతులు ఎదుర్కొంటున్న సమస్యలు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, విద్యా సంస్థల అభివృద్ధి, ఉద్యోగుల సంక్షేమం వంటి అంశాలపై పట్టభద్రులు తమ అభిప్రాయాలను ఓటు ద్వారా వ్యక్తం చేసే అవకాశం ఉంటుందని వివరించారు. పట్టభద్రులు ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకోకపోతే ఎన్నికల సమయంలో ఓటు వేసే అవకాశాన్ని కోల్పోయే పరిస్థితి ఏర్పడవచ్చని తెలిపారు. అందువల్ల అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను గుర్తించి నమోదు ప్రక్రియలో పాల్గొనాలని కోరారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహోద్యోగులు, పరిచయస్తుల్లో డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులకు కూడా ఈ విషయాన్ని తెలియజేసి అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యం బలోపేతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం పెరగాలని, ఎన్నికల ప్రక్రియలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించేందుకు ఓటరు నమోదు అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత తమ హక్కులపై అవగాహన పెంచుకొని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

**ప్రతి పట్టభద్రుడి ఓటు విలువైనదే**

"ఓటు అనేది కేవలం ఒక గుర్తు కాదు.. మన ఆలోచనలకు, మన సమస్యలకు, మన భవిష్యత్తుపై మనకున్న ఆశలకు ప్రజాస్వామ్యంలో లభించిన గొంతుక. అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకున్నప్పుడే తన హక్కును వినియోగించుకునే అవకాశం పొందుతాడు. అందుకే నవంబర్ 6 చివరి గడువును దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ సకాలంలో దరఖాస్తు చేసుకోవాలి" అనే సందేశంతో పట్టభద్రులకు అవగాహన కల్పించారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి తరఫున పట్టభద్రుల ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తూ కామోజీ తిరుపతయ్య అర్హులైన ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. ఓటరు నమోదు విషయంలో నిర్లక్ష్యం చేయకుండా గడువులోగా దరఖాస్తు చేసుకోవడంతో పాటు, అధికారిక ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో నిర్ధారించుకోవాలని సూచించారు. పట్టభద్రుల భాగస్వామ్యం పెరిగితే ప్రజాస్వామ్య ప్రక్రియలో వారి అభిప్రాయాలకు తగిన ప్రాధాన్యత లభించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. విద్యావంతులు తమ హక్కులపై అవగాహన పెంచుకొని, ఇతర అర్హులకూ సమాచారం అందించడం ద్వారా ఓటరు నమోదు ప్రక్రియలో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా సమిష్టిగా కృషి చేయాలని కామోజీ తిరుపతయ్య కోరారు.

# జయశంకర్ కాలనీలో సప్తగిరి కంటి ఆసుపత్రి మొబైల్ క్లినిక్

- **వృద్ధులకు ఉచితంగా కంటి పరీక్షలు.. ఇరుగదండ్ల**
- **విష్ణు ఆధ్వర్యంలో వైద్య సేవలు**

**మేడ్చల్ మల్కాజ్గిరి జవహర్ నగర్, జవహర్ నగర్, అక్టోబర్ 23 ( ):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, జవహర్ నగర్ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కీసర సర్కిల్ పరిధిలోని 21వ డివిజన్ చేన్నాపురం జయశంకర్ కాలనీలో ఇరుగదండ్ల విష్ణు ఆధ్వర్యంలో శుక్రవారం సప్తగిరి కంటి ఆసుపత్రి మొబైల్ క్లినిక్‌ను ఏర్పాటు చేశారు. కంటి పరీక్షల కోసం ఆసుపత్రులకు వెళ్లలేక వృద్ధులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన విష్ణు, సప్తగిరి కంటి ఆసుపత్రి సహకారంతో మొబైల్ క్లినిక్‌ను కాలనీకి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు 10 నుంచి 15 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి తదుపరి వైద్య సేవలు అందించేలా చర్యలు



చేపట్టారు. ఈ సందర్భంగా ఇరుగదండ్ల విష్ణు మాట్లాడుతూ.. కంటి సమస్యలతో బాధపడుతున్న వృద్ధులు, ఆసుపత్రులకు వెళ్లలేని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సప్తగిరి కంటి ఆసుపత్రి ద్వారా అవసరమైన వారు తదుపరి పరీక్షలు, చికిత్స పొందేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమానికి జయశంకర్ కాలనీ అధ్యక్షుడు కృష్ణ, శ్రీనివాస్ ముకుందం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జర్నలిస్టులు విజయకుమార్, రఘు, కావ్య, అంజయ్యతో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు. వృద్ధుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వారి వద్దకే వైద్య సేవలను తీసుకురావడం అభినందనీయమని కాలనీవాసులు పేర్కొన్నారు.

## నాలుగు ఆవులు - సింహం

**కథ:**

ఒక దట్టమైన అడవికి సమీపంలో ఉన్న పచ్చికబయళ్లలో నాలుగు ఆవులు నివసిస్తూ ఉండేవి. ఆ నాలుగు ఆవులు చాలా ప్రాణ స్నేహితులు. అవి ఎక్కడికి వెళ్లినా, మేత మేయడానికి వెళ్లినా ఎప్పుడూ కలిసే ఉండేవి. ఆ అడవిలో ఉన్న ఒక సింహం చాలా రోజులుగా ఆ ఆవులను చూసి, వాటిని వేటాడి తినాలని అనుకునేది. కానీ ఆ నాలుగు ఆవులు ఎల్లప్పుడూ కలిసికట్టుగా ఉండటం వల్ల, సింహం వాటిపై దాడి చేయడానికి భయపడేది. ఎప్పుడైనా సింహం వాటి దగ్గరకు వస్తే, నాలుగు ఆవులు ఒకేసారి కలిసి తమ

కొమ్ములతో సింహాన్ని ఎదుర్కొనేవి. దాంతో సింహం భయపడి పారిపోయేది. ఇలా లాభం లేదని గ్రహించిన సింహం ఒక కుతంత్రం పన్నింది. అది ఆవుల మధ్యకు వెళ్లకుండా, దూరం నుండి ఒక్కొక్క ఆవుతో విడివిడిగా మాట్లాడుతూ మిగిలిన ఆవులపై లేనిపోని అబద్ధాలు చెప్పి వాటి మధ్య అసూయ, ద్వేషాలు పెంచింది. సింహం మాటలు నమ్మి ఆ నాలుగు ఆవులు ఒకదానితో ఒకటి గొడవపడి, విడిపోయి, అడవిలో వేర్వేరు దిక్కులలో ఒంటరిగా మేత మేయడం ప్రారంభించాయి. సింహం కోరుకున్న సమయం రానే వచ్చింది. ఆవులు విడివిడిగా ఒంటరిగా ఉండటం చూసి, సింహం ఒక్కొక్క ఆవుపై సులభంగా దాడి చేసి, నాలుగు ఆవులను వేటాడి తినేసింది. ఆవుల మధ్య ఐకమత్యం దెబ్బతినడమే వాటి వినాశనానికి కారణమైంది.

**నీతి:**

**కలిసి ఉంటే కలదు సుఖం. ఐకమత్యం ఉన్నంత కాలం శత్రువు మనల్ని ఏమీ చేయలేడు, కానీ మనలో మనకు విభేదాలు వస్తే నాశనం తప్పదు.**

## కృతజ్ఞత లేని పాము

**కథ:**

అనగనగా ఒక గ్రామంలో ఒక దయాగుణం గల రైతు ఉండేవాడు. ఒక చలికాలం ఉదయం అతను తన పొలానికి వెళ్తుండగా, దారిలో చలికి గడ్డకట్టుకుపోయి కదల్లేని స్థితిలో ఉన్న ఒక పెద్ద పాము కనిపించింది. ఆ పామును చూసి రైతుకు జాలి వేసింది. అది కదల్లేక చనిపోయేలా ఉందని గ్రహించి, దాన్ని కాపాడాలనుకున్నాడు. రైతు ఆ పామును జాగ్రత్తగా ఒక బుట్టలో పెట్టి తన ఇంటికి తీసుకువచ్చాడు. పొయ్యి దగ్గర వెచ్చదనం తగిలేలా ఉంచాడు. కొద్దిసేపటికి ఆ వెచ్చదనానికి పాముకు ప్రాణం లేచింది, అది మళ్లీ మామూలుగా కదలడం ప్రారంభించింది. రైతు ఎంతో సంతోషించి దానికి కొంచెం పాలు కూడా పోశాడు. కానీ, కొద్దిసేపటికి ఆ పాము తన సహజ గుణాన్ని ప్రదర్శించింది. పాలు తాగి బలం పుంజుకున్న తర్వాత, అది బుసలు కొడుతూ తనను కాపాడిన రైతుపైనే దాడి చేయడానికి, అతని కొడుకును కరవడానికి ముందుకు వచ్చింది. దుష్టులకు ఎంత మేలు చేసినా వారి క్రూర స్వభావం మారదని రైతు వెంటనే గ్రహించాడు. అతను ఆలస్యం చేయకుండా పక్కనే ఉన్న ఒక పెద్ద... కర్రను తీసుకుని, తన కుటుంబాన్ని కాపాడుకోవడానికి ఆ కృతజ్ఞత లేని పామును కొట్టి చంపేశాడు.

**నీతి:**

దుష్ట స్వభావం కలవారికి మనం ఎంత సహాయం చేసినా, సమయం వచ్చినప్పుడు వారు కీడు చేయడానికే చూస్తారు. కాబట్టి చెడ్డవారితో స్నేహం ఎప్పటికీ ప్రమాదకరమే.

# మిధాని డిపో గౌరవ అధ్యక్షుడు మర్రి రవికిరణ్ రెడ్డికి ఘనంగా జన్మదిన సన్మానం

- **ఆత్మీయత నడుమ అంబరాన్నంటిన ఆనందోత్సాహాలు.. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, ఆర్టీసీ ఉద్యోగులు**
- **ఉద్యోగుల ఐక్యతే అసలైన బలం.. కార్మికుల సంక్షేమమే ప్రథమ కర్తవ్యం.. పరస్పర గౌరవం, సహకారంతోనే యూనియన్ మరింత బలోపేతం**

**రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం- భవిష్యత్ ప్రజాపాలన :** మిధాని డిపో ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు మర్రి రవికిరణ్ రెడ్డి జన్మదిన వేడుకలు ఆత్మీయత, అభిమానాలు, ఆనందోత్సాహాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ మిధాని డిపో నాయకులు, ఆర్టీసీ ఉద్యోగులు ఒకచోట చేరి ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి తమ అభిమానాన్ని, గౌరవాన్ని చాటుకున్నారు. ఉద్యోగుల మధ్య నెలకొన్న సోదరభావం, నాయకత్వంపై ఉన్న విశ్వాసం, పరస్పర అనుబంధం ఈ వేడుకలో ప్రత్యేకంగా ప్రతిబింబించాయి. మర్రి రవికిరణ్ రెడ్డి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తూ ఉద్యోగుల అభిమానం పొందాలని నాయకులు, ఉద్యోగులు ఆకాంక్షించారు. జన్మదిన వేడుక అనేది ఒక వ్యక్తి జీవితంలో మరో ఏడాది పూర్తయిన సందర్భం మాత్రమే కాదు.. ఇప్పటివరకు సాగించిన ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ, భవిష్యత్తులో మరింత బాధ్యతతో ముందుకు సాగేందుకు ప్రేరణనిచ్చే ప్రత్యేకమైన సందర్భం. అలాంటి రోజున తోటి ఉద్యోగులు, యూనియన్ నాయకులు కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేయడం మర్రి రవికిరణ్ రెడ్డి పట్ల వారికున్న అభిమానానికి నిదర్శనంగా నిలిచింది. పదవులు, హోదాలకు అతీతంగా మనుషుల మధ్య ఏర్పడే ఆత్మీయ సంబంధాలే నిజమైన సంపద అని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. ఒకరికి ఒకరు అండగా నిలుస్తూ, సంతోషాలను పంచుకుంటూ, కష్టసుఖాల్లో తోడుగా ఉండే ఉద్యోగుల మధ్య ఐక్యత యూనియన్‌కు ఎంతో బలాన్నిస్తుందని పలువురు పేర్కొన్నారు.

**ఉద్యోగుల అభిమానం.. నాయకత్వానికి నిజమైన గుర్తింపు**

ఒక సంస్థలో ఉద్యోగులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు పరస్పర గౌరవంతో ముందుకు సాగినప్పుడే ఆరోగ్యకరమైన పని వాతావరణం ఏర్పడుతుంది. ముఖ్యంగా ప్రజా రవాణా వ్యవస్థలో కీలకమైన పాత్ర పోషిస్తున్న ఆర్టీసీ ఉద్యోగుల మధ్య ఐక్యత, సహకారం ఎంతో అవసరం. నిత్యం వేలాది మంది ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు ఆర్టీసీ సిబ్బంది నిరంతరం శ్రమిస్తుంటారు. ఎండ, వానలను లెక్కచేయకుండా విధులు నిర్వర్తించే కార్మికుల శ్రమకు తగిన గుర్తింపు, గౌరవం లభించాలి. వారి సమస్యలను అర్థం చేసుకొని, హక్కుల పరిరక్షణకు కృషి చేస్తూ, సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చే నాయకత్వం ఉద్యోగుల్లో నమ్మకాన్ని పెంపొందిస్తుందని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు. మిధాని డిపో గౌరవ అధ్యక్షుడు మర్రి రవికిరణ్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసేందుకు యూనియన్ నాయకులు, ఉద్యోగులు ఒకచోట చేరడం కేవలం వేడుకగా మాత్రమే కాకుండా, ఉద్యోగుల మధ్య ఉన్న అనుబంధాన్ని చాటిచెప్పే సందర్భంగా నిలిచింది. ఒకరి సంతోషాన్ని మరొకరు తమ సంతోషంగా భావించడం, వ్యక్తిగత ఆనందాలను సమష్టిగా పంచుకోవడం కార్మిక కుటుంబాల ప్రత్యేకత అని పలువురు పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ఉద్యోగుల మధ్య సాన్నిహిత్యాన్ని పెంచడంతో పాటు యూనియన్ కార్యకలాపాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతాయని తెలిపారు.

**కార్మికుల సంక్షేమమే యూనియన్ ప్రధాన లక్ష్యం**

ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కార్మికుల సంక్షేమం, ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, ఐక్యత, పరస్పర సహకారం వంటి అంశాల ప్రాధాన్యతను గుర్తుచేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్మికులు సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఉద్యోగి ఎదుర్కొనే ఇబ్బందులను గుర్తించి, వాటి పరిష్కారానికి సమష్టిగా కృషి చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. యూనియన్ బలోపేతం కావాలంటే నాయకుల బాధ్యతతో పాటు ప్రతి సభ్యుడి భాగస్వామ్యం కూడా కీలకమని పేర్కొన్నారు. ఉద్యోగుల ఐక్యత బలంగా ఉన్నప్పుడు ఎలాంటి సమస్యనైనా ప్రజాస్వామ్యబద్ధంగా, సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశం ఉంటుందని తెలిపారు. యూనియన్ నాయకులు ఉద్యోగులకు అందుబాటులో ఉండటం, వారి అభిప్రాయాలకు విలువ ఇవ్వడం, సమస్యల పరిష్కారంలో చొరవ చూపడం ఎంతో ముఖ్యమన్నారు. ఉద్యోగుల మధ్య విభేదాలకు తావివ్వకుండా, అందరినీ కలుపుకొని

ముందుకు సాగినప్పుడే సంస్థాగత ఐక్యత మరింత బలపడుతుందని పేర్కొన్నారు. "నాయకుడికి నిజమైన గౌరవం పదవితో రాదు.. ఆయన చూపించే సేవాభావంతో వస్తుంది. కార్మికుల కష్టాన్ని అర్థం చేసుకొని, వారి కన్నీటిని తుడిచి, కష్టకాలంలో అండగా నిలిచే వ్యక్తికే ఉద్యోగుల హృదయాల్లో శాశ్వత స్థానం లభిస్తుంది. ఐక్యత మన బలం.. పరస్పర సహకారం మన మార్గం.. కార్మికుల సంక్షేమమే మన లక్ష్యం కావాలి." ఈ సందేశం ఉద్యోగుల మధ్య ఐక్యతకు, సేవాభావంతో కూడిన నాయకత్వానికి ఉన్న ప్రాధాన్యతను చాటిచెప్పింది. ఉద్యోగుల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం, వారి సమస్యల పట్ల బాధ్యతగా వ్యవహరించడం, ప్రతి ఒక్కరినీ గౌరవిస్తూ సమష్టి ప్రయోజనాల కోసం పనిచేయడం మంచి నాయకత్వానికి నిదర్శనమని పలువురు అభిప్రాయపడ్డారు.

**ఆత్మీయ సన్మానంలో పాల్గొన్న యూనియన్ నాయకులు**

మర్రి రవికిరణ్ రెడ్డి జన్మదిన వేడుకల్లో ఎంప్లాయిస్ యూనియన్ మిధాని డిపో అధ్యక్షుడు కూరాకుల యాదగిరి, డిపో కార్యదర్శి ఎండీ జలీల్, డిపో సలహాదారులు జాఫర్, జగన్, అనిల్ బాబు గౌడ్, మహిళా రాష్ట్ర ప్రచార కార్యదర్శి బొప్పాని జ్యోతి, గ్యారేజీ కార్యదర్శి చలపతి, డిపో సంయుక్త కార్యదర్శి ఎండీ ఆరిఫ్, జోనల్ ప్రచార కార్యదర్శి సయ్యద్ రుక్ముద్దీన్, డిపో ఉపాధ్యక్షుడు దయానంద్ కుమార్ పాల్గొన్నారు. అదేవిధంగా త్రిలోక్ కుమార్, శ్రీనివాస్ గౌడ్, జాఫర్, పురుషోత్తం, చంద్రశేఖర రావుతో పాటు పలువురు ఆర్టీసీ ఉద్యోగులు, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, అభిమానులు, పెద్దలు పాల్గొని మర్రి రవికిరణ్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు, ఉద్యోగులు ఆయనతో తమ అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ శుభాకాంక్షలు తెలిపి, సన్మాన కార్యక్రమాన్ని ఆత్మీయంగా నిర్వహించారు. ఉద్యోగులందరూ ఒక కుటుంబంలా కలిసి ఉండటం, ఒకరి విజయాన్ని మరొకరు అభినందించడం, సంతోషకరమైన సందర్భాలను సమష్టిగా జరుపుకోవడం ఐక్యతకు బలమైన పునాది అని ఈ కార్యక్రమం మరోసారి నిరూపించింది. ఇలాంటి ఆత్మీయ సమావేశాలు ఉద్యోగుల మధ్య విశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో మరింత సమన్వయంతో పనిచేసేందుకు దోహదపడతాయని పలువురు పేర్కొన్నారు.

**ఐక్యతతోనే అభివృద్ధి.. గౌరవంతోనే సంతృప్తి**

కార్మికుల జీవితాల్లో సంతోషం, భద్రత, గౌరవం, సంక్షేమం కీలకమైన అంశాలు. ఉద్యోగులు సంస్థ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నప్పుడు వారి శ్రమను గుర్తించడం, వారి ఆత్మగౌరవాన్ని కాపాడటం, అవసరమైన సమయంలో అండగా నిలవడం సమాజంలోని ప్రతి వర్గం బాధ్యత. ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, పరస్పర సహకారంతో ముందుకు సాగినప్పుడే మెరుగైన పని వాతావరణం ఏర్పడుతుందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. "కార్మికుడి చెమట చుక్కలోనే సంస్థ అభివృద్ధి దాగి ఉంటుంది.. ఉద్యోగి శ్రమకు గౌరవం లభించినప్పుడే నిజమైన ప్రగతి సాధ్యమవుతుంది. వ్యక్తిగత ప్రయోజనాలకంటే సమష్టి సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, ఐక్యతను కాపాడుకుంటూ ముందుకు సాగినప్పుడే కార్మిక లోకానికి బలమైన భవిష్యత్తు నిర్మించగలం." ఈ ఆలోచనతో ఉద్యోగుల సంక్షేమం, పరస్పర గౌరవం, ఐక్యతకు పెద్దపీట వేస్తూ ముందుకు సాగాలని నాయకులు ఆకాంక్షించారు. మిధాని డిపోలో ఉద్యోగుల మధ్య సత్సంబంధాలు మరింత బలపడాలని, ప్రతి ఉద్యోగి గౌరవప్రదమైన వాతావరణంలో విధులు నిర్వర్తించే పరిస్థితులు కొనసాగాలని కోరుకున్నారు.

**జన్మదిన వేడుకలతో మరింత బలపడిన ఆత్మీయ అనుబంధం**

మర్రి రవికిరణ్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన సన్మాన కార్యక్రమం ఉద్యోగుల అభిమానానికి, యూనియన్ నాయకుల ఆత్మీయతకు ప్రతీకగా నిలిచింది. శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు, ఉద్యోగులు ఆయనకు మరోసారి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన జీవితం ఆరోగ్యం, ఆనందం, విజయాలతో నిండాలని, కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులోనూ ఉద్యోగుల అభిమానాన్ని పొందుతూ, వారి సంక్షేమం పట్ల నిబద్ధతతో ముందుకు సాగాలని కోరుకున్నారు. పదవులు మారవచ్చు.. కాలం మారవచ్చు.. కానీ ఆత్మీయతతో సంపాదించుకున్న అభిమానం మాత్రం చిరస్థాయిగా నిలుస్తుంది. ఉద్యోగుల మధ్య సోదరభావం, యూనియన్ పట్ల నిబద్ధత, కార్మికుల సంక్షేమం కోసం సమష్టిగా కృషి చేయాలనే సంకల్పం కొనసాగినప్పుడే ఇటువంటి వేడుకలకు నిజమైన సార్థకత చేకూరుతుంది. మర్రి రవికిరణ్ రెడ్డి జన్మదిన వేడుకలు ఆత్మీయతను పంచుతూ, ఉద్యోగుల ఐక్యతను చాటుతూ, మిధాని డిపోలో సంతోషకరమైన వాతావరణాన్ని నింపాయి.

## ఈ గాలీ! ఈ నేలా!

నేత్ర ఇంకా ఇంటికి రాలేదు. ఎందుకు ఆలస్యమై ఉంటుంది? నిరుపమను అంతకంతకూ భయం కమ్మేస్తున్నది. ఎప్పుడైనా ఇంటికి రావడం ఆలస్యమైతే వెంటనే ఫోన్ చేసి తానెక్కడుందో, ఎంతసేపట్లో వస్తుందో చెప్తుంది నేత్ర. ఇవ్వాళ కూడా అలాగే ఒక గంట ఆలస్యం అవుతుందని చెప్పింది. కనీసం ఏ ఎనిమిదింటికో, తొమ్మిదింటికో రావలసిన




నేత్ర.. రాత్రి 11 అయినా రాలేదు. కంపెనీ పనిమీద విశాఖపట్నం వెళ్లిన సూర్యంకి ఫోన్ చేస్తే కంగారు పడిపోవడం తప్ప.. దూరాన ఉన్న ఆయనేం చేయగలరు? నిరుపమకు గుండె వేగం పెరిగిపోయి శరీరం సన్నగా కంపించసాగింది. అష్రఫ్‌కి కాల్ చేస్తే ఫోన్ ఎత్తడంలేదు. నిమిష నిమిషానికి ఆమెలో ఎన్నెన్నో అనుమానాలు రేకెత్తున్నాయి. అటు నేత్రకి, ఇటు అష్రఫ్‌కి పదేపదే ఫోన్ చేస్తూనే ఉంది. సమయం పదకొండున్నర అయ్యింది. ఇప్పుడామె భయం నేత్ర రావడం ఆలస్యమైనందుకే కాదు. అదే సమయంలో అష్రఫ్ కూడా ఫోన్ లిఫ్ట్ చేయనందుకు. ఎప్పుడైనా ఇద్దరూ కలిసి బయటికి వెళ్లినా త్వరగానే వచ్చేస్తారు. మనసులో సన్నగా మొదలైన భయం, అనుమానం అంతకంతకూ పెరిగిపోయి దుఃఖంగా మారసాగింది. ఇప్పుడేం చేయాలి? ఎక్కడ వెతకాలి..? అసలు నేత్ర ఆఫీస్ ఎక్కడుందో తెలియదు. నేత్ర స్నేహితుల నెంబర్లు కానీ, పోనీ అష్రఫ్ వాళ్ల అమ్మానాన్నల నెంబర్లు కానీ.. తన దగ్గర లేవని గుర్తుకొచ్చి గుండెలో అలజడి పెరిగిపోయింది. మళ్లీ అదే ప్రశ్న. ఎవరిని అడగాలి? ఎక్కడని వెతకాలి? పోలీస్ రిపోర్టు ఇవ్వాలా? అంతా అయోమయం. మళ్లీ ఒకసారి నేత్రకి, అష్రఫ్‌కి ఫోన్ చేసింది. ఇద్దరిలో ఎవరూ ఎత్తలేదు. దాంతో ఆమె అనుమానాలు మరింత పెరిగి.. కింద కూలబడిపోయి ఏడవడం మొదలుపెట్టింది. పది నెలల క్రితం అసలు అష్రఫ్ ఎవరో ఎవరికీ తెలియదు. నిరుపమ కుటుంబానికి అష్రఫ్‌కి అనుబంధం అతి మామూలుగానే మొదలయ్యింది.

## జర్నలిస్టు వర్కాల కృష్ణయ్యకు మాతృ వియోగం

- **నివాళులర్పించి టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య**

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ అక్టోబర్ 23:** హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్(హెచ్ యూజే) సీనియర్ నాయకుడు, నమస్తే తెలంగాణ రిపోర్టర్ వర్గాల కృష్ణయ్య తల్లి వర్కాల చిన్నమ్మ (85) అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మరణించారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అంబర్ పేటలోని జైస్వాల్ గార్డెన్స్ లో గల జర్నలిస్టు వర్కాల కృష్ణయ్య ఇంటికి వెళ్ళి చిన్నమ్మ భౌతిక కాయం పై పూలమాల ఉంచి నివాళులర్పించారు. ఆయనతో పాటు టీడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుంచం శ్రీనివాస్, నాయకులు సతీష్ ముదిరాజ్, రమేష్ తదితరులు కూడా చిన్నమ్మ భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య... వర్కాల కృష్ణయ్య ను అతని కుటుంబ సభ్యులకు పరామర్శించి ఓదార్చారు. చిన్నమ్మ భౌతిక కాయానికి సాయంత్రం అంబర్ పేట స్మశాన వాటికలో అంత్యక్రియలు జరిగాయి.

## పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి

- **కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే నవీన్ యాదవ్ పిలుపు**

**జూబ్లీహిల్స్:** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారికి చేరవేసే అంశాలపై చర్చించారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని నాయకులకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని నవీన్ యాదవ్ అన్నారు. పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేస్తూ ప్రజాసేవలో ముందుండాలని సూచించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

## పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతాం

- **ఖైరతాబాద్ బీఆర్ఎస్ ఇన్‌ఛార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి**

**హైదరాబాద్, అక్టోబరు 23:** రానున్న పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌ఛార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి (ఎంజీఆర్) అన్నారు. ఫిలింనగర్ డివిజన్ పరిధిలోని ఎంఆర్‌సీ కాలనీ, బీజేఆర్ నగర్‌లో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన పట్టభద్రులకు దరఖాస్తు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంజీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను నిరాశకు గురిచేసిందని ఆరోపించారు. ప్రభుత్వ పనితీరుపై పట్టభద్రులు తమ తీర్పును వెల్లడించే సమయం ఆసన్నమైందన్నారు. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే కీలక ఎన్నికలని పేర్కొన్నారు. విద్యావంతులు, నిరుద్యోగ యువత, మేధావులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అర్హులైన పట్టభద్రులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి రాజకీయ సమాధానం చెప్పేందుకు పట్టభద్రులు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వెంకీ ముదిరాజ్, సైదులు, జ్యోతి స్వరూప్, తేజ, నవీన్, తరుణ్, సంతు, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## కోకాపేట ఓఆర్ఆర్ వద్ద రోడ్డు ప్రమాదం

- **నలుగురికి తీవ్ర గాయాలు**

**నార్సింగి, అక్టోబరు 23:** కోకాపేటలోని ఔటర్ రింగ్‌రోడ్డు ఎగ్జిట్ నంబరు-1 సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. నానక్‌రామ్‌గూడ టోల్‌ప్లాజా నుంచి పటాన్‌చెరు వైపు వెళ్తున్న హోండా సివిక్ కారు (ఆర్యా 12 + 0900) మధ్యాహ్నం సుమారు 3.30 గంటల సమయంలో ముందుగా వెళ్తున్న రెడీ మిక్స్ కాంక్రీట్ వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. కారు అతివేగంగా నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనలో కారు నడుపుతున్న ఇబ్రహీంతో పాటు అనుష్ (22), ఆశిష్ (20), బిందుప్రియ (20) గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మెడికవర్ ఆసుపత్రికి, హైటెక్ సిటీ యశోద ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టి, తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు.

**పోలీసుల సూచన:** వాహనదారులు అతివేగంగా ప్రయాణించకుండా, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ అప్రమత్తంగా వాహనాలు నడపాలి.

## ఇంటర్‌నెట్‌లో 13 ఏళ్లుగా నేర్చుకుని.. ఎగిరే కారు తయారు చేసిన యువకుడు

ఒక యువకుడు ఎలాంటి ఇంజినీరింగ్ డిగ్రీ చదువలేదు. అయితే ఎగిరే కారు తయారు చేయాలని చిన్నప్పటి నుంచి కలలు కన్నాడు. దీని కోసం 13 ఏళ్లుగా ఇంటర్‌నెట్‌లో నేర్చుకున్నాడు. చివరకు ఒక ఎలక్ట్రిక్ ఫ్లయింగ్ కార్‌నమూనాను నిర్మించాడు.దానిని స్వయంగా నడిపి తన ప్రతిభను చాటుకున్నాడు.

**ఇంటర్‌నెట్‌లో 13 ఏళ్లుగా నేర్చుకుని.. ఎగిరే కారు తయారు చేసిన యువకుడు**

డెహ్రాడూన్: ఒక యువకుడు ఎలాంటి ఇంజినీరింగ్ డిగ్రీ చదువలేదు. అయితే ఎగిరే కారు తయారు చేయాలని చిన్నప్పటి నుంచి కలలు కన్నాడు. దీని కోసం 13 ఏళ్లుగా ఇంటర్‌నెట్‌లో నేర్చుకున్నాడు. చివరకు ఒక ఎలక్ట్రిక్ ఫ్లయింగ్ కార్ నమూనాను నిర్మించాడు. దానిని స్వయంగా నడిపి తన ప్రతిభను చాటుకున్నాడు. (Uttarakhand man builds flying car) ఉత్తరాఖండ్‌లోని అల్మోరా జిల్లా జాగేశ్వర్ ధామ్ సమీపంలోని కాఫ్లిఖాన్‌కు చెందిన రవి తమ్టా, గ్రామంలోని జూనియర్ హైస్కూల్‌లో ప్రాథమిక విద్య అభ్యసించాడు. ఆ తర్వాత నైనిటాల్ క్యాంపస్ నుంచి బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ డిగ్రీతో పట్టభద్రుడయ్యాడు. తండ్రి హరీష్ రామ్ ఒక మెకానిక్. కాగా, గ్రామీణ ప్రాంతంలో పెరిగిన రవిని, కొండల గుండా ప్రయాణించడంలో ఎదురయ్యే సవాళ్లు, ముఖ్యంగా ఆసుపత్రికి చేరుకోవడానికి కొండ రహదారులపై సుదీర్ఘ ప్రయాణం చేయాల్సి రావడం వంటివి చిన్నప్పటి నుంచి తీవ్రంగా ఆలోచింపజేశాయి. దీంతో 2015లో ఎగిరే కారును నిర్మించాలని కలలు కనడం ప్రారంభించాడు. అయితే ఇంజినీరింగ్ చదవకపోయినప్పటికీ 13 ఏళ్లుగా ఆన్‌లైన్‌లో దీని గురించి అభ్యసించాడు. ప్రయోగాల కోసం సొంతంగా హపిడా స్కై ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థను ఏర్పాటు చేశాడు. దీని ద్వారా ఒక ఎలక్ట్రిక్ ఫ్లయింగ్ కార్‌ను అభివృద్ధి చేశాడు. మరోవైపు సింగిల్ సీటర్ ఎగిరే కారు అయిన హపిడా స్కైనెక్స్‌ను ఎట్టకేలకు రవి తయారు చేశాడు. మల్టీరోటర్ డ్రోన్ సాంకేతికతను వినియోగించాడు. ఎలక్ట్రిక్ మోటార్లు, ప్రొపెల్లర్లు, తేలికపాటి ఫ్రేమ్, చిన్న కాక్‌పిట్‌తో ఎగిరే కారును రూపొందించాడు.

## ఉప్పల్ భగాయత్‌కు ఫేస్ 2 భారీ నిధుల మంజూరు

- **రూ.5 కోట్ల 86 లక్షల నిధులు మంజూరు చేయించిన పరమేశ్వర్‌రెడ్డి**

**ఉప్పల్,అక్టోబర్23(భవిష్యత్ ప్రజాపాలన):** ఉప్పల్ భగాయత్‌లోని హెచ్‌ఎండీఏ లే అవుట్‌లో అభివృద్ధి పనులకు వరదలా నిధుల మంజూరు అవుతూనే ఉన్నాయి. లే అవుట్‌లో అన్ని రకాల సౌకర్యాలు, పలు అభివృద్ధి పనులకు ఇప్పటికే పెద్ద మొత్తంలో నిధులు మంజూరు అయిన విషయం తెలిసిందే. ఆ పనులు కొనసాగుతుండగానే మరోసారి ఏకంగా రూ.5 కోట్ల 86 లక్షల నిధులను ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి సహకారంతో మాజీ కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి మంజూరు చేయించారు. రెండు పనులకే రూ.5 కోట్ల 86 లక్షల నిధులు..

1. ఉప్పల్ భగయత్ ఫేజ్ -IIలో రూ.3.88 కోట్ల నిధులతో ఇన్నర్ రింగ్ రోడ్ నుండి సుఖీ శ్రీ సుమేరు మీదుగా డీ మార్ట్ వాటర్ ట్యాంక్, హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్ వరకు దెబ్బతిన్న బీట్ రోడ్డుకు రీకార్పెటింగ్ పనులు.
2. ఉప్పల్ భగయత్ ఫేజ్ - IIలో రూ.1.98 కోట్ల నిధులతో వాసవి క్రౌన్ ఈస్ట్, సుఖీ శ్రీ సుమేరు లేన్ల దగ్గర దెబ్బతిన్న బీట్ రోడ్డుకు రీకార్పెటింగ్ చేయడం జరిగింది.

# నీటి ప్రతి బొట్టును ఒడిసిపట్టుకుందాం

- **వేసవిని దృష్టిలో పెట్టుకొని నీటి పొదుపుపై ప్రజలు దృష్టి సారించాలి**

**టంగటూరు సర్పంచ్ బద్దం హరిత కృష్ణారెడ్డి**

**భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి । రంగయ్య గారి శ్రీనివాస్ । అక్టోబర్ 23 । చేవెళ్ల నియోజకవర్గం :** రాబోయే రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో ఎండలు తీవ్రతరం అయ్యే అవకాశాలు, నీటి లభ్యతపై ఎదురయ్యే సమస్యలను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం టంగటూరు గ్రామ సర్పంచ్ బద్దం హరిత కృష్ణారెడ్డి సూచించారు. తాగునీరు ఎంతో విలువైనదని, దానిని వృథా చేయకుండా ప్రతి ఇంట్లో బాధ్యతాయుతంగా వినియోగించే అలవాటును పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. ఇంటి ఆవరణలు, రోడ్లు, వాహనాలను అవసరం లేకుండా నీటితో కడగడం మానుకోవాలని, పబ్లిక్ కుళాయిలను ఉపయోగించిన వెంటనే మూసివేయాలని, నీటి పైపుల లీకేజీలను గుర్తించిన వెంటనే అరికట్టాలని సూచించారు. తాగునీటిని ఇతర అవసరాలకు వృథా చేయకుండా అవసరమైనంత మేరకే వినియోగించుకోవాలని, వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాల పెంపునకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నీటి పొదుపుతో పాటు విద్యుత్‌ను కూడా ఆదా చేయాలని, అవసరం లేని సమయంలో లైట్లు, ఫ్యాన్లు, టీవీలను ఆపివేయాలని సూచించారు. పగటిపూట సహజ కాంతిని వినియోగించుకోవడం ద్వారా విద్యుత్‌ను ఆదా చేయవచ్చని తెలిపారు. నీటి సంరక్షణ అనేది ఒక్కరి బాధ్యత మాత్రమే కాదని, ప్రతి కుటుంబం, ప్రతి గ్రామస్తుడు భాగస్వామి కావాల్సిన అవసరం ఉందన్నారు. నేటి నీటి పొదుపే రేపటి అవసరాలకు భరోసా అని, ప్రతి నీటి బొట్టును విలువైనదిగా భావించి వృథాను అరికట్టేందుకు ప్రజలందరూ సహకరించాలని సర్పంచ్ బద్దం హరిత కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు.

# అనవసర ఖర్చు కాదు.. మీ హక్కు

సొంత సంపాదన ఉన్నా.. మహిళలు తమకోసం డబ్బు ఖర్చు పెట్టుకోలేక పోతున్నారట. పైగా, తమ అవసరాల కోసం ఏవైనా వస్తువులు కొనుగోలు చేసినా గిల్టీగా ఫీలవుతున్నారట. దీని వెనుక చాలా లోతైన మానసిక, సామాజిక కారణాలు ఉన్నాయని మనస్తత్వ నిపుణులు అంటున్నారు. మనదేశంలో ఆడపిల్లల పెంపకంలో కుటుంబంతోపాటు సమాజం కూడా కీలకపాత్ర పోషిస్తుంది. కుటుంబం, పిల్లలు, భర్త అవసరాలకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని వారికి బాల్యం నుంచే నేర్పిస్తుంటారు. ఈ క్రమంలో తమకోసం ఖర్చు చేసుకోవడం అనేది.. 'అనవసరమైన ఖర్చు' అనే భావన ఆడవాళ్లలో బలంగా నాటుకుపోతుంది. 'ఖర్చు చేయడానికి నేను అర్హురాలినేనా?' అనే అంతర్మథనం కూడా ఉంటుంది. ఎందుకంటే, కుటుంబం కోసం అన్నీ త్యాగం చేసే మహిళలు.. తమ విలువను తాము ఇతరులకు చేసే సేవలతోనే ముడిపెట్టుకుంటారు. ఫలితంగా, కేవలం తమ సంతోషం కోసమే ఖర్చు చేయడాన్ని వాళ్లు స్వార్థంగా భావిస్తుంటారట. అంతేకాకుండా, డబ్బు అనేది భద్రతకు ప్రతీక. కాబట్టి, తమకోసం ఖర్చు చేసుకుంటే, భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయేమో అనే భయం ఓవైపు, కుటుంబ సభ్యుల అవసరాలను పక్కనపెట్టి తాము వాడుకుంటున్నామనే అపరాధ భావన మరోవైపు వారిని వేధిస్తుంది. దాంతో, ఆడవాళ్లు ఖర్చులకు వెనకాడుతుంటారని మానసిక నిపుణులు చెబుతున్నారు.

**ఎలా బయటపడాలి?**

ప్రతినెలా బడ్జెట్ వేసుకునేటప్పుడు, ప్రత్యేకంగా మీకోసమే కొంత మొత్తాన్ని కేటాయించుకోండి. దానిని ఏ ఇతర అవసరాలకూ వాడకుండా, పూర్తిగామీ సంతోషం కోసమే ఖర్చు చేసుకోండి. మీ సంపాదనతోనే మీకు నచ్చిన వస్తువులను కొంటున్నారన్న విషయం మనసులో పెట్టుకోండి. అప్పుడు 'ఈ ఖర్చుకు నేను పూర్తిగా అర్హురాలిని' అనే ఆలోచన తప్పకుండా మీ మనసులోకి వస్తుంది. డబ్బుతోపాటు మీ సంతోషం, మీ మానసిక ప్రశాంతత కూడా ముఖ్యమేనని గ్రహించండి. మిమ్మల్ని మీరు గౌరవించుకోవడం అంటే స్వార్థం కాదు, అది మీ బాధ్యత అని గుర్తుంచుకోండి.

# సింహం - ఎలుక




**కథ:**

అనగనగా ఒక అడవిలో ఒక సింహం హాయిగా నిద్రపోతోంది. అదే సమయంలో ఒక చిన్న ఎలుక వచ్చి, సింహం శరీరంపై అటు ఇటు పరిగెడుతూ ఆటలాడటం ప్రారంభించింది. ఎలుక అల్లరి వల్ల సింహానికి నిద్ర చెడి, తీవ్ర కోపంతో లేచింది. అది తన పెద్ద పంజాతో ఎలుకను పట్టుకుని చంపబోయింది.

ఎలుక భయంతో వణుకుతూ, "మహారాజా! నన్ను క్షమించండి. నేను తెలియక చేశాను. నా ప్రాణాలు తీయకండి. నన్ను వదిలేస్తే, నేను ఎప్పటికైనా మీకు సహాయం చేయగలను" అని వేడుకుంది. ఆ మాటలకు సింహం నవ్వి, "ఇంత చిన్న ఎలుకవి, అడవికి రాజునైన నాకు నువ్వు సహాయం చేస్తావా?" అని హేళన చేస్తూనే, జాలిపడి దాన్ని వదిలేసింది. కొన్ని రోజుల తర్వాత, వేటగాళ్లు అడవిలో వేసిన ఒక పెద్ద బలమైన వలలో ఆ సింహం చిక్కుకు పోయింది. అది వల నుండి బయటపడలేక గట్టిగా గర్జించసాగింది. ఆ గర్జన విన్న చిన్న ఎలుక వెంటనే అక్కడికి వచ్చింది. సింహం పరిస్థితిని చూసి, ఏమాత్రం ఆలస్యం చేయకుండా తన పదునైన పళ్లతో ఆ వల తాళ్లను ఒక్కొక్కటిగా కొరికివేసింది. దాంతో సింహం వల నుండి సురక్షితంగా బయట పడింది. ఆ రోజు నుండి సింహం ఎలుకను తన ప్రాణ స్నేహితుడిగా చూసుకుంది.

# సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్‌లో 327 అసిస్టెంట్ మేనేజర్, జూనియర్ ఎగ్జిక్యూటివ్ ఖాళీలు

సెంట్రల్ వేర్‌హౌసింగ్ సంస్థలో ఉద్యోగం చేయాలనుకునేవారికి అవకాశం వచ్చింది. అసిస్టెంట్ మేనేజర్, జూనియర్ ఎగ్జిక్యూటివ్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతుంది.

**సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్‌లో 327 అసిస్టెంట్ మేనేజర్, జూనియర్ ఎగ్జిక్యూటివ్ ఖాళీలు**

సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ (జఔజ) 2026 రిక్రూట్‌మెంట్‌లో భాగంగా నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా 327 జూనియర్ ఎగ్జిక్యూటివ్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టులను భర్తీ చేయనుంది. ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. దరఖాస్తు ప్రక్రియ నేటి నుంచి ప్రారంభమైంది. నవంబర్ 15తో ముగుస్తుంది.

**పోస్టులు, ఖాళీల వివరాలు** (Post-Wise Details)

అసిస్టెంట్ మేనేజర్ (జనరల్)- 70
అసిస్టెంట్ మేనేజర్ (టెక్నికల్)- 60
అసిస్టెంట్ మేనేజర్ (ఫైనాన్స్)- 10
అసిస్టెంట్ మేనేజర్ (ఇంజినీరింగ్-సివిల్)- 22
అసిస్టెంట్ మేనేజర్ (ఇంజినీరింగ్-ఎలక్ట్రికల్)- 5
అసిస్టెంట్ మేనేజర్ (ఇంజినీరింగ్-మెకానికల్)- 4
జూనియర్ ఎగ్జిక్యూటివ్ (జనరల్)- 78
జూనియర్ ఎగ్జిక్యూటివ్ (టెక్నికల్)- 78

**అర్హతలు** (Qualifications)

అసిస్టెంట్ మేనేజర్ (జనరల్)- ఏదైనా పోస్ట్‌గ్రాడ్యుయేషన్ డిగ్రీ లేదా పోస్ట్‌గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఉత్తీర్ణత.
అసిస్టెంట్ మేనేజర్ (టెక్నికల్)- బీఈ, బీటెక్ (అగ్రికల్చర్, ఫుడ్ టెక్నాలజీ, ఫుడ్ సైన్స్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ లేదా బయోటెక్నాలజీ) ఉత్తీర్ణత.
అసిస్టెంట్ మేనేజర్ (ఫైనాన్స్)- బీకామ్‌తో పాటు ఫైనాన్స్, అకౌంటింగ్‌లో మూడేండ్ల అనుభవం లేదా ఏదైనా డిగ్రీతో పాటు సీఏ ఇంటర్, సీఎంఏ ఇంటర్ పూర్తి చేసి ఉండాలి.
అసిస్టెంట్ మేనేజర్ (ఇంజినీరింగ్-సివిల్), అసిస్టెంట్ మేనేజర్ (ఇంజినీరింగ్-ఎలక్ట్రికల్), అసిస్టెంట్ మేనేజర్ (ఇంజినీరింగ్-మెకానికల్)- సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్ ఉత్తీర్ణత.
జూనియర్ ఎగ్జిక్యూటివ్ (జనరల్)- ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు కంప్యూటర్ అప్లికేషన్స్, ఎంఎస్ ఆఫీస్‌లో పరిజ్ఞానం ఉండాలి.
జూనియర్ ఎగ్జిక్యూటివ్ (టెక్నికల్)- బీఎస్సీ (అగ్రికల్చర్, బోటనీ, జువాలజీ, బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ, ఫుడ్ సైన్స్) లేదా కెమిస్ట్రీతో పాటు కంప్యూటర్ అప్లికేషన్స్, ఎంఎస్ ఆఫీస్‌లో పరిజ్ఞానం ఉండాలి.

**వయసు**

2026, నవంబర్ 15 నాటికి అభ్యర్థుల వయసు 18 నుంచి 28 ఏండ్లలోపు ఉండాలి. ఓబీసీలకు 3, ఎస్సీ, ఎస్టీలకు 5, దివ్యాంగులు, ఎక్స్‌సర్వీస్‌మెన్‌లకు నిబంధనలకు తగిన వయోపరిమితి సడలింపు ఉంది.

**ఎంపిక**

అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు ఆన్‌లైన్ ఎగ్జామ్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, ఇంటర్వ్యూ, జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఆన్‌లైన్ ఎగ్జామ్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ద్వారా ఎంపిక చేస్తారు.
పరీక్ష 200 ఆబ్జెక్టివ్ ప్రశ్నలకు 200 మార్కులు, రెండు డిస్క్రిప్టివ్ ప్రశ్నలకు 30 మార్కులు మొత్తం 230 మార్కులకు ఉంటుంది.
పరీక్షలో నెగెటివ్ మార్కింగ్‌లో భాగంగా ప్రతి తప్పు సమాధానికి 1/4వ వంతు మార్కులు తగ్గిస్తారు.

**ఫీజు**

దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసుకోవాలి. దరఖాస్తు ఫీజు UR / EWS / OBCలకు రూ. 1350, ఎస్సీ, ఎస్టీ, మహిళలు, దివ్యాంగులు, ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు రూ. 500.

**వేతనం**

ఎంపికైనవారికి నెలకు అసిస్టెంట్ మేనేజర్‌లకు రూ. 40,000 నుంచి రూ. 1,40,000 వరకు, జూనియర్ ఎగ్జిక్యూటివ్‌లకు రూ. 29,000 నుంచి రూ. 93,000 వరకు ఇస్తారు.

**చివరితేదీ**

దరఖాస్తు ప్రక్రియ నేటి (అక్టోబర్ 17) నుంచి ప్రారంభమైంది. నవంబర్ 15లోగా దరఖాస్తు చేసుకోవాలి. ఇతర వివరాలకు వెబ్‌సైట్ www.cewacor.nic.in చూడండి.

# పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లపై అధికారుల పరిశీలన

- **అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు**

**భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి । రంగయ్య గారి శ్రీనివాస్ । అక్టోబర్ 23 । చేవెళ్ల నియోజకవర్గం :** అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి సంబంధించి అక్టోబర్ 26న నిర్వహించనున్న పరీక్షల నేపథ్యంలో చేవెళ్ల ఆర్డీఓ పార్థ సింహారెడ్డి, మొయినాబాద్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ వై. మల్లికార్జున్ రెడ్డి, ఎస్ఐ సత్యనారాయణ మొయినాబాద్ పరిధిలోని పలు పరీక్షా కేంద్రాలను సందర్శించి తనిఖీ చేశారు. కేజీ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల, వీజేఐటీ ఇంజనీరింగ్ కళాశాల, చైతన్య డీమ్డ్ టు బి యూనివర్సిటీ, జేబీఐటీ ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్షల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, సజావుగా జరిగేలా తీసుకుంటున్న చర్యలను సమీక్షించి, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లపై దృష్టి సారించారు. అక్టోబర్ 26న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.

# నీటి సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెరగాలి

- **ప్రతి ఇంట్లో నీటి పొదుపు అలవాటుగా మారాలి: బీఆర్ఎస్ నాయకుడు, శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్. రాజు నాయక్**

**భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి । రంగయ్య గారి శ్రీనివాస్ । అక్టోబర్ 23 । చేవెళ్ల నియోజకవర్గం :** నీటి వనరుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని బీఆర్ఎస్ నాయకుడు, శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్. రాజు నాయక్ సూచించారు. పెరుగుతున్న నీటి అవసరాలు, భవిష్యత్తులో తలెత్తే నీటి కొరతను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఇంట్లో నీటి పొదుపును రోజువారీ అలవాటుగా మార్చుకోవాలని కోరారు. కుళాయిలను అవసర మైనప్పుడే వినియోగించడం, ఉపయోగం పూర్తయిన వెంటనే మూసివేయడం, పైపుల్లో లీకేజీలను వెంటనే సరిచేయించడం ద్వారా నీటి వృథాను అరికట్టవచ్చన్నారు. ఇళ్ల ముందు ప్రదేశాలు, వాహనాలను శుభ్రం చేసేందుకు అవసరానికి మించి నీటిని వినియోగించకుండా ప్రత్యామ్నాయ పద్ధతులను పాటించాలని సూచించారు. వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యమిస్తూ ఇంకుడు గుంతలు, ఇతర వర్షపు నీటి నిల్వ పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించవచ్చని పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాల్లో నీటి సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నీటి సరఫరా కోసం వినియోగించే విద్యుత్‌ను కూడా పొదుపుగా ఉపయోగించాల్సిన అవసరం ఉందన్నారు. నీటిని వృథా చేయకుండా వినియోగించడం వ్యక్తిగత బాధ్యత మాత్రమే కాకుండా సమాజం పట్ల ప్రతి ఒక్కరికీ ఉన్న బాధ్యత అని పేర్కొన్నారు. నీటి సంరక్షణకు ప్రభుత్వాలు చేపట్టే కార్యక్రమాలకు ప్రజలు సహకరిస్తూ, తమ ఇళ్ల నుంచి మార్పును ప్రారంభించాలని ఎస్. రాజు నాయక్ పిలుపునిచ్చారు. ప్రతి నీటి బొట్టును కాపాడినప్పుడే భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించగలమని ఆయన అభిప్రాయపడ్డారు.

# ట్రాఫిక్ పోలీసుల నుంచి తప్పించుకునేందుకు బైకర్ యత్నం.. ఏం జరిగిందంటే?

వాహనాలను తనిఖీ చేసేందుకు ట్రాఫిక్ పోలీసులు డ్రైవ్ నిర్వహించారు. ఒక బైకర్ వారి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించాడు. వెనుక కూర్చొన్న అతడి భార్య అదుపుతప్పి బైక్ నుంచి కిందపడింది. అయినప్పటికీ ఆ వ్యక్తి బైక్‌ను ఆపకుండా అక్కడి నుంచి పారిపోయాడు.

**ట్రాఫిక్ పోలీసుల నుంచి తప్పించుకునేందుకు బైకర్ యత్నం.. ఏం జరిగిందంటే?**

**డెహ్రాడూన్:** వాహనాలను తనిఖీ చేసేందుకు ట్రాఫిక్ పోలీసులు డ్రైవ్ నిర్వహించారు. ఒక బైకర్ వారి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించాడు. వెనుక కూర్చొన్న అతడి భార్య అదుపుతప్పి బైక్ నుంచి కిందపడింది. అయినప్పటికీ ఆ వ్యక్తి బైక్‌ను ఆపకుండా అక్కడి నుంచి పారిపోయాడు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. (man tries to dodge traffic police) ఉత్తరాఖండ్‌లోని రుద్రపూర్‌లో ఈ సంఘటన జరిగింది. అక్టోబర్ 17న త్రిశూల్ చౌక్ వద్ద ట్రాఫిక్ పోలీసులు చెకింగ్ డ్రైవ్ చేపట్టారు. నంబర్ ప్లేట్లు లేని వాహనాలు, హెల్మెట్లు ధరించని ద్విచక్ర వాహనదారులను పట్టుకునేందుకు పోలీసులు తనిఖీలు నిర్వహించారు. కాగా, బైక్‌పై వస్తున్న ఒక వ్యక్తిని ఆపమని ట్రాఫిక్ పోలీసులు సంకేతం ఇచ్చారు. అయితే ట్రాఫిక్ పోలీసులను తప్పించుకునేందుకు అతడు ప్రయత్నించాడు. బైక్ వేగాన్ని పెంచాడు. ట్రాఫిక్ పోలీసుల పక్క నుంచి బైక్‌ను మళ్లించాడు. ఈ హఠాత్తు మలుపు వల్ల బైక్ వెనుక కూర్చొన్న ఆ వ్యక్తి భార్య అదుపుతప్పి రోడ్డుపై పడిపోయింది. అయినప్పటికీ ఆ వ్యక్తి పట్టించుకోలేదు. బైక్ నడుపుకుంటూ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. స్వల్పంగా గాయపడిన ఆ మహిళను ట్రాఫిక్ పోలీసులు పైకి లేపారు. ఒకరు రికార్డ్ చేసిన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడిలో వైరల్ అయ్యింది.

# 'ఇల్లెందు తాగునీటి సమస్యను పరిష్కరించాలి'

- **'ఇల్లెందు తాగునీటి సమస్యను పరిష్కరించాలి'**
- **తాగునీటి సమస్య, పైప్‌లైన్ లీకేజీని నియంత్రించాలని సిపిఎం ఆధ్వర్యంలో నిరసన**

**ఇల్లెందు, అక్టోబర్ 23 :** ఇల్లెందు పట్టణంలో తరచుగా వస్తున్న తాగునీటి సమస్య, పైప్‌లైన్ లీకేజీని నియంత్రించాలని సిపిఎం శ్రేణులు రోడ్డుపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం ఇల్లెందు మున్సిపాలిటీ పరిధిలో సాహితీ కాలేజీ రోడ్డులో లీకేజీని అరికట్టడంలో మున్సిపాలిటీ వైఫల్యం, నిర్లక్ష్యం కారణంగా రోజు 1,500 మంది పిల్లలు అవస్థలు పడుతున్నట్లు పేర్కొంటూ సిపిఎం నాయకులు రోడ్డుపై నీళ్లు ఉన్నచోట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానిక 15వ వార్డులోని మెయిన్ రోడ్డు నుండి సాహితీ కాలేజీ మార్గదర్శిని ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు వెళ్లేదారిలో గత నెల రోజులుగా మున్సిపాలిటీ పైప్ లైన్ లీకేజీ ఫలితంగా రోజూ 1,500 మంది పిల్లలు అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. మంత్రి మండలి ప్రత్యేక కమిటీ వేసినా తమ మున్సిపాలిటీకి పట్టదా, ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు, పాలకవర్గం స్పందించి నీటి లీకేజీని నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎల్‌నినో ఫలితంగా ప్రతి నీటి బొట్టును రక్షించండి, కాపాడండి, పొదుపు చేయండి అని ఓ వైపు ముఖ్యమంత్రి ప్రకటనలు ఇస్తుంటే మరోవైపు ఇల్లెందు మున్సిపాలిటీ పరిధిలో పైపులైను ఎక్కడపడితే అక్కడ లీకేజీలు అవుతున్నా పట్టించుకోవడం లేదని సిపీఎం జిల్లా నాయకులు అబ్దుల్ నబి, పార్టీ మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ కుమార్ ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో మన్యం మోహన్ రావు, షేక్ ఖాదర్ మాదారపు వెంకటేశ్వర్లు, రాజయ్య పాల్గొన్నారు.

Edited,Printed,Published and Owend by CHITLA DIVYA ,Printed at POTHUGANTI RACHANA , G2, TSRINIVAS, ROAD NO : 4 , RANGAREDDY , Hyderabad- 500035 . Published at H.NO : 177/P , PLOT NO : 402 ANJAMMA RESIDENCY , MANIKONDA , Hyderabad - 500089, Telangana. Editor : CHITLA VIJAYKUMAR REDDY , RNI : TGTEL/26/A0153 e-mail : bhavishyatprajapalana@gmail.com , Cell : 81061 86888